కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220


ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

దేశవ్యాప్త సమ్మె ఎందుకు?
'గెలాక్సీ లీడర్' సహా హౌతీల లక్ష్యాలపై 20 ఫైటర్‌జెట్స్‌తో ఇజ్రాయెల్ దాడులు
లోపలి పేజీల్లో
మోదీ ప్రభుత్వం ధనవంతుడిని మరింత సంపన్నుడిగా చేస్తోంది

సంపుటి 28, సంచిక: 19 | మంగళవారం | 08-07-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## అమ్మ పేరుతో ప్రతి ఇంట్లో
# రెండు మొక్కలు నాటాలి



- అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కలు పెంచాలి
- ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది
- మహిళలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది
- సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి
- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో వనమహోత్సవం ప్రారంభం



నాడు రాజీవ్ గాంధీ స్థానిక సంస్థలలో మహిళా రిజర్వేషన్లను తీసుకురావడం వల్లే పట్నం సునీత మహేందర్ రెడ్డి రంగారెడ్డి జిల్లాలో నాలుగు సార్లు జెడ్‌పిచైర్‌పర్సన్ కాగలిగారు. గద్వాల విజయలక్ష్మి జిహెచ్ఎంసి మేయర్, శ్రీలత డిప్యూటీ మేయర్ అయ్యారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ 33 శాతం మహిళా రిజర్వేషన్ రాబోతున్నాయి. 51 సీట్లకు అదనంగా మరో తొమ్మిది సీట్లు కలిపి మొత్తం 60 సీట్లు(టికెట్స్) మహిళలకు ఇప్పించి, గెలిపించుకొని చట్ట సభల్లోకి తీసుకెళ్లే బాధ్యత నేనే తీసుకుంటా.

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి

'పెద్దలు వనమే మనం, మనమే వనం' అని చెప్పారని, ప్రకృతిని మనం కాపాడుకుంటేనే ప్రకృతి మనల్ని కాపాడుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని దేశ ప్రధాని పిలుపునిచ్చారని, ప్రధాని పిలుపును సాదరంగా ఆహ్వానిస్తూ.. పిల్లలను పెంచే నైపుణ్యం కలిగి వున్న మహిళ అని, ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో రెండు మొక్కలు నాటలని పిలుపునిచ్చారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కను నాటాలని, ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని, మీ పిల్లల్లాగే నాటిన మొక్కలను సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని యూనివర్సిటీ ప్రాంగణంలో రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్సవం 2025 ను ప్రారంభించారు. ఆ తరువాత యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.అనంతరం స్థానిక శాసనసభ్యులు తరువాయి 2లో

## 'ఖేలో ఇండియా గేమ్స్' తెలంగాణలో నిర్వహించండి

- క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి
- కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఖేలో ఇండియా గేమ్స్2026'ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ ఎల్. మాండవీయకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియాతో పాటు జాతీయ క్రీడలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని పరిశీలించాలని తరువాయి 2లో



# 9న దేశంలో భారీ ఉద్యమాలకు నాంది సార్వత్రిక సమ్మె



**సమ్మెలో 25 కోట్ల మంది**

"జాతీయ సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన 25 కోట్ల మందికి పైగా కార్మికులు పాల్గొంటారని భావిస్తున్నాం.

- అనేక రాష్ట్రాల్లో బంద్ తరహా వాతావరణం చూస్తాం
- కేంద్ర ప్రభుత్వానికి సంప్రదింపులపై విశ్వాసం లేదు
- నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, దేశ ప్రజల కోసమే సమ్మె
- ఖాళీలను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు
- కనీస వేతనం రూ.26వేలు, కనీస పిఎఫ్ పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి
- ఏ పెన్షన్ లేనోళ్ళకు నెలకు రూ.6 వేలు ఇవ్వాలి
- 4 లేబర్ కోడ్‌లు అమలు చేయకపోతే పెట్టుబడులు రావంటున్నారు
- పెట్టుబడులు రాకపోవడానికి కారణం కార్మికులు కాదు.. అదానీ, అంబానీలే..
- బిఎంఎస్ అనుబంధ సంఘాల కార్మికులు సైతం సమ్మెకు మద్దతిస్తున్నారు

**కార్మిక, రైతాంగ సుదీర్ఘ పోరాటాలకు పది కేంద్ర కార్మిక సంఘాల సమ్మె కీలకం**

**ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్**

**న్యూఢిల్లీ :** జూలై 9న పది కేంద్ర కార్మిక సంఘాలు 17 పాయింట్‌ల చార్టర్ ఆఫ్ డిమాండ్‌లతో పిలుపునిచ్చిన జాతీయ సార్వత్రిక సమ్మె నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, నిరుద్యోగులు, కార్మికుల కోసం ఉద్దేశించినదని సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకురాలు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అన్నారు. 'ది హిందూ' ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, కార్మిక వర్గం, రైతు సమాజం, వ్యవసాయ కార్మికులను సుదీర్ఘ పోరాటానికి సిద్ధం చేయడానికి ఈ సమ్మె అత్యంత కీలకమైనదని ఆమె పేర్కొన్నారు. ట్రేడ్ యూనియన్ హక్కులను అణచివేస్తున్న ప్రభుత్వ చర్యలను ఆమె నిలదీశారు. భారతదేశానికి పెట్టుబడిదారులు రాకపోవడానికి కారణం కార్మికులు కాదని, ఒకటి లేదా రెండు కంపెనీలను ప్రోత్సహించే ప్రభుత్వ విధానమే అందుకు కారణమని ఆమె అన్నారు.

**ప్రశ్న : గతంతో పోలిస్తే ప్రస్తుత సమ్మె ప్రాసంగికత ఏమిటి?**

**అమర్‌జీత్ కౌర్ :** ప్రస్తుత సమ్మె ప్రాముఖ్యత ఏమిటంటే, భారతదేశంలో పెద్ద ఉద్యమాలకు ఇది నాంది అవుతుంది. ఇక భరించేది లేదు. ఈ ప్రభుత్వం నియామకాలను నిలిపివేసింది. యువతకు ఉద్యోగాలు సృష్టించడం లేదు. దానికి బదులు తక్కువ జీతాలతో, ఎటువంటి సామాజిక భద్రత లేకుండా పదవీ విరమణ చేసిన వారిని నియమించడం మొదలెట్టారు. ఇప్పటికే ఈ విధానాన్ని రైల్వేలో, ఉక్కు రంగంలో ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వంలో, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో దాదాపు 15 లక్షల ఉద్యోగ ఖాళీలు నోటిఫై అయి ఉన్నాయి. కానీ, ప్రభుత్వం నియామకాలకు సిద్ధంగా లేదు, బదులుగా అనేక ఉద్యోగాల ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తోంది. ఈ దేశంలో నిరుద్యోగం అనేది చాలా, చాలా తీవ్రంగా ఉండబోతుందనేది స్పష్టం. ప్రస్తుత ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించకూడదని నిర్ణయించుకున్నారు. వారు యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని (యుపిఎస్) కొనసాగిస్తామని చెబుతున్నారు. యుపిఎస్ అనేది జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్) కన్నా దారుణం. మీరు యుపిఎస్‌ను ఎంచుకుంటే, తిరిగి ఎన్‌పిఎస్ లేదా ఒపిఎస్‌కు మారేందుకు వీలు ఉండదు. ఇక మూడవది, మేము వ్యతిరేకించిన ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఉద్యోగకల్పన అనుసంధాన ప్రోత్సాహకం) విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తున్నది. దీని కోసం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఇపిఎఫ్ఒ)లో దాచుకున్న కార్మికుల డబ్బును యజమానులకు నిధులు సమకూర్చడానికి ఉపయోగిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం తరువాయి 2లో



## బిహార్ ఓటర్ల జాబితా సవరణపై 10న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ :** ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న సుప్రీంకోర్టు విచారించనున్నది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల చెల్లుబాటును పరిశీలించనున్నట్లు పేర్కొంది. పలువురు పిటిషన్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి బెంచ్ గురువారం కేసును విచారించేందుకు అంగీకరించింది. ఈ పిటిషన్లపై ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేయాలని బెంచ్‌ను సిబల్ కోరగా.. విచారణ జరుగుతుందని జస్టిస్ సుధాన్షు తెలిపారు. బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్ చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, టిఎంసి ఎంపి మహువా మొయిత్రాతో పాటు ఎడిఆర్ సంస్థ పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తరువాయి 2లో

## 10న మంత్రివర్గ సమావేశం

- స్థానిక సంస్థల ఎన్నికలు, గిగ్ వర్కర్లకు భద్రత చట్టం, సమగ్ర విత్తన చట్టంపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర మంత్రుల కు, సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తూ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సంబంధించిన అంశాలు, గిగ్ వర్కర్లకు భద్రత చట్టం, సమగ్ర విత్తన చట్టం, అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణ తేదీలు తదితర అంశాలపై చర్చించవచ్చు. అలా గే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఇందిరమ్మ ఇండ్లపై మ రోసారి కేబినెట్ సమావేశంలో చర్చ జరగవచ్చని సమాచారం.

## 10 పని గంటల విధానం వద్దు

**తక్షణమే జిఒ282ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి : కూనంనేని డిమాండ్**

ప్రజా పక్షం /హైదరాబాద్

మేడే త్యాగాల స్ఫూర్తితో బ్రిటిష్ కాలంలోనే సాధించుకున్న 8 గంటల పని హక్కును మార్చడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.రాష్ట్రంలోని వాణిజ్య ప్రదేశాలలో ఉద్యోగులు, కార్మికులను రోజుకు 10 గంటల పాటు పని చేసేందుకు యాజమాన్యానికి వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ. 282ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులకు భంగకరమని ఆయన విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తరువాయి 2లో

## గత బిఆర్‌ఎస్ పాలనలో
# ఎటిఎంలా మత్స్యశాఖ

- అవినీతి, అక్రమాలతో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం
- ఈ యేడాది 82 కోట్ల చేప పిల్లల విడుదలకు ఏర్పాట్లు
- చేప ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్ ఉండేలా కార్యాచరణ
- రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

గత బిఆర్‌ఎస్ పాలకులు మత్స్యశాఖను ఒక ఎటిఎంలా వాడుకున్నారని రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, క్రీడా, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. సోమవారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ఉజ్వల పార్కు సమీపంలో చేప పిల్లల పెంపకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తరువాయి 12లో




## బ్యాంకింగ్, బీమారంగాల నుంచి
# సమ్మెలో లక్షమంది

**ఫైనాన్సియల్ సెక్టార్ యూనియన్స్ జాయింట్ ఫోరం ప్రకటన**

- బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్రం యత్నం
- పార్లమెంట్‌లో బిల్లు పెట్టిన రోజే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో రెండు తెలుగు రాష్ట్రాలలోని బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన దాదాపు లక్ష మంది ఉద్యోగులు పాల్గొననున్నట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జాయింట్ ఫోరం ఆఫ్ ఫైనాన్సియల్ సెక్టార్ యూనియన్స్ (జెఎఫ్ఎఫ్ఎస్‌యు) ప్రకటించింది. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంభిస్తున్న తరువాయి 2లో



## గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టులో తీర్పు రిజర్వ్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్–1 పిటీషన్లపై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరువైపులా వాదనలు పూర్తవడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని పలువురు గ్రూప్–1 అభ్యర్థులు పిటీషన్లు దాఖలు చేశారు. ఏప్రిల్‌లో ఈ పిటీషన్లపై వాదనలు జరిగిన సందర్భంలో హైకోర్టు గ్రూప్–1 నియామకాలపై స్టే విధించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మాత్రం పూర్తి చేయొచ్చని హైకోర్టు టిజిపిఎస్‌సిని ఆదేశించింది. కాగా, హైకోర్టుకు మే నెలలో వేసవి సెలవు ఉండటంతో నెల రోజుల తర్వాత ఈ పిటీషన్లపై మరోసారి విచారణ ప్రారంభమైంది. న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు విచారణ నిర్వహించారు. విడతల వారీగా జరిగిన విచారణలో ఇరువైపుల న్యాయవాదులు సుదీర్ఘ వాదనలు వినిపించారు. మూల్యాంకనం, పరీక్షా కేంద్రాల కేటాయింపు, తరువాయి 2లో

## ఖనిజ ఉత్పత్తి, సరఫరాల వ్యవస్థ కాపాడుకునేందుకు
# ఉమ్మడిగా కృషి చేయాలి

**బ్రిక్స్ దేశాల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు**

**రియో డీ జనీరో :** కీలక ఖనిజాల ఉత్పత్తి, సరఫరా సేవల వ్యవస్థను కాపాడుకునేందుకు అనివార్యంగా ఉమ్మడి కృషి చేయాల్సిన అవసరం ఉందని బ్రిక్స్ దేశాల సదస్సులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు ఇచ్చారు. బ్రిక్స్ వార్షిక సదస్సులో మోదీ మాట్లాడుతూ, కీలకమైన ఖనిజ వనరులు, వాటి సాంకేతికతను కాపాడుకోవాలన్నారు. ఏ దేశం కూడా ఈ ఖనిజ వనరులను తమ స్వార్థ ప్రయోజనాల కోసం లేదా ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా ఉపయోగించకుండా కాపాడేవిధంగా పూర్తి భరోసా ఉండాలని, ఈ కీలక ఖనిజ వనరల సరఫరా వ్యవస్థను కాపాడుకోవాలని అన్నారు. శాంతి, ప్రగతి,స్థిరత్వంతో కూడిన ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకోవడానికి సహకారం, సమానత్వం, సమ్మిళితత్వ సూత్రాలను పాటిస్తూ, అన్ని దేశాలూ ఉమ్మడి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. 'బహుళపక్షాలమధ్య ఐక్యత, ఆర్థికాంశాలు,కృత్రిమ మేధ' అనే అంశంపై జరిగిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. కృత్రిమ మేధను ఉపయోగించడానికి,దాపరికంలేకుండా, దుర్వినియోగానికి అవకాశం లేకుండా కృత్రిమ మేధను వినియోగించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రామాణికతలను సృష్టించాలని ఆయన కోరారు. కీలకమైన ఖనిజవనరులను ఎగుమతి చేయడంపై చైనా ఆంక్షలు విధించడంతోపాటు ఈ రంగంలో దాపరిక విధానాలు కూడా అనుసరించడంపై ఆందోళన వ్యక్తమవుతున్న పరిస్థితులమధ్య ప్రధానమంత్రి పైవిధంగా వ్యాఖ్యానించారు. "కీలకమైన తరువాయి 12లో



## వాణిజ్య ఒప్పందాలకు ట్రంప్ ఒత్తిడి



బుధవారంలోపు (జులై 9వ తేదీ) వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై ఒత్తిడి చేశారు. పెంచిన వాణిజ్య సుంకాల అమలును వాయిదా వేస్తూ గడచిన ఏప్రిల్ నెలలో ట్రంప్ విధించిన గడువు జులై తొమ్మిదో తేదీతో ముగుస్తుంది. ఈలోపు దేశాలన్నీ కొత్త వాణిజ్య ఒప్పందాలు తరువాయి 12లో



## సమాజానికి సేవ చేసేందుకు యువత ముందుకు రావాలి

**కెయు స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**


ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

నేటి దేశ యువత పరిశోధన, అభివృద్ధికి కొత్త పరిశోధన మైలురాళ్లను నిర్దేశిస్తున్నారని గవర్నర్, కాకతీయ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవ సందర్భంగా వివిధ ఫ్యాకల్టీ పిహెచ్‌డి అభ్యర్థులకు పట్టాలు, వివిధ సబ్జెక్టుల మొదటి ర్యాంక్ పొందిన వారికీ గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేస్తూ విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, ఆహ్వానితులు, ప్రముఖులను ఉద్దేశించి, కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇజ్రాయెల్ నన్ను చంపాలని చూస్తోంది : పెజెష్కియన్



**మాస్కో:** ఇజ్రాయెల్ అధికారులు తనను హత్య చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఇరాన్ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ చెప్పారు. "వాళ్ళు నన్ను అంతకుముందు హత్య చేసేందుకు ప్రయత్నం చేశారు. యెస్, నిజమే, హత్యకు తగిన చర్యలు తీసుకున్నారు, కానీ హత్య చేయలేకపోయారు, విఫలమయ్యారు'' అని చెప్పారు. అమెరికా జర్నలిస్ట్ టక్కర్ కార్ల్‌సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయం చెప్పారు. ఆయన చెప్పిన ప్రకారం పది రోజుల క్రితం పెజెష్కియన్‌పై హత్యా ప్రయత్నం జరిగింది. "మేం ఏ విధంగా సమస్యలను అధిగమించి ముందుకు వెళ్ళాలి?అనే విషయంపై సమావేశం జరుపుతున్నాం, ఆ సమయంలో మేం సమావేశమైన ప్రదేశంపై బాంబు దాడి చేసే ప్రయత్నం జరిగింది'' అని ఆయన చెప్పారు.

## 'గెలాక్సీ లీడర్' సహా హౌతీల లక్ష్యాలపై
# 20 ఫైటర్‌జెట్స్‌తో ఇజ్రాయెల్ దాడులు





**దుబాయ్:** యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న హౌతీ ఉగ్రవాదుల లక్ష్యంగా ఇజ్రాయెల్ సోమవారం తెల్లారకముందే గగనతల దాడులు ప్రారంభించింది. దీంతో హౌతీలు కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో ఎదురుదాడులు ప్రారంభించారు. యెమెన్‌లో హౌతీలకు ఉన్న అనేక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని 20 యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ దాడులు చేసిందని ఆ దేశ రక్షణశాఖ ధృవీకరించింది. ఆదివారంనాడు ఎర్ర సముద్రంలో వెళుతున్న లైబీరియా నౌకను లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులు చేశారు. దీంతో నౌకలో మంటలు చెలరేగాయి. నావికా సిబ్బంది కూడా చేసేదిలేక ఓడను వదిలి వెళ్ళిపోయారు. ఈ ఘటన తర్వాత ఇజ్రాయెల్ ఎఫ్–16 యుద్ధ విమానాలతో దాడులు ప్రారంభించింది. తదుపరి మరిన్ని దాడులు చేస్తామని కూడా ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ హెచ్చరించారు. హౌతీలు ఏం చేసినా అది ఇరాన్ చేసినట్లేనని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ వైపు ఎవరు వేలెత్తి చూపించినా ఆ వేలును నరుకుతామన్నారు. హౌతీలు తమ చర్యలకుగాను భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. అదేవిధంగా హౌతీల మిలిటరీ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సారీ మాట్లాడుతూ, తాము దీర్ఘకాలం పాటు స్థిరమైన యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. హోదైదాహ్, రాస్ ఇలాస్, సలీఫ్ ఓడరేవులతోపాటు రాస్ ఖతిఫ్ విద్యుత్ కేంద్రంపై కూడా దాడులు చేసింది. 'గెలాక్సీ లీడర్' భారీ వాణిజ్య నౌకపై కూడా ఈ దాడులు జరిగాయి. 2023లో హౌతీ ఉగ్రవాదులు ఈ గెలాక్సీ లీడర్ నౌకను హైజాక్ చేసి ఇప్పటివరకూ తమ అధీనంలో ఉంచుకున్నారు. సముద్రతల గస్తీకి, ఆపరేషనల్ ప్లానింగ్‌కు ఈ నౌకను హౌతీలు ఉపయోగించుకుంటున్నారని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడిఇఎఫ్) తెలిపింది. ఈ నౌకలో ఉన్న వివిధ దేశాలకు చెందిన 25 మంది నావికాదళ సిబ్బందిని కూడా హౌతీలు బంధించారు. ఇలా బందీలైనవారిలో ఫిలిప్పైన్స్, బల్గేరియా, రుమేనియా, ఉక్రేన్, మెక్సికో దేశాలకు చెందిన నావికా సిబ్బంది ఇంకా హౌతీలకు బందీలుగా ఉన్నారు. అంతర్జాతీయ సముద్ర జలాలలో వాణిజ్య నౌకల కదలికలను తెలుసుకుని దాడులు చేయడానికి వీలుగా హౌతీ ఉగ్రవాదులు ఈ నౌకలో రాడార్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకుని తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారని ఐ డి ఎఫ్ చెప్పింది. ఇజ్రాయెల్‌కు, తమ శత్రుదేశాల నౌకలకు వ్యతిరేకంగా దాడులు చేసేందుకు, ఆయుధాలు చేరవేసేందుకు హౌతీ ఉగ్రవాదులను ఇరాన్ దేశం పెంచి పోషిస్తోందని, వారి లక్ష్యాలను దెబ్బతీసేందుకే దాడులు చేశామని ఐ డి ఎఫ్ తెలిపింది.

## సుమీ బోర్డర్ జంక్షన్ రష్యా స్వాధీనం
### ఉక్రేన్‌పై 100 డ్రోన్లతో దాడి

**లుగాన్స్క్ :** రష్యాకు ఉక్రేన్‌లోని సుమీ రీజియన్‌కు మధ్య సరిహద్దులలో ఉన్న ఐదు కిలోమీటర్ల ప్రాంతం అంతా పూర్తిగా తమదేశం అధీనంలోకి వచ్చిందని రష్యా సైనిక నిపుణుడు ఆండ్రీ మారోచ్‌కో చెప్పారు. సుమీ ప్రాంతంలోని బెస్సలోవ్‌కా గ్రామాన్ని విముక్తి చేసిన తర్వాత రష్యా జాతీయ సరిహద్దుల్లో సుమీ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తూ ఉన్న చౌరాస్తా సరిహద్దు ప్రాంతం తమ అధీనంలోకి వచ్చిందని ఆయన సోమవారంనాడు టాస్ వార్తా సంస్థకు చెప్పారు. ఇదిలా ఉండగా, ఉక్రేన్ రాజధాని కీవ్ పౌర ప్రాంతాలపై రష్యా సోమవారం తెల్లారకముందే 100 డ్రోన్లతో దాడులు చేసిందని చెప్పడాన్ని రష్యా సైనిక వర్గాలు తిరస్కరించాయి. ఉక్రేన్ డ్రోన్లతో దాడులు చేస్తుందన్న భయంతో రష్యా విమానాశ్రయాలలో వందలాది విమానాలు గాల్లోకి ఎగరకుండా ఉండిపోయాయనీ, దీంతో వారాంతంలో రష్యా ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి గందరగోళ పరిస్థితి తలెత్తిందని ఉక్రేన్ రవాణాశాఖాధికారి చేసిన ప్రకటనను కూడా క్రెమ్లిన్ వర్గాలు తోసిపుచ్చాయి.


అదేవిధంగా గడచిన 24 గంటల్లో రష్యా చేసిన దాడుల్లో కనీసం 10 మంది పౌరులు మరణించారనీ, మరో 38 మంది గాయపడ్డారనీ, వీరిలో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారని ఉక్రేన్ అధికారులు చెప్పారు. ఇటీవలికాలంలో రష్యా తన దాడులను ఉద్ధృతం చేసింది. గడచిన వారంలో 1270 డ్రోన్లను, 39 క్షిపణులు, మరో 1000 శక్తిమంతమైన గ్లైడ్ బాంబులను ఉక్రేన్‌పై ప్రయోగించిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సోమవారం నాడు ప్రకటించారు.

## ఎలాన్‌మస్క్ పార్టీ పెట్టడం హాస్యాస్పదం : ట్రంప్



**న్యూయార్క్:** ప్రపంచ కుబేరుడు, టెస్లాన్–స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్‌మస్క్ కొత్తపార్టీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శలు చేశారు. ఆయన కొత్త పార్టీ పెట్టడం హాస్యాస్పదమైన విషయమని అన్నారు. ఆయన పూర్తిగా తప్పుదారి పట్టారని, ఆయన చర్యలు హాస్యాస్పదమైనవని విమర్శించారు. ''అమెరికన్ పార్టీ'' పెడుతున్నట్లు ట్రంప్‌కు ఒకప్పటి మిత్రుడు మస్క్ శనివారంనాడు ఎక్స్ వేదికగా ప్రకటించారు. ''ఇలా ఒక పార్టీని ప్రారంభించడం నా దృష్టిలో హాస్యాస్పద చర్య'' అని ఆదివారంనాడు ట్రంప్ పాత్రికేయులతో అన్నారు. ఎయిర్‌ఫోర్స్ ఒన్ విమానాలో ప్రయాణిస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. అమెరికాలో ఎప్పుడూ రెండు పార్టీల వ్యవస్థ మాత్రమే ఉంటుందన్నారు. ఇప్పుడు కొత్తగా మూడోపార్టీని ప్రారంభించడం గందరగోళాన్ని జోడించినట్లే కాగలదన్నారు. ''మస్క్ పూర్తిగా దారితప్పడం నాకు విచారంగా ఉంది'' అని ట్రూత్ సోషల్‌లో రాశారు. గడచిన ఐదు వారాలుగా వినాశకరమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు సబ్సిడీల ప్రోత్సాహాన్ని ఆపేయాలని కోరుకున్న మస్క్ ప్రణాళిక దెబ్బతినడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. పైగా నాసా అడ్మినిస్ట్రేటర్‌గా తన మిత్రుణ్ణి నియమించాలని ఆయన తనను అడిగి అసబద్ధంగా ప్రభావితం చేయాలని చూశారని విమర్శించారు. ఎలాన్‌మస్క్ కార్పొరేట్ సంస్థతో భాగస్వామ్యంలో ఉన్న అతిపెద్ద నాసా వంటి సంస్థను నడపడానికి ఆయన స్నేహితుణ్ణి నియమించాలని అడగడం, మస్క్ కూడా అంతరిక్ష వ్యాపారంలో నిమగ్నమై ఉండటంవల్ల ఈ నియామకంలో ఎంతమాత్రం ఔచిత్యం ఉండదన్నారు.

## మయన్మార్‌లో ఘర్షణలు
# భయంతో 4వేలమంది భారత్‌కు వలస



**నేపిడా:** మయన్మార్‌లో ఘర్షణాత్మక ప్రాంతాలలో గడచిన నాలుగు రోజులుగా భారీ ఎత్తున అంతర్గత యుద్ధం జరుగుతోంది. దీంతో భయభ్రాంతులైన ప్రజలు గడచిన నాలుగు రోజులుగా భారత్‌కు తరలివెళ్ళారు. భారత్ ఈశాన్యప్రాంత రాష్ట్రం మిజోరాంలోని ఉన్నతాధికారులు సోమవారంనాడు ఈ విషయం వెల్లడించారు. సైనికుల ఆధిపత్యాన్ని తిరస్కరించిన చిన్‌లాండ్‌లోని స్థానిక ప్రజాదళాలు సైన్యంతో ఉద్ధృత యుద్ధం చేస్తున్నాయి. దీంతో భయంతో ఆ ప్రాంతంలోని ప్రజలు దట్టమైన అడవులలోంచి ప్రయాణించి మయన్మార్ వదలి మిజోరాం చేరుకున్నారు. ప్రత్యర్థి చైనా సాయుధగ్రూపులతో జరిగిన ఘర్షణల కారణంగా స్థానిక ప్రజలు భయపడి మిజోరాంకు చేరుకున్నారని ఆ రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి వన్‌లాల్ మావియా చెప్పారు. ఇలా భయంతో వచ్చినవారికి భారత్‌లో బంధువులు ఉన్నారు. వారి ఇళ్ళకు వీరంతా తరలివచ్చారు. మరికొంతమంది నీడ లేక కమ్యూనిటీ హాల్స్‌లో తలదాచుకున్నారు. మిజోరాంలో ఇప్పటికే 30 వేలమంది మయన్మార్ ప్రజలు ఆ దేశం నుండి పారిపోయివచ్చి తలదాచుకున్నారు. ఈ విధంగా మయన్మార్ నుండి భారత్‌కు వలసలు పెరుగుతున్నాయి. 2021లో మయన్మార్‌లో సైనిక జుంటా పాలకుల ముఠా అధికారం చేపట్టినప్పటినుండీ ఆ దేశంలో అంతర్గత సంఘర్షణలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. దేశంలో ప్రజలు ఎన్నుకున్న పాలకులంతా జైళ్ళల్లో రాజకీయఖైదీలుగా మగ్గుతున్నారు.

## ఇరాక్ గుహల్లో గాలింపు చర్యలు
### ఎనిమిదికి పెరిగిన టర్కీ మృతులు

**బాగ్దాద్:** ఉత్తర ఇరాన్‌లోని గుహల్లో జరుగుతున్న గాలింపు చర్యల్లో ఇప్పటివరకూ ఐదుగురు టర్కీ సైనికులు మరణించగా సోమవారం మీథేన్ గ్యాస్ బారినపడి మరో ముగ్గురు సైనికులు మరణించారు. మరణించిన టర్కీ సైనికుల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. 2022 మేలో ఈ ప్రాంతంలో కుర్దిష్‌లు జరిపిన కాల్పుల్లో మరణించిన టర్కీ సైనికుడి జాడ తెలుసుకోవడంకోసం ఆ దేశసైనికులుగుహల్లోముమ్మరగాలింపు చర్యలు చేస్తున్నారు. ఇరాక్–కుర్దిష్‌లమధ్యజరుగుతున్నయుద్ధాన్ని నివారించేందుకు టర్కీ మధ్యవర్తిపాత్ర నిర్వహించింది. టర్కీ మధ్యవర్తిత్వం కారణంగా కుర్దిష్‌లు 40 సంవత్సరాలుగా చేస్తున్న సాయుధ పోరాటాన్ని ఆపేశారు.ఇది టర్కీకి గొప్ప విజయం. జైలుపాలైన పికెకె నాయకుడు అబ్దుల్లా ఓక్లాన్ ఇచ్చిన పిలుపుతో నిషేధిత కుర్దిష్ ఉగ్రవాద బృందం కాల్పుల విరమణనుపాటించింది. కుర్దిష్ వర్కర్స్ పార్టీ (పికెకె) గ్రూపును రద్దుచేస్తున్నట్లు వారు ప్రకటించారు. 1984లో ప్రారంభమైన ఈ యుద్ధంలో ఇప్పటివరకూ 40,0000మంది మరణించారు. తమపై దాడి చేస్తే తప్ప పికెకె సభ్యులు తిరిగి ఆయుధాలు ముట్టుకోరని ఆ సంస్థ ప్రకటించింది. కుర్దిష్ ఫైటర్లు నాలుగు సంవత్సరాక్రితం కాల్చి చంపిన టర్కీ సైనికుడి అవశేషాలకోసం టర్కీ సైనికులు గాలిస్తున్నారు.

## విధానం వద్దు
(మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఇలాంటి జిఓల ద్వారా దొడ్డిదారిన అమలు చేయడం సరైంది కాదని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఒకవైపు దేశవ్యాప్తంగా ఈనెల 9న 4 లెబర్ కోడ్ల రద్దు చేయాలని సార్వత్రిక సమ్మెకు సిద్ధమైన తరుణంలో ఇలాంటి తిరోగమన జిఒ జారీ చేయడం ఎంత మాత్రం సమంజసం కాదని కూనంనేని అన్నారు. ఈ జిఓలో కార్మికులు 10 గంటలు పని చేసే సమయంలో ఓవర్ టైమ్ ఇవ్వాలని, ఆరు గంటలకు ఒకసారి అరగంట విశ్రాంతి ఇవ్వాలని, వారానికి 48 పని గంటలు మించొద్దని ఉన్నప్పటికీ, ఆచరణ సాధ్యం కాదని, ఎందుకంటే తూతూ మాత్రం తనిఖీల ఉంటాయని స్పష్టం చేశారు. 10 గంటల పని విధానం పెట్టడం అంటే చిన్నగా 10 గంటల పని విధానానికి అలవాటు చేయడమని, విరామం సమయంలో ఓటిల పేరుతో వెట్టి చాకిరి చేయించుకోవడమేనన్నారు.కార్మిక శాఖ అధికారులు పట్టించుకోని ఉదంతం కళ్ళ ముందటే ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 10 గంటల పని విధానం అమలుకు అనుమతి ఇస్తూ జారీ చేసిన జిఓ282ను ఉపసంహరించుకోవాలని కోరారు.

**సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు :** 4 లేబర్ కోడ్లతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న 10కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన జాతీయ సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కూనంనేని తెలిపారు. సమ్మెకు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు సంఘీభావంగా నిలవాలని కోరారు.

## విచారణ
(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియను అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని మనోజ్ ఝా కోరారు. ఇసి ఉత్తర్వులు ఉత్తర్వు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కువ్యక్తిగత స్వేచ్ఛ), ఆర్టికల్ 325 (కులం, మతం, లింగం ఆధారంగా ఎవరినీ ఓటరు జాబితా నుంచి మినహాయించకూడదు), ఆర్టికల్ 326 (18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులు)లను ఉల్లంఘిస్తుందని.. ఆదేశాలను రద్దుచేయాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రాజ్యాంగంలోని నిబంధనలు ఉల్లంఘించిందని మొయిత్రాఆరోపించారు.

## ఉద్యమాలకు నాంది
(మొదటి పేజీ తరువాయి)

కింద పనిదినాలను పెంచాలని, అన్ని రంగాలకు నెలకు జాతీయ కనీసవేతనంగా రూ.26,000, కనీస పిఎఫ్ పెన్షన్‌గా నెలకు రూ.9,000, ఏ పెన్షన్ పథకాల పరిధిలోకి రాని వారికి నెలకు రూ.6,000 నెలవారీ పెన్షన్ ఉండాలని మేము డిమాండ్ చేస్తున్నాము.

**ప్రశ్న : ఈ డిమాండ్లపై ప్రభుత్వం మీతో ఏదైనా చర్చలు జరిపిందా?**

**అమర్‌జీత్ కౌర్ :** గత సంవత్సరం మేము కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కలిసిన సందర్భంలో మా డిమాండ్ల గురించి వివరణాత్మక ప్రెజెంటేషన్ చేసాము. ఈడిమాండ్లను తాను అధ్యయనం చేస్తానని ఆయన మాకు చెప్పారు. కానీ, దేశంలో కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈప్రభుత్వానికి సం ప్రదింపులపై విశ్వాసం ఉండదు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సి) దశాబ్దానికి పైగా సమావేశం కాలేదు. ఐఎల్‌సిని సమావేశపరచమని మాండవియాను మేము కోరాము. లేబర్‌కోడ్‌లను కేంద్రం అమలు చేస్తుందని మార్చిలో మాండవియా చెప్పారు. లేబర్ కోడ్‌లను అమలు చేసిన రోజు వాటి కాపీలను తగలబెట్టాలని, మే 20న సమ్మె చేయాలని మేము నిర్ణయించుకున్నాము.

సరిహద్దుల్లోని పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, మేము సమ్మెను జూలై 9కి వాయిదా వేశాము. కానీ ప్రభుత్వానికి అటువంటి ఆలోచనలు లేవు. లేబర్ కోడ్‌ల ప్రకారం కార్మిక చట్టాలను మార్చాల్సిందిగా ప్రధానమంత్రి కార్యాలయం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సలహా లేఖలు పంపుతోంది. రాష్ట్రాలు లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్నాయని, నిరసనలు వారి వైపు మళ్ళించాలని కేంద్ర ప్రభుత్వం, భారతీయ మజ్దూర్ సంఘ్ చె బుతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు మినహా, ఎవరూ ఈ కోడ్‌లను నోటిఫై చేయలేదు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వానికి చాలా స్పష్టంగా తెలుసు. కాబట్టి వారు డబుల్ గేమ్ ఆడుతున్నారు. కేంద్రం 29 చట్టాలను కలిపి క్రోడీకరించింది. కోడ్‌ల ఆధారంగా, వారి నియమాలు, చట్టాలను మార్చమని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల ను అడుగుతోంది. ట్రేడ్ యూనియన్లు రాష్ట్రప్రభుత్వాలతో పోరాడుతాయి, మేము పోరాడుతూనే ఉంటాం. లేబర్ కోడ్‌లను అమలు చేయవద్దని రాష్ట్రాలను హెచ్చరించాము. మేము దానిపై పోరాడుతాము.

**ప్రశ్న : సులభతర వ్యాపారం(ఈజ్ ఆఫ్ దూ యింగ్ బిజినెస్) కోసం, పెట్టుబడులను ఆకర్షించడానికి కోడ్‌లు అవసరమని ప్రభుత్వం చెబుతోంది..**

**అమర్‌జీత్ కౌర్ :** కార్మిక కోడ్‌లను అమలు చేయకపోతే రాష్ట్రాల్లో పెట్టుబడులు ఉండవని వారు రాష్ట్ర ప్రభుత్వాలను భయపెడుతున్నారు. రాష్ట్రాలు భారత రాజ్యాంగాన్ని, కార్మిక చట్టాలను పాటించాలి. నిజమైన యజమానులు, పెట్టుబడిదారులకు స్థిరత్వం ముఖ్యం. అలాగే పారిశ్రామిక వృద్ధికి పారిశ్రామిక శాంతి కీలకం అని వారికి తెలుసు. పెట్టుబడులు తగ్గడానికి కారణం కార్మికులు కాదు.దీనికి మన ప్రభుత్వ ఆర్థిక, సామాజిక విధానాలు, ప్రపంచ ఆర్థిక మందగమనం కారణాలు. మతపరమైన దాడులు సర్వసాధారమైనవిగా మారిన దేశంలోకి విదేశీ పెట్టుబడిదారులు ఎందుకు రావాలి? శాంతిభద్రతలు ఒక తీవ్రమైన ప్రశ్న. క్రోనీ క్యాపిటలిజం(ఆశ్రిత పెట్టుబడిదారులు) కూడా పెట్టుబడిదారులకు మరొక అడ్డంకి. వనరులు అధికంగా అదానీ, అంబానీకి అప్పగించబడుతున్నాయి. మన ప్రభుత్వం రెండు కార్పోరేట్లకు మద్దతు ఇస్తుందని , ఈ పోటీలో సమాన అవకాశాల పరిస్థితి లేదని తెలిసినప్పుడు పెట్టుబడిదారులు ఎందుకు వస్తారు? కాబట్టి దీనికి కార్మికులు బాధ్యత వహించరు. కార్మికుల ఆందోళనలు ఇక్కడ అణచివేయబడుతున్నాయి.

**ప్రశ్న : ఈసారి ఈ సమ్మెకు ఎన్ని రంగాలు స్పందిస్తాయి?**

**అమర్‌జీత్ కౌర్ :** బ్యాంకులు, బీమా కంపెనీలు, ఉక్కు రంగం, బొగ్గు రంగం, ఖనిజాలు, పెట్రోలియం రంగం, కాపర్ రంగం, కొన్ని విమానాశ్రయాలలో సమ్మె నోటీసులు అందాయి. రైల్వే కార్మికులు సమ్మెకు మద్దతుగా సమీకరణలు చేస్తారు, కానీ రైల్వేలో సమ్మె ఉండదు. రక్షణ ఉత్పత్తుల రంగం సమ్మెకు వెళుతోంది. వారు ప్రతి చోటా సమ్మె నోటీసులు ఇచ్చారు. అన్ని రాష్ట్రాలు, ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారు. అస్సాం, తమిళనాడు, గోవా, పంజాబ్, బీహార్, కేరళ, పశ్చిమ బెంగాల్, అనేక ఇతర రాష్ట్రాలలో 'బంద్ వంటి' వాతావరణం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీలను యూనియన్లు సంప్రదించాయి. వారు తమ మద్దతును ప్రకటించారు. సందేశం వెళ్లింది. బిఎంఎస్ అనుబంధంగా ఉన్న యూనియన్‌ల కార్మికులు మద్దతు ప్రకటించారు. ఈ సమ్మె కార్మిక వర్గాన్ని, రైతు సమాజాన్ని, వ్యవసాయ కార్మికులను సుదీర్ఘ పోరాటానికి సిద్ధం చేయడానికి అత్యంత ముఖ్యమైనది.

## తీర్పు రిజర్వ్
(మొదటి పేజీ తరువాయి)

మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య, అభ్యర్థుల మార్కుల వివరాలు ఇలా చాలా అంశాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు వాదించారు. గ్రూప్–1 అక్రమాలపై సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు. ఉద్యోగాలకు ఎంపికవని అభ్యర్థులు అపోహలతో పిటిషన్లు దాఖలు చేశారని, పారదర్శకంగా మూల్యాంకనం జరిగిందని టిజిపిఎస్‌సి తరఫు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. నిబంధనల ప్రకారమే పరీక్షా కేంద్రాల కేటాయింపు జరిగిందని వాదించారు. ఎంతమంది పరీక్షకు హాజరయ్యారనే విషయంలో నామినల్ రోల్స్‌తో పాటు అభ్యర్థుల వేలిముద్రలను పరిగణలోకి తీసుకొని పూర్తి వివరాలు వెల్లడించామన్నారు. తెలుగులో మెయిన్స్ రాసిన అభ్యర్థులు తక్కువ సంఖ్యలో గ్రూప్1కు ఎంపికయ్యారని, ఇంగ్లిష్‌లో రాసిన వాళ్లు తమ ప్రతిభ ఆధారంగానే గ్రూప్1కు ఎంపికయ్యారు తప్పితే టిజిపిఎస్‌సికి ఎక్కడ తెలుగు భాష పట్ల వివక్ష లేదని కోర్టుకు తెలిపారు.

**వాదనలు మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలి :** గ్రూప్1 నియామకాలపై ఉన్న స్టేను తొలగించాలని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటీషన్‌లపైనా వాదనలు ముగిశాయి. సంవత్సరాల తరబడి కష్టపడి ఉద్యోగం సాధించినా కోర్టు కేసుల వల్ల సకాలంలో నియామకాలు జరగడంలేదని ఇంప్లీడ పిటీషనర్ల న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులు వేసిన పిటీషన్లతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో నష్టం జరుగుతోందని వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసిం ది. వాదనలు మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని జడ్జి తెలిపారు.

## సమ్మెలోకి లక్షమంది
(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలైన బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ రంగాలను కూడా ప్రభావితం చేస్తూ వాటి మనుగడకే ప్రమాదకరంగా తయారయ్యాయని, ఈ విధానాలను ప్రతిఘటిస్తామని జెఎఫ్‌ఎఫ్‌ఎస్‌యు హెచ్చరించింది. హైదరాబాద్‌లోని ఎపిటిబిఇఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ సంస్థల ఉద్యోగులు, అధికారుల యూనియన్లతో కూడిన జెఎఫ్‌ఎఫ్‌ఎస్‌యు నాయకులు బి.ఎస్.రాంబాబు, సమద్ ఖాన్ (ఎపిటిబిఇఎఫ్ – ఎఐబిఇఎ), ఫణికుమార్ (ఎఐబిఓఎ), టివిఎన్‌ఎస్.రవీంద్రనాథ్ (ఎస్‌సిజెడ్ఐఇఎఫ్), టి.సతీష్ (ఎన్‌ఎఫ్‌ఆర్‌ఆర్‌బిఇ), జి.తిరుపతయ్య (ఎల్‌ఐసిఇయు), కె.గంగాధర్ నాయుడు, ఎం.హరీష్‌బాబు (బిఇఎఫ్ఐ), ఎస్.గుణశేఖర్, ఎల్.మద్దిలేటి(ఐసిఇయు), యూనియన్ల నాయకులు డి.గిరిధర్, ఆర్.శ్రీనివాస్, మహ్మద్ జావెద్ తదితరులు మాట్లాడారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, ఇప్పటికైనా ఈ విధానాలను విరమించుకోనట్లయితే పార్లమెంట్‌లో బిల్లు పెట్టిన రోజే దేశవ్యాప్తంగా బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థలలో నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ సంస్థలలో తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్న సిబ్బంది పనిభారంతో సతమతమౌతుంటే, కొత్తగా పని గంటలను పెంచాలనే ప్రతిపాదనను తీసుకురావడం గర్హనీయమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పరిరక్షణ, ఉద్యోగులు, కార్మికులు, ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థలను కాపాడాకోవాల్సిన అవసరం ఉందని, ఇందు కోసం ఈ నెల 9న జరిగే సమ్మెకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ కంపెనీలను బలోపేతం చేయాలని, తాత్కాలిక, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ విధానాన్ని రద్దు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ సంస్థలలో తగినంత శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ ప్రధాన కార్యదర్శి టివిఎన్‌ఎస్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ ఇన్స్యూరెన్స్ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా దాడి చేస్తుందని, వంద శాతం ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ ఇన్స్యూరెన్స్ సంస్థలను విదేశీ సంస్థలకు దారాదత్తం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమ భవిష్యత్ కోసం చేసే ఇన్స్యూరెన్స్ పాలసీల ప్రిమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని, ఇన్స్యూరెన్స్ వ్యాపారంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను నిరోధించాలని, ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీలను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఎఐబిఓఎ (ఎపి,టిఎస్) అధ్యక్షులు ఫణికుమార్ మాట్లాడుతూ నేషనల్ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి అందరికీ నిర్దిష్ట పెన్షన్(ఓపిఎస్) పథకాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. టి.సతీష్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకులను కూడా ప్రైవేటీకరించటానికి చట్టం చేసి ఐపిఓ ద్వారా మూలధనం సమకూర్చుకోవాలని ఒత్తిడి చేస్తున్నదని, ఈ ప్రతిపాదనను విరమించుకుని జాతీయ గ్రామీణ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## రెండు మొక్కలు నాటాలి
(మొదటి పేజీ తరువాయి)

టి.ప్రకాష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, లక్ష్యాన్ని పూర్తి చేయుటకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అందరు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తూ తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతోందని,సోలార్ ప్లాంట్ల ఏర్పాటు,ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని,ఆర్‌టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండ, టిఎస్ఆర్‌టిసి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని,పట్టణ ప్రాంతాల్లో మహిళలు కూడాను మహిళా సంఘాల్లో చేరేలా కృషి చేయాలన్నారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు రుణాలు అందించామని తెలిపారు.అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని సిఎం చెప్పారు.

**రియల్ ఎస్టేట్‌తో చెట్లు కోల్పోతున్నాం – మంత్రి కొండా సురేఖ...**

అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ వృక్షో రక్షిత రక్షితః చెట్లను పెంచడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవడం జరుగుతుందని,జీవవైవిధ్యన్ని కాపాడుకోగలుగుతామని అన్నారు.చెట్లను పెంచడం ద్వారా వర్షాలు సకాలంలో కూరుస్తాయని,వంద శాతం మొక్కలు నాటేందుకు కృషి చేయాలని,భౌగోళిక పరిస్థితి మెరుగుపడే విధంగా రాష్ట్రమంతా విరివిగా వనాలు పెంచాలని,అందుకు అందరూ భాగస్వాములు కావాలని అన్నారు.రియల్ ఎస్టేట్ సంస్థలు చెట్లను నరికి వేయడం మూలంగా గ్లోబల్ వార్మింగ్ వస్తుందని, భూకంపాలు, సునామీలు రావడం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి మల్లు రవి,ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్,కాలే యా దయ్య, ఎమ్మెల్సీలు,కార్పొరేషన్ చైర్మన్లు,చల్లా నరసింహా రెడ్డి,జ్ఞానేశ్వర్ ముదిరాజ్,జి హెచ్ఎంసి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్,కమిషనర్ కర్ణన్,రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఉన్నతాధికారులు. తదితరులు పాల్గొన్నారు.

## 'తెలంగాణలో నిర్వహించండి'
(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రిని సిఎం కోరారు. కేంద్రమంత్రి మన్సు ఖ్ ఎల్.మాండవీయను ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణుల ఎంపిక ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో మల్టీపర్పస్‌హాల్, హైదరాబాద్ హకీంపేట్‌లో ఆర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్డ్, ఎల్‌బి స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివృద్ధి, సింథటిక్ ట్రాక్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణ, నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలకు రూ.100 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి మాండవీయకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే క్రీడా వసతులను మెరుగుపర్చేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం ఇవ్వాలని సిఎం కోరారు. 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఇవెంట్లు తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరిగానే రైలు ప్రయాణాల్లో ఛార్జీ రాయితీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(క్రీడలు) ఎ.పి.జితేందర్‌రెడ్డి, ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధిపై కపిల్ దేవ్ ప్రశంస...**

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో కపిల్ దేవ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిఎం రేవంత్ రెడ్డి కపిల్ దేవ్‌కు వివరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లో తాను భాగస్వామిని అవుతానని కపిల్ దేవ్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియాతో పాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా యూనివర్సిటీలు, అక్కడి క్రీడా ప్రముఖులతో తమ భేటీల వివరాలను సిఎం రేవంత్ రెడ్డి కపిల్ దేవ్‌కు వివరించారు. సమావేశంలో సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 10న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయి మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మెడ్ ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 11 గంటలకు 'ఫార్మసిస్ట్ పోస్టులకు' జాబ్ మేళా నిర్వహించను న్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో జాబ్‌మేళా జరగనుంది.

మెడ్‌ప్లస్ ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన వంద పోస్టులను భర్తీ చేయనున్నారు. డి ఫారంసీ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ చేసిన యువతీ యువకులు 18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నామని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. రూ.12,000 నుండి రూ.25,000వేల వరకు వేతనం పొందే ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు కోసం మరిన్ని వివరాలకు సాయి శైలేష్, హెచ్‌ఆర్ (9666662481) ఫోన్‌ను సంప్రదించాలన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో స్వయంగా హాజరు కావాలని సూచించారు.

## ఆయిల్ పామ్ సాగుదారులకు అనుకూలంగా దిగుమతి విధానాలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతుల హక్కులు, వారి జీవనోపాధి రక్షణ, దేశీయ ఆయిల్ పామ్ పరిశ్రమ స్థిరత్వం కోసం రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేసి కేంద్రంపై ఒత్తిడి తెద్దామని వ్యవసాయశాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చా రు. ఆయిల్ పామ్‌పై కేంద్రం దిగుమతి సుంకం తగ్గించడంతో ఆయిల్ పామ్ ఉత్పత్తి చేస్తున్న దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతుండగా, మిల్లర్లు, రిఫైనర్లు, రీటైల్ వ్యాపారులు మాత్రం లాభపడుతున్నారన్నారు. ఈ అన్యాయాన్ని నిలదీసి రైతుల పక్షాన గళం వినిపించేందుకు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రులతో కలిసి కేంద్రాన్ని కలవనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నలుగురు దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో సంప్రదింపులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయిల్ పామ్ దిగుమతులపై ప్రస్తుత కస్టమ్స్ డ్యూటీని పెంచాలన్న అంశంపై చర్చలు జరిగాయని మంత్రి వెల్లడించారు. ఆయిల్ పామ్ రైతులకు కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని, ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయం వ్యక్తమైందన్నారు.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో మంత్రి తుమ్మల సంప్రదింపులను నిర్వహిస్తునే మరోవైపు ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మిజోరం, నాగాలాండ్ త్రిపుర రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు వ్యక్తిగతంగా లేఖలు రాసినట్లు తెలిపారు. అవసరమైతే దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో ప్రత్యక్షంగా సమావేశమై, ఆయిల్ పామ్ సాగుదారులకు అనుకూలంగా దిగుమతి విధానాల్లో మార్పులు చేయాలన్న డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు.

గతంలో మాదిరిగా క్రూడ్ పామ్ ఆయిల్‌పై దిగుబడి సుంకాన్ని 44 శాతానికి పెంచాల్సిందేనన్నారు.

## వైద్య పరికరాలకు వెంటనే రిపేర్లు

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఎక్విప్‌మెంట్ మెయింటనెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో టిజిఎంఎస్ఐడిసిహెడ్ ఆఫీసులోని ఐదుగురు బయోమెడికల్ ఇంజనీర్లతో కూడిన సెంట్రల్ మానిటరింగ్ యూనిట్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి సూచించారు. టిజిఎంఎస్ఐడిసిలో ఎక్విప్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా సీనియర్ బయోమెడికల్ ఇంజనీర్‌ను నియమించాలన్నా రు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సబ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ప్రతి సబ్ యూనిట్‌లో ఒకరిద్దరు బయోమెడికల్ ఇంజనీర్లను నియమించాలని ఆదేశించారు. ఎక్విప్‌మెంట్ మెయింటనన్స్ విషయంలో హాస్పిటల్లో పనిచేసే టెక్నీషియన్లకు, ఎలక్ట్రీషియన్లకు బేసిక్‌శిక్షణ ఇవ్వాలని, మిషన్ రిపేర్ వచ్చిన గంటలోపల హాస్పిటల్ సూపరింటెండెంట్ సబ్ యూనిట్‌కు, హెడ్ ఆఫీసుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సూపరింటెండెంట్ నుంచి సమాచారం వచ్చిన 6 గంటలలోపల బయోమెడికల్ ఇంజనీర్ ఆ హాస్పిటల్‌ను సందర్శించి, ఆ సమస్య ఏమిటో గుర్తించాలని అన్నారు. మైనర్ రిపేర్లు ఉంటే హాస్పిటల్ స్థాయిలో ఒక్కరోజులోనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా కొత్త విధానం ఉండాలన్నారు. మేజర్ రిపేర్లను మూడు రోజుల లోపల ఆ సమస్యను పరిష్కరించి, యంత్రాన్ని వర్కింగ్ కండిషన్‌లోకి తీసుకురావాలని తెలిపారు. ఒకవేళ ఏవైనా స్పేర్ పార్ట్స్ అవసరమైతే, వెంటనే సంబంధిత ఎక్విప్‌మెంట్ సప్లయర్ల కు సమాచారం ఇచ్చి దీనిని రిపేర్ చేయించాలని అన్నారు.

హాస్పిటల్ స్థాయిని బట్టి, ఆయా హాస్పిటల్‌లో ఏయే ఎక్విప్‌మెంట్ ఉండాలో ఒక స్టాండర్డ్ లిస్ట్ తయారు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఇందుకు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, డిఎంఇ నరేంద్ర కుమార్, వివిపి కమిషనర్ అజయ్ కుమార్ సభ్యులుగా కమిటీని నియమించారు. ఎక్విప్‌మెంట్ పూర్తిగా ఉపయోగంలో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత హాస్పిటల్ సూపరింటెండెంట్లదేనని, ప్రతి యంత్రం, ఫర్నీచర్ పేషెంట్లకు ఉపయోగపడే విధంగా చూసుకోవాలని దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా అన్ని హాస్పిటల్స్‌లో ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు చేయండి**

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన హాస్పిటల్స్ ఎక్విప్‌మెంట్‌ను కొనుగోలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. కొత్త టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో మెడికల్, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోళ్లపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వినియోగిస్తున్న ఎక్విప్‌మెంట్ వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫర్నీచర్‌ను కొనుగోలు చేయాలని, కొత్త హాస్పిటల్స్‌కు పేషెంట్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ఆ అంచనాలకు తగినట్టుగా ఫర్నీచర్, ఎక్విప్‌మెంట్ ఉండాలన్నారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుకూ వారంటీ ఉండాలని, మెయింటనన్స్ విషయంలో సప్లయర్లను బాధ్యులుగా చేయాలని సూచించారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్‌లో కనీసం 3 నెలలకు సరిపడా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని టిజిఎంఎస్ఐడిసి అధికారులకు సూచించారు. టి డయాగ్నోస్టిక్ హబ్స్‌లో అన్ని రకాల పరీక్షలు, స్కాన్‌లు చేయాలని, ఒక్క పరీక్ష కోసం కూడా పేషంట్లను బయటకు పంపించొద్దని అన్నారు. 24 గంటల లోపల రిపోర్టులు అందజేయాలన్నారు. ఎంఆర్ఐ మిషన్ల కొనుగోలు, ఇన్‌స్టలేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

## సమ్మెలో మహిళలు

### మహిళా కార్మికులకు తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను 4కోడ్‌లుగా రూపొందించి కార్మిక హక్కులను హరించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సంఘాలు, అసోసియేషన్లు ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న మహిళా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం (ఎఐటియుసి) అధ్యక్షురాలు పి. ప్రేంపావని, కన్వీనర్లు నందూరి కరుణ కుమారి, సి.హెచ్.సీతామహాలక్ష్మీ, డి.కమలారెడ్డిలు పిలుపునిచ్చారు. కార్పొరేట్ల అనుకూల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, కస్తుర్బా బాలికల విద్యాలయం, సర్వ శిక్షాభియాన్, గ్రామీణ ఉపాధి హామీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న లక్షలాదిమంది మహిళా కార్మికులు తక్కువ వేతనాలతో ఎక్కువ పనిచేపిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తురన్నారు.. తమ శ్రమను వెచ్చిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చే విధంగా పనిచేస్తున్న వీరికి కనీసవేతనాలు, గ్రాట్యుటీ, సామాజిక భద్రతా చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం వీరికి చట్ట భద్రతను హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన జిఒ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను ముక్తకంఠంతో శ్రామిక మహిళలంతా నిరసిస్తూ ఈనెల 9న జరిగే సమ్మెలో వేలాదిగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

**సంయుక్త కిసాన్ మోర్చా ఆధర్యంలో సమ్మెకు మద్దతుగా నేడు గ్రామీణ ప్రాంతాల్లో నిరసనలు :** కేంద్ర ప్రభుత్వ అవలంభిస్తున్న కార్మి క, రైతు, వ్యవసాయ కార్మి క విధానానికి వ్యతిరేకంగా ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా (నేడు) 8వ తేదీన గ్రామీణ ప్రాంతాల్లో, 9వ తేదీన మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలనిసంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్లు టి సాగర్, జక్కుల వెంకట య్య, డి జి నరేంద్ర ప్రసాద్, ఆర్ వెంకట్రాములు, ఇ.విజయ్ పిలుపునిచ్చారు.





సమ్మెకు మద్దతుగా ఎస్‌కెఎం ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం ద్వారా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని, రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా వ్యవసాయ మార్కెట్ విధాన ముసాయిదా పత్రంతో రద్దుచేసిన మూడు చట్టాలను అమలు చేసేందుకు కేంద్రం పూనుకుంటున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండ కనీస మద్దతు ధరల చట్టం చేసేందుకు ముందుకురాని కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ చట్టం ద్వారా రైతాంగానికి మరింత నష్టం చేస్తోందన్నారు. వీటన్నింటిని తిప్పికొట్టి మరోసారి కేంద్రం మెడలు వంచేందు కు ఈ నెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెలో రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## మానుకోట సిపిఐ జిల్లా కార్యదర్శిగా విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శిగా బి.విజయ సారథి మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కురవి మండల కేంద్రంలో పోగుల శ్రీనివాస్‌గౌడ్ ప్రాంగణంలో జరిగిన సిపిఐ జిల్లా మహాసభలో విజయసారథిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులుగా మహబూబాబాద్‌కు చెందిన బి.అజయ్‌సారథిరెడ్డి, కురవి మండల కేంద్రానికి చెందిన నల్లు సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కట్టె బోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, పాండురంగాచారి, రేషపల్లి నవీన్, వరిపెల్లి వెంకన్న, నెల్లూరి నాగేశ్వరావు మరో 24 మందిని కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు.

## సిగాచి ఘటన అత్యంత దురదృష్టకరం : చాడ వెంకటరెడ్డి

**ప్రజా పక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఈ ఘటన పూర్తిగా మానవ తప్పిదమని, ఇందులో ఇప్పటివరకు 41 మంది కార్మికులు ప్రాణాలు కొల్పోవడం బాధకర మని ఆయన పేర్కొన్నారు. మారిన పరిస్థితుల కు అనుగుణంగా యాజమాన్యం అధునాతన మైన పరికరాలను అమర్చు కోకుండా కార్మి కుల జీవితాలతో చెలగాట మాడిందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఒక పరిశ్రమలో ఇంతమంది చనిపోవడం మొదటి సారి అని, ఈ ఘటనను అనుభవంగా తీసు కొని రాష్ట్రంలోని అన్ని ఫ్యాక్టరీలపై సేఫ్టీ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేపట్టాలని చాడ వెంకట రెడ్డి కోరారు. ఈ సందర్భంగా చనిపోయిన వారికి సంతాపాన్ని వారి కుటుంబాలకు సానుభూతిని తెలిపారు.

## 'వైల్డర్‌నెస్ రిసార్ట్'పై చర్యలు తీసుకుంటాం

### ప్రభుత్వం నుంచి బోటింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవు

### టిజిటిడిసి ఎండి మల్లూరి క్రాంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వికారాబాద్ సమీపంలో సర్పన్‌పల్లి ప్రాజెక్టులో వైల్డర్‌నెస్ రిసార్ట్ నిర్వహిస్తున్న బోటింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవని పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)మేనేజింగ్ డైరెక్టర్ మల్లూరి కాంత్రి తెలిపా రు. హైదరాబాద్ నుంచి విహార యాత్రకోసం వైల్డర్‌నెస్ రిసార్ట్‌కు వెళ్లి బోట్ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మహిళలు రీటా కుమారి (55), పూనమ్ సింగ్(56)లు శనివా రం మృతి చెందిన ఉదంతం పై విచారణకు ఆదేశించామని కాంత్రి తెలిపారు. ఏదైనా చెరువు, సరస్సులో బోటింగ్ నిర్వహించాలంటే అందుకు పర్యాటక శాఖ, ఇరిగేషన్ శాఖల అనుమతులు తప్పకుండా ఉండాలి. అయితే సర్పన్‌పల్లి బోట్ ప్రమాదం ఘటనలో ప్రాథమిక విచారణలో ఎలాంటి అనుమతులు లేకుండానే దొంగ చాటుగా బోటింగ్ నడిపిస్తున్నారని తేలింది. సర్పన్‌పల్లి ప్రాజెక్ట్‌లో రిసార్ట్ యజమాని 8 ఎకరాలు ఆక్రమించుకుని చెరువులోనే రిసార్ట్ కట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు తానుగా విహార యాత్రకు వచ్చే యాత్రీకుల కోసం ఈ చెరువులో బోట్‌లను నడిపిస్తున్నారు. ఈ రిసార్ట్ యజమాని గతంలో దుర్గంచెరువు వద్ద జరిగిన రేవ్ పార్టీలో అరెస్టు అయినట్లు, అలాగే విశాఖపట్నంలో కూడా అసాంఘిక కార్యకలాపాల నిర్వహణలో అరెస్టు అయినట్లు తెలిసింది. ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనల ప్రకారం జలాశయాల్లో బోటింగ్ నిర్వహణకు పర్యాటక శాఖ, నీటి పారుదల శాఖ అధికారులకు సదరు రిసార్ట్ యాజమాన్యం ఎలాంటి అనుమతుల కోసం కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేదు. అసలు ప్రైవేటు వ్యక్తులు బోటింగ్ నిర్వహించకూడదని, టూరిజం శాఖ అధికారుల ఆధ్వర్యంలోనే బోటింగ్ నిర్వహణ ఉండాలని గత ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం జరిగిన ప్రమాదంపై రిసార్ట్ యజమానిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలి. అయితే అలాంటిదేమి ఇక్కడ జరగకపోవడం గమనార్హం. బోటింగ్ నిర్వహించే సమయంలో లైఫ్ జాకెట్లు కూడా ఇవ్వలేదని, కనీసం ఇవి ఉంటే మహిళలు చనిపోయే వారు కాదని అధికారులు అంటున్నారు. ఉబోల్తా పడిన బోట్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా లేదని, దాన్ని నడిపిస్తున్న డ్రైవర్ కు కూడా లైసెన్స్ లేదని తెలిసింది.

నిజానికి కాకినాడలో శిక్షణ పొందిన వారికి మాత్రమే బోట్ డ్రైవర్‌గా పెట్టాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే ఇక్కడి డ్రైవర్‌కు అలాంటి శిక్షణ ఏదీ లేదని తేలింది. సదరు రిసార్ట్ నిర్వాహకులు ఏడాదికాలంగా ఇక్కడ బోటింగ్ నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని టిజిటిడిసి ఎండి క్రాంతి తెలిపారు.

## సాగర్‌లో దళితులకు భూములపై అటవీశాఖ కొర్రీలు

### సమాచార రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేద ప్రజలు దశాబ్దాలకాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపించి, సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు.హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్, అంబేద్కర్ సచివాలయంలో సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కె.జానా రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కె. జయవీర్ రెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డిఎస్.లోకేష్ కుమార్, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నాగార్జున సాగర్ నియోజకవర్గం లో 40–50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని, కానీ వివిధ నిబంధనల పేరుతో ఆ భూములు అటవీ శాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీలు వేస్తున్నారన్నారని అన్నారు.

ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జిల్లాలకు పిసిసి ఇన్‌ఛార్జ్‌ల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాల ని సంబంధిత జిల్లాల ఇన్‌చార్జిలను టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశించారు. పార్టీ జిల్లా ఇంచార్జ్‌లతో సోమవారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఎఐసిసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ 10 మంది ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్‌లు సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన విధివిధానాలను మీనాక్షి నటరాజన్ జిల్లాల ఇన్‌చార్జ్‌లకు వివరించారు. త్వరలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం చేపట్టాలని ఆమె ఆదేశించారు.

**జిల్లా ఇన్‌చార్జ్‌ల నియామకం:** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసేందు కు పార్టీకి ఉమ్మడి జిల్లాల వారీగా ఇంచార్జ్‌లను పార్టీ సీనియర్ నాయకులను టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సోమవారం నియమించారు. ఖమ్మం జిల్లాకు సిడబ్ల్యుసి సభ్యులు సిహెచ్.వంశీచంద్ రెడ్డిని, నల్గొండ జిల్లాకు ఎఐసిసి కార్యదర్శి ఎస్.ఎ.సంపత్ కుమార్‌ను, వరంగల్ జిల్లాకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను, మెదక్ జిల్లాకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, హైదరాబాద్ జిల్లాకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి (జగ్గారెడ్డి)ని, మహబూబ్‌నగర్ జిల్లాకు పిఎసి సభ్యులు కుసుమ కుమార్‌ను, ఆదిలాబాద్ జిల్లాకు ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌ను, కరీంనగర్ జిల్లాకు ఎంఎల్‌సి అద్దంకి దయాకర్‌ను, నిజామాబాద్ జిల్లాకు వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మత్ హుస్సేన్‌ను, రంగారెడ్డి జిల్లాకు సాట్ చైర్మన్ శివసేన రెడ్డిని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## మేము ప్రతిపక్షాలపై అడ్డమైన కేసులు పెట్టలేదు : కెటిఆర్





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్, బిఆర్ఎస్ లేకపోతే గులాబీ జెండా ఎగరకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో రేవంత్ రెడ్డి తరహా లేకి పనులు చేయలేదని, ప్రతిపక్షాలపైన అడ్డమైన కేసులు పెట్టలేదని, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను పోలీసులతో కొట్టించలేదన్నారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కెసిఆర్ లాంటి ముఖ్యమంత్రులను చూసిన ప్రజలు, రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూసి ఛీ అనుకుంటున్నారని అన్నారు. బిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు కెటిఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే ఇప్పుడు 100 సీట్లు గెలుస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని, అందుకే వంద కాదు బొంద అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తెచ్చిన కెసిఆర్ గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం న్యాయమా?, తెలంగాణ సిఎం కుర్చీలో కూర్చునే భాగ్యం రేవంత్ రెడ్డికి రావడానికి కారణమే కెసిఆర్ అని అన్నారు.

## తెలంగాణ నికర జలాల దోపిడీకే 'బనకచర్ల'



**ప్రజాపక్షం/శంకరపట్నం:** గోదావరి నదీ మిగులు జలాలు, వరద జలాల పేరుతో తెలంగాణ నికర జలాలను కొల్లగొట్టడం కొరకే ఆంధ్రప్రదేశ్ బనకచర్ల ప్రాజెక్టును రూపొందించిందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తన స్వార్థ అవకాశవాద రాజకీయాల కొరకు నాడు కెసిఆర్ అనుసరించిన తీరు నేడు తెలంగాణకు శాపంగా మారిందని దుయ్యబట్టారు. శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ గ్రామంలో సోమవారం తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ మోరె గణేష్ అధ్యక్షతన తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని బనకచర్ల ప్రాజెక్టు నిలిపివేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర నాయకత్వం కృష్ణ, గోదావరి నదులపై అడ్డగోలుగా ప్రాజెక్టు నిర్మాణం చేసుకుని తెలంగాణకు రావాల్సిన నీళ్లు రాకుండా దోచుకెళ్లారని, తిరిగి తాజా అదే తంతు మొదలు పెట్టారని దుయ్యబట్టా రు. దాని కొనసాగింపే గోదావరి నుంచి 300 టిఎంసిల నీళ్లను కొల్లగొట్టడానికి బనకచర్ల ప్రాజెక్టు అన్నారు. గోదావరి నది తెలంగాణ ప్రాంతంలో 79 శాతం ప్రవహిస్తుండగా ఆంధ్రాలో 21 శాతం భూభాగంలో మాత్రమే ప్రవహిస్తోందని తెలిపారు. గోదావరి నదీ ఆంధ్రాలో ప్రవహించే భూభాగం ప్రకారం 310 టీఎంసీల నీటిని మాత్రమే వాడుకోవాల్సి ఉండగా ఇప్పటికే 684 టీఎంసీల నీటిని వాడుకుంటున్నారని, తిరిగి ఇప్పుడు మిగులు జలాల పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారని, ఇది తెలంగాణ నీటి వాటాకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ నాయకులు బనకచర్ల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నాడు జగన్, కెసిఆర్‌లు నదులు అనుసంధానం పేరుతో చేసుకున్న ఒప్పందాల్లో రహస్య ఒడంబడి గా బనకచర్ల ఉందనే వాస్తవం తెలుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం జలాల మీద గెజిటెడ్ తీసుకొచ్చినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా బిఆర్ఎస్, బిజెపి నాయకులు రాజకీయ పబ్బం గడుపుకోకుండా తమ తప్పిదాలను ఒప్పుకుని ప్రజలు మందు క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, ధర్మార్జున్, మహిళా జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికల్ల స్రవంతి, యువ జన సమితి జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్, పల్లె శ్రీనివాస్, భాను కిరణ్, గోపగోని సాయిరాం, బల్ల వీరు, గోపగోని అరుణ్, తదితరులున్నారు.

## తిరుపతిలో బర్ధన్ కాలనీ



**తిరుపతి:** భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.బి.బర్ధన్ స్మృత్యర్థం ఆయన పేరుతో ఆంధ్రప్రదేశ్ పట్ట ణం తిరుపతిలో ఒక కాలనీని ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో 40 సభ్యులతో సిపిఐశాఖ ఏర్పడింది. భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బర్ధన్ కాలనీ పార్టీ శాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా బర్ధన్ కాలనీలో 100 చెట్లు నాటారు. 100 సిపిఐ జెండాలను కూడా ఆవిష్కరించారు. ప్రతి నాయకుడూ ప్రాథమిక శాఖ సమావేశంలో పాల్గొనాలన్న తీర్మానం మేరకు పార్టీ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ ఈ మహాసభలో పాల్గొన్నారు. బర్ధన్ కాలనీ సిపిఐ శాఖా కార్యదర్శిని ఎన్నుకున్న తర్వాత బహిరంగ సభ జరిగింది. ఇకమీదట బర్ధన్ కాలనీలో పార్టీశాఖ కార్యక్రమాలు నిరంతరం జరుగుతాయి.





## మీ చానల్ సంగతి చూస్తాం...

### బిఆర్ఎస్‌ను హెచ్చరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు సవాల్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజె పి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మీడియా సంస్థలపై బిఆర్ఎస్ దాడుల ను తీవ్రంగా ఖండించారు. బలమైన ప్రతిపక్షం ఉంటే ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవదన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలపై బిజెపి ఫోకస్ చేయలేదన్నారు. ఈసారి దృష్టిసారిస్తామని చెప్పారు. 25 రోజుల్లో పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. అందులో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. బిజెపిలో వర్గాలేమి లేవని, అందరం పార్టీ లైన్‌లో కలిసికట్టుగా వెళ్తామన్నారు. మీడియాపై బిఆర్ఎస్ దాడులు దుర్మార్గమని, మీడియా సంస్థలపై చెయ్యేస్తే టి న్యూస్ అంతు చూస్తామని రాంచందర్ రావు అన్నారు. తక్షణమే బిజెపివైఎం కార్యకర్తలు ఎబిఎన్, ఆంధ్రజ్యోతి సంస్థలకు రక్షణ కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై బిఆర్ఎస్ మూకలు దాడులు చేసే అవకాశం ఉన్న ట్లు పోలీసుల నంచి సమాచారం వచ్చిందన్నారు. మీడియా సంస్థలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదన్నారు.

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్

హెచ్‌యండిఏ చట్టం 2008 యొక్క U/s. 15 (4) పబ్లిక్ నోటిఫికేషన్
(G.O.Ms.No. 152 MA & UD Dept. Dated 26.06.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 చట్టం నం.8) లోని సెక్షన్ 15 లోని సబ్‌సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP 2031 ప్రకారం ఊహించిన భూ వినియోగానికి ప్రభుత్వం ఈ క్రింది మార్పును చేస్తోంది. G.O.Ms.No.33 MA మరియు UD తేది 24.01.2013 చూడండి, ఆ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరం. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం, కొండకల్ గ్రామంలోని సర్వే నెం.లోని సైట్. నెం. 15, 16, 17, 18, 20, 22, 23, 27, 28, 29, 30, 31 మరియు 32 లో 81,341.78 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం ప్రస్తుతం నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP 2031లో పారిశ్రామిక ఉపయోగం కోసం కేటాయించబడింది. G.O.Ms.No.33 MA, తేది: 24.01.2013 ప్రకారం, ఇప్పుడు నివాస వినియోగంగా గుర్తించబడింది. పైన పేర్కొన్న వివరాలు, http://gazette.telangana.gov.in/ మరియు http://hmda.gov.in//వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

Sd/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (MK)
HMDA
DIPR R.O.No: 4683-PP/CL/ADVT/1/2025-26 Date: 07-07-2025

ప్రజాపక్షం
మంగళవారం, 08 జులై

# మరాఠీ సోదరుల కలయిక

దాదాపు 20 సంవత్సరాల క్రితం విడిపోయిన బాల్‌థాక్రే శివసేన వారసులు ఉద్ధవ్‌థాక్రే, రాజ్ థాక్రే కజిన్ సోదరులను బిజెపి కలిపింది. మోదీ ప్రభుత్వ త్రిభాషా సూత్రాన్ని–హిందీయేతర రాష్ట్రాల్లో మూడవ భాషగా హిందీని విధిగా అమలు జరిపే ప్రయత్నానికి వ్యతిరేకంగా వారు ఏకమైనారు. మహారాష్ట్రలో ఉన్నది బిజెపి నాయకత్వంలో శివసేన (ఏకనాథ్ షిండే), ఎన్‌సిపి (అజిత్ పవార్)లతో కూడిన సంకీర్ణ ఎన్‌డిఎ ప్రభుత్వం. 1–5 తరగతులవరకు మూడవ భాషగా హిందీ బోధనను నిర్బంధం చేస్తూ దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం ఒకటికి రెండు ఉత్తర్వులు జారీ చేసి మరాఠా మాతృభాషాభిమానులను రెచ్చగొట్టింది. ఉద్ధవ్‌థాక్రే శివసేన, రాజ్ థాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) ఇదే అదనుగా ఆందోళనకు సన్నద్ధమవుతుండగా, ప్రభుత్వం ఆ రెండు ఉత్తర్వులు ఉపసంహరించుకొని, త్రిభాషా సూత్రం అమలుపై విధివిధానాల రూపకల్పనకు ఒక కమిటీ వేసింది. ప్రభుత్వం వెనక్కు తగ్గడాన్ని ఉద్ధవ్–రాజ్‌థాక్రే సోదరుల విజయోత్సవంగా జరుపుకున్నారు. బాల్‌థాక్రే జీవించి ఉన్నంతకాలం శివసేనలో రాజ్‌థాక్రేదే పెత్తనం. అయినా నీళ్ల కన్నా రక్తం చిక్కన అన్నట్లు బాల్‌థాక్రే తన కుమారుడు ఉద్ధవ్‌థాక్రే తన వారసునిగా ప్రకటించిన దరిమిలా రాజ్‌థాక్రే బయటకు వెళ్లిపోయి ఎంఎన్ఎస్ స్థాపించారు. మరాఠాయేతరులతో రౌడీయిజం, అల్లర్లు తప్ప రాజ్‌థాక్రే సాధించిందేమీ లేదు. కాగా, ఉద్ధవ్‌థాక్రే తమ మరాఠా ఆవేశాన్ని కొంత సడలించుకుని బిజెపితో ప్రయాణిస్తూ ముఖ్యమంత్రి పదవి కోసం కొట్లాడాడు. అది సాధ్యం కాక కాంగ్రెస్, ఎన్‌సిపిలతో కలిసి కూటమిగా ఏర్పడి ముఖ్యమంత్రి పదవి చేపట్టి తన కోరిక నేరవేర్చుకున్నాడు. అయితే ఏక్‌నాథ్ షిండే బిజెపి ప్రోత్సాహంతో శివసేనను చీల్చి తనదే అసలు శివసేన అనిపించుకున్నాడు. శివసేనను, ఎన్‌సిపిని చీల్చే ఎత్తుగడల్లో సఫలమైన బిజెపి మొన్నటి ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకుని ఎన్నాళ్ళ నుంచో అందరి ద్రాక్షగా ఉన్న మహారాష్ట్ర గద్దెను సొంతం చేసుకుంది.

ప్రతిపక్ష కూటమి ఛిన్నాభిన్నంగా ఉన్న స్థితిలో బిజెపి ప్రభుత్వం హిందీని పాఠ్యాంశంగా రుద్ది ఉద్ధవ్, రాజ్‌థాక్రే సోదరులను ఏకం చేసింది. దీని వెనుక రాజకీయాలు కూడా లేకపోలేదు. గడిచిన దశాబ్దాల్లో ఉత్తరప్రదేశ్, బీహార్ల నుంచి హిందీ మాట్లాడే ప్రజలు పెద్ద ఎత్తున మహారాష్ట్రకు వలస వచ్చారు. వారు బిజెపికి ఉండగా ఉన్నారు. ''భూమి పుత్రులకు ఉపాధి'' అనే నినాదంతో ఒకనాడు దక్షిణాదులపై ముఖ్యంగా తమిళులపై ''పంగి–లుంగి'' అంటూ దాడులు చేసి తన మరాఠా పునాదిని, హిందుత్వను జోడించి విస్తరించుకున్న శివసేన, ఇప్పుడు ఉత్తరాదివారిపై పోరాడవలసి వచ్చింది. అందుకు ''హిందీ'' వ్యతిరేక ఆందోళన అవకాశం ఇచ్చింది. అయితే తమిళనాడులాగా హిందీ బోధనను వ్యతిరేకించడం వేరు, హిందీ మాట్లాడే వారిపై దాడులు చేయటం వేరు. మహారాష్ట్రలో ముంబయి, పూణె, నాగపూర్ సహా పట్టణ ప్రాంతాల్లో అత్యధికులు హిందీ మాట్లాడతారు. హిందీ సినిమాలకు కేంద్రం ముంబయి. అందువల్ల వీధుల్లో, దుకాణాల్లో హిందీ మాట్లాడే వారిపై ఎంఎన్ఎస్ దాడులు చేయటం ఖండించదగింది. ప్రతి ప్రాంతీయ భాషకు దాని చరిత్ర, ఔన్నత్యం ఉన్నాయి. వాటిని పరిరక్షించుకోవలసిందే. కానీ ''హిందూ–హిందుస్థాన్–హిందీ'' నినాదంతో హిందీని హిందీయేతరులపై బలవంతంగా విధించే బిజెపి వైఖరి విచ్ఛిన్నకరమైంది. దాని విచ్ఛిన్నతను ఖండిస్తూ విచ్ఛిన్న చర్యలకు పాల్పడే ప్రాంతీయుల చర్యలు అంతే ఖండనార్హం.

మరాఠీ భాషాభిమానాన్ని థాక్రే సోదరులు ఆయుధంగా ప్రయోగించడానికి తక్షణ కారణం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ముఖ్యంగా బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌ను గెలుచుకోవాలన్న తాపత్రయం. ఈ భాషా దురభిమానం దేశంలోని అన్ని జాతులు సహజీవనం చేస్తున్న మహానగరాల్లో లౌకిక జీవనానికి విఘాతం తెస్తుంది. రాజకీయంగా లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు ఎదురు దెబ్బ.

# దేశవ్యాప్త సమ్మె ఎందుకు?



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం 2019–2020 సంవత్సరాలలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చింది. కార్మికవర్గ ప్రతిఘటన ఉద్యోమాల కారణంగా వాటి అమలుకు సాహసం చేయలేకపోయింది. ఈ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జులై 9న జాతీయ సార్వత్రిక సమ్మెకు 10 కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. వాటితో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు, రైతు సంఘాలు ఐక్యంగా పిలుపునిచ్చాయి.

> *లేబర్ కోడ్‌లు 2020లో పార్లమెంట్ ఆమోదించిన ఐదేండ్లుగా వాటి అమలును ఐక్య ప్రతిఘటన ద్వారా కార్మిక వర్గం అడ్డుకుంది. భారతీయ న్యాయసంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 111 ప్రకారం కార్మికులందరూ కలిసి సామూహికంగా ఫిర్యాదు చేసినా సమ్మె నోటీసు ఇచ్చినా, సమ్మె చేసినా 'నాన్ బెయిలబుల్' కేసులు పెట్టొచ్చు.*

కొత్త లేబర్ కోడ్‌లతో నష్టాలేమిటో ఒకసారి పరిశీలిద్దాం. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కారణంగా నేడు పరిశ్రమలలో కార్మికుల సంఖ్య తగ్గుతున్నది. తమ సంస్థలో 300 మంది కార్మికుల సంఖ్య కంటే తక్కువ మంది పని చేస్తున్నారనే కారణం చూపి, ఇష్టానుసారం కార్మికులను తొలగించేందుకు (హైర్ అండ్ ఫైర్ విధానం) అమలు చేసేందుకు యాజమాన్యాలకు ఈ కోడ్‌లు ఆయుధంగా మారనున్నాయి. సాధారణంగా పారిశ్రామిక కార్మికులకు నిర్ధిష్ట ఆదేశాలు (స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం ప్రకారం పని పరిస్థితులు(సర్వీస్ కండిషన్‌లు)లపై కార్మికులతో యాజమాన్యాలు చర్చించి నిర్ణయించాల్సి ఉంటుంది. కొత్త లేబర్ కోడ్‌ల కారణంగా 300 లోపు కార్మికులు ఉండే పారిశ్రామిక సంస్థలలో ఈ స్టాండింగ్ ఆర్డర్స్ వర్తించవు. ఫలితంగా అత్యధిక పారిశ్రామిక కార్మికులు తమ పని పరిస్థితుల విషయంలో యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుంది.

ఒక సంస్థలో ఒకటి కన్నా ఎక్కువ కార్మిక సంఘాలు ఉన్నట్లయితే, కనీసం 51 శాతం కార్మికుల మద్దతు కలిగిన సంఘానికే ఏకైక గుర్తింపు హోదా ఇవ్వాలి. సంప్రదింపుల కమిటీలో 20 శాతానికి ఒక్కరు చొప్పున ప్రాతినిధ్యం ఇచ్చి, యాజమాన్యమే నియమిస్తుంది. కార్మికులు సమ్మె చేయడం వీలు కాని పరిస్థితులను కోడ్ కల్పిస్తుంది. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం పబ్లిక్ యుటిలిటీ సర్వీసుల (ప్రజావసరాల సేవల)లో పని చేసే వారు మాత్రమే సమ్మె చేసేందుకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. ఏ సంస్థలోనైనా సరే సమ్మెకు ముందుగా నోటీసు ఇవ్వాల్సిందే. సమ్మె నోటీసు ఇచ్చిన 60 రోజుల లోగా సమ్మె చేయకూడదనటం సమ్మె హక్కును హరించటమే. ట్రిబ్యునల్ ప్రొసీడింగ్స్ కొనసాగుతున్నంత వరకుచ ఆ ప్రొసీడింగ్స్ ముగిసిన తరువాత 60 రోజుల వరకు సమ్మె చేయకూడదు. దీని వలన కన్సిలియేషన్ చర్చలు ట్రిబ్యునల్ ప్రొసీడింగ్స్ ఉద్దేశపూర్వకంగా దీర్ఘకాలం పొడిగించి సమ్మె చేయకుండా ఉండేందుకు ప్రభుత్వాలకు, కార్మిక శాఖకు పూర్తి అధికారాలను కట్టబెట్టింది. సమ్మెలో పాల్గొనే కార్మికులను, సమ్మెకు ప్రోత్సహించినా, ఆర్థికంగా సహకరించిన కార్మికులను, కార్మిక సంఘాల నాయకులను భారత న్యాయ సంహిత సెక్షన్ 111 ప్రకారం నేరంగా పరిగణించి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడమే కాక భారీ స్థాయిలో జరిమానాలు, జైలు శిక్షలు కూడా విధించే విధంగా మార్పులు చేసుకున్నారు. మరోవైపు కార్మికశాఖ, ప్రభుత్వ అనుమతి లేకుండానే కంపెనీలను లేఆఫ్ చేసేందుకు, లాకౌట్ విధించేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛకు ఈ కోడ్‌లో చట్టబద్ధత కల్పించారు. కాబట్టి లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయి.

భార్య, భర్తలిద్దరూ 2 యూనిట్లుగా, ఇద్దరు పిల్లలు కలిసి మరో యూనిట్‌గా, ఈ విధంగా మూడు వినిమయ యూనిట్లు ప్రాతిపదికగా కనీస వేతనాన్ని నిర్ణయించాలి. రోజుకు ఒక్కో యూనిట్‌కు 2700 కేలరీల శక్తినిచ్చే ఆహారంకు అయ్యే ఖర్చు, కుటుంబానికి సంవత్సరానికి 72 గజాల వస్త్రం, ప్రభుత్వ హౌసింగ్ స్కీములో అతి తక్కువ స్థలం వున్న ఇంటికి ప్రభుత్వం ఎంత అద్దె వసూలు చేస్తుందో దాని ప్రకారం ఇంటి అద్దె, వీటన్నింటికీ ఎంత మొత్తం అవుతుందో అంత మొత్తాన్ని కనీస వేతనంగా నిర్ణయించాలి. ప్రస్తుత చట్టాల ప్రకారం కనీస వేతనాన్ని 5 సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా సవరించాలి. సంవత్సరానికి రెండు సార్లు డిఏని సవరించాలి. పాతచట్టం ప్రకారం ఫ్లోర్ లెవల్ వేతనాన్ని రెండు సంవత్సరాలకు ఒకసారి సవరించాలి. ధరల పెరుగుదలకు అనుగుణంగా డిఏని సెంట్రల్ అడ్వయిజరీ బోర్డుతో సంప్రదించి నిర్ణయించాలని కోడ్‌లు తెచ్చారు.




**దేశవ్యాప్త సమ్మె డిమాండ్లు ఇవే**

- నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి
- కనీస వేతనం నెలకు రూ.26,000, కనీస పెన్షన్ రూ.9,000
- సమాన పనికి సమాన వేతనం
- అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, అన్ని తరగతుల కార్మికులకు సామాజిక భద్రత
- పెన్షన్‌తో సహా సమగ్ర సామాజిక భద్రతలో అందరినీ భాగస్వాములను చేయాలి
- ఎన్‌పిఎస్, యుపిఎస్‌ను రద్దు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరణ
- దరఖాస్తు చేసిన 45 రోజులలో కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్
- ఐఎల్ఒ సమావేశాలు సి87, సి98లను తక్షణమే ఆమోదించాలి
- ధరల పెరుగుదలను నియంత్రించాలి
- ఆహారం, మందులు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, ముఖ్య యంత్రాలపై జిఎస్‌టి రద్దు
- ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ విభాగాల ప్రైవేటీకరణను ఆపాలి
- నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) ఉపసంహరించాలి
- అటవీ హక్కుల చట్టాన్ని (ఎఫ్ఆర్ఎ) కఠినంగా అమలు చేయాలి
- సంపన్నులు, కార్పొరేట్ పన్నును పెంచాలి
- భావ ప్రకటనా స్వేచ్ఛ, అసమ్మతి హక్కు, మత స్వేచ్ఛ, విభిన్న సంస్కృతులు, భాషలను పరిరక్షించాలి
- సమాఖ్యవ్యవస్థ, రాజ్యాంగంపై దాడిని ఆపాలి

పాత చట్టం ప్రకారం కార్మికుడు 8 గంటలు పని చేయాలి. కానీ ఈ ముసాయిదా రూల్స్ ప్రకారం 10 గంటల పనిదినం వారానికి ఎన్ని గంటలు పని చేయాలో చెప్పకపోవడంలో మోసం దాగి ఉన్నది. ఇది భారత దేశం కూడా ఆమోదించిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) కన్వెన్షన్ ప్రకారం వారానికి 48 గంటల పనికి మించరాదు అన్నదానికి విరుద్ధం. వేతనాల కోడ్ ప్రకారం మహిళలు, పురుషులకు ''సమాన పనికి సమాన వేతనం'' ఇవ్వాలి. సమాన వేతన చట్టం నిబంధనలు రద్దు చేసి కేవలం లింగ వివక్ష కారణంగా సమాన వేతనాలివ్వకపోవటం ఒక్క దానినే నేరంగా పరిగణించాలని వేతనాల కోడ్‌లో పేర్కొన్నారు. యాజమాన్యాలు వేతనాలు సక్రమంగా చెల్లిస్తున్నాయా లేదా పట్టించుకునే యంత్రాంగమే వుండదు. నియామకాలు, ప్రమోషన్లలో వివక్ష కొనసాగే ప్రమాదం ఉన్నది. ఈ లేబర్ కోడ్‌లలో వుండాల్సిన కనీస వేతనం నిర్ధారణ, బోనస్ ఫార్ములా, వాటిని సకాలంలో చెల్లించటం వేతనాలకు అనుబంధంగా వుండే ఓవర్ టైమ్ అలవెన్స్, ఇన్సెంటివ్ వంటివి నీరుగార్చబడినాయి.

మొత్తం కార్మికులలో 70 శాతం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులుగా వున్నారు. శాశ్వత స్వభావం కలిగిన పనులను సంవత్సరాల నుండి చేస్తున్నారు. లేబర్ కోడ్‌ల వలన కాంట్రాక్ట్ వర్కర్లకు ఎటువంటి రక్షణ, ప్రయోజనాలు లభించవు. ఇప్పుడున్న కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం 20 లోపు వర్కర్లు ఉన్నా కాంట్రాక్టర్ లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. కానీ ఈ కోడ్‌లో ఈ పరిమితిని 50కి పెంచారు. దీని ప్రకారం 50కి లోపు వర్కర్స్ వున్న కాంట్రాక్టర్ లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదు. లైసెన్స్ లేని కాంట్రాక్టర్‌ను కాంట్రాక్ట్ వర్కర్ల హక్కులు, ప్రయోజనాలు అమలు చేసేలా చేయటం సాధ్యం కాదు. కాబట్టి మరింత ఎక్కువ మంది కాంట్రాక్ట్ కార్మికులకి హక్కులు, ప్రయోజనాలు లభించవు ఈ లేబర్ కోడ్‌ల వలన.

> *1991లో ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు 21 సార్లు దేశవ్యాప్త సమ్మెలు జరిగాయి. గత ప్రభుత్వాలకు సమ్మెలతోనే భారత కార్మికవర్గం సమాధానం చెప్పింది. నేడు కూడా 2025 జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెతోనే కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలి. కార్మికవర్గం అందుకు సిద్ధం కావాలి.*

కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకుండా ఎగవేస్తే లేదా పారిపోతే కార్మికులకు దిక్కులేదు. కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం శాశ్వత స్వభావం గల పనులను రెగ్యులర్ వర్కర్స్‌తో చేయించాలి. కానీ ఈ కోడ్ దీనిని ఎత్తివేసింది. రెగ్యులర్ కార్మికులు ఉండాలని ఈ కోడ్ అంటున్నది. కానీ ''కోర్'' అంటే ఏమిటో నిర్వచించే పనిని సంబంధిత ప్రభుత్వాలకు వదిలేసింది. కార్మికుల, యూనియన్ల ప్రమేయం లేకుండా చేస్తుంది. ఈ కోడ్ సక్రమంగా అమలు జరగని సంస్థలు, కంపెనీల్లో కార్మికులు కోర్టులో సివిల్ కేసు వేయడాన్ని కూడా నిషేధించింది.

ఇలాంటి ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు దీర్ఘకాలిక బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం 2025 జులై 9న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గంతో పాటు ప్రజలు కూడా సంపూర్ణంగా భాగస్వామ్యం కావాలని కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి.

# పనిగంటలు పెంచితేనే కార్మిక, ఉద్యోగ సంక్షేమం సాధ్యమా!?



డా.కోలాహలం రామ్‌కిశోర్
9849328496

పనిగంటలు పెంచడం ద్వారా ఉత్పాదకతను మెరుగుపరచవచ్చనే ఆలోచన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో ఒక వివాదాస్పద అంశంగా నిలిచింది. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి 2023లో 70 గంటల పని వారం అవసరమని సూచించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిగంటలు పెంచే జీవోలు జారీ చేయడం ఈ చర్చను మరింత తీవ్రతరం చేసిం ది. కార్మిక సంఘాలు, వామ పక్ష పార్టీలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి, ఇది కార్మికుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వాదిస్తున్నాయి. ఈ వ్యాసం చారిత్రక సందర్భం, ఆధునిక అధ్యయనాలు అలాగే నైతిక దృక్కోణం నుంచి ఈ సమస్యను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది.

### చారిత్రక నేపథ్యం: 8-8-8 సూత్రం

19వ శతాబ్దంలో ఉద్యోగ, కార్మిక విప్లవ సమయంలో, కార్మికులు రోజుకు 12–16 గంటలు అమానుష పరిస్థితులలో పనిచేసేవారు. ఈ అధిక పనిగంటలు కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవనం మరియు సామాజిక శ్రేయస్సుపై తీవ్ర ప్రభావం చూపాయి. 1817లో రాబర్ట్ ఓవెన్ ప్రతిపాదించిన 888 సూత్రం— 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు వ్యక్తిగత జీవనం— కార్మిక ఉద్యమాల ఫలితంగా 20వ శతాబ్దంలో అమల్లోకి వచ్చింది. ఈ విభజన శాస్త్రీయంగా కార్మికుల సామర్థ్యం, శ్రేయస్సును పెంపొందించింది. అయితే, ఆధునిక పెట్టుబడిదారీ విధానంలో లాభాల కోసం ఈ సూత్రాన్ని విస్మరించే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి.



### ఆధునిక సందర్భం

నారాయణ మూర్తి 70 గంటల పనివారం సూచన భారతదేశంలో ఉత్పాదకత పెంచడానికి ఉద్దేశించబడినప్పటికీ, ఇది కార్మిక సంక్షేమాన్ని విస్మరించినట్లు విమర్శలు వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రంగాలలో పనిగంటలు పెంచడానికి జీవోలు జారీ చేయడంతో, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వామపక్షాలు దీనిని లాభ దృష్టితో కూడిన మొండి విధానంగా గుర్తించాయి. ఈ నిర్ణయాలు కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవనం అలాగే సామాజిక సమతుల్యతపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వారు వాదిస్తున్నారు. ఇటీవలి అధ్యయనాలు పనిగంటలు పెంచడం వల్ల ఉత్పాదకతలో తాత్కాలిక పెరుగుదల కనిపించినప్పటికీ, దీర్ఘకాలంలో ఇది ప్రతికూల ఫలితాలను తెస్తుందని సూచిస్తున్నాయి. 2019లో నిర్వహించిన ఒక మెటా విశ్లేషణ ప్రకారం, వారానికి 48 గంటలకు మించి పనిచేసే కార్మికులు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, నిద్ర లోపం, వృత్తిపరమైన గాయాలకు గురవుతారు. ఈ అధ్యయనం ప్రభుత్వాలు, యజమానులు పనిగంటలను పరిమితం చేయాలని, కార్మికుల ఆరోగ్యాన్ని రక్షించాలని సిఫార్సు చేస్తుంది.

మరోవైపు, తక్కువ పనిగంటలు లేదా నాలుగు రోజుల పనివారం వంటి ప్రత్యామ్నాయ షెడ్యూల్‌లు కార్మికుల ఆరోగ్యం, సంతృప్తి మరియు ఉత్పాదకతను మెరుగుపరుస్తాయని అధ్యయనాలు చూపిస్తున్నాయి. 2023లో యూకేలో నిర్వహించిన నాలుగు రోజుల పనివారం ప్రయోగం 92 శాతం కంపెనీలు దీనిని శాశ్వతంగా అమలు చేయడానికి మొగ్గు చూపాయి, ఎందుకంటే ఇది ఉద్యోగుల సంతృప్తిని పెంచడమే కాకుండా, ఆదాయాన్ని 8 శాతం పెంచింది. ఈ ప్రయోగం కార్మికుల ఒత్తిడి తగ్గించి, కుటుంబ జీవనానికి మరింత సమయం కేటాయించడానికి వీలు కల్పించింది.

### ఆర్థిక దృక్కోణం: లాభాలు వర్సెస్ సంక్షేమం

పెట్టుబడిదారీ విధానంలో, లాభాలు పెంచడం కోసం కార్మికులపై అదనపు ఒత్తిడి విధించడం సర్వసాధారణం. మార్క్స్ లేబర్ వాల్యూ థియరీ ప్రకారం, కార్మిక శక్తి వినియోగం కాపిటలిస్ట్ లాభాలకు ప్రధాన వనరుగా ఉంటుంది, కానీ దీనిని 'అదృశ్యం' చేయడం ద్వారా కార్మికుల సహకారాన్ని తక్కువ చేస్తారు. నారాయణ మూర్తి వంటి పారిశ్రామికవేత్తలు ఎక్కువ పనిగంటలు ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని వాదిస్తున్నప్పటికీ, ఇది కార్మికుల ఆరోగ్యం, దీర్ఘకాల ఉత్పాదకతను దెబ్బతీస్తుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

ఉదాహరణకు, ఒక కాల్ సెంటర్ అధ్యయనం ప్రకారం, పనిగంటలు 1 శాతం పెరిగితే, ఉత్పాదకత కేవలం 0.9 శాతం మాత్రమే పెరుగుతుంది, ఇది అలసట వల్ల సామర్థ్యం తగ్గుతుందని సూచిస్తుంది. ఇది లాభాల కోసం కార్మికుల సంక్షేమాన్ని త్యాగం చేయడం దీర్ఘకాలంలో ఆర్థికంగా నష్టదాయకమని చూపిస్తుంది. ఎక్కువ పనిగంటలు కార్మికుల కుటుంబ జీవనంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. యూరోపియన్ సోషల్ సర్వే (2022) ప్రకారం, ఎక్కువ పనిగంటలు జీవన సంతృప్తిని తగ్గిస్తాయి, ముఖ్యంగా ఆరోగ్యం మధ్యవర్తిగా ఉన్నప్పుడు. నాలుగు రోజుల పనివారం వంటి విధానాలు కార్మికుల ఒత్తిడిని తగ్గించి, సామాజిక సమతుల్యతను పెంపొందిస్తాయని ఈ అధ్యయనం సూచిస్తుంది. పెట్టుబడిదారీ విధానంలో కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం నీతి పరమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. లాభ దృష్టితో కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవనాన్ని పణంగా పెట్టడం న్యాయబద్ధమా? కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఈ విధానాలను 'అమానుష'మని విమర్శిస్తున్నాయి, ఎందుకంటే ఇవి కార్మికుల హక్కులను కాలరాస్తాయి.

### ప్రత్యామ్నాయాలు - సిఫార్సులు

అధ్యయనాలు తక్కువ పనిగంటలు లేదా సౌకర్యవంతమైన షెడ్యూల్‌లు ఉత్పాదకత, కార్మిక సంక్షేమాన్ని మెరుగుపరుస్తాయని సూచిస్తున్నాయి. ఉదాహరణకు, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (2023) నివేదిక ప్రకారం, సౌకర్యవంతమైన పని ఏర్పాట్లు ఉద్యోగుల సంతృప్తిని పెంచుతాయి, ఉత్పాదకతను మెరుగుపరుస్తాయి. ప్రభుత్వాలు పని గంటలను పరిమితం చేసే చట్టాలను బలోపేతం చేయాలి, మరియు కంపెనీలు కార్మికుల ఆరోగ్యం, జీవన సంతృప్తిని పరిగణనలోకి తీసుకోవాలి.

చివరిగా... పనిగంటలు పెంచడం ద్వారా లాభాలు సాధించాలనే పెట్టుబడిదారీ విధానం దీర్ఘకాలంలో కార్మికుల సంక్షేమాన్ని, ఉత్పాదకతను దెబ్బతీస్తుంది. 888 సూత్రం చారిత్రకంగా కార్మికుల హక్కులను రక్షించింది, ఆధునిక అధ్యయనాలు తక్కువ పనిగంటలు లేదా సౌకర్యవంతమైన షెడ్యూల్‌లు మెరుగైన ఫలితాలను ఇస్తాయని చూపిస్తున్నాయి. ప్రభుత్వాలు, పరిశ్రమలు లాభాలతో పాటు కార్మికుల ఆరోగ్యం, సామాజిక శ్రేయస్సును పరిగణనలోకి తీసుకోవాలి. నైతిక దృష్టితో, సమతుల్య విధానం అవలంబించడం ద్వారా సమాజం, ఆర్థిక వ్యవస్థ రెండూ ప్రయోజనం పొందగలవు.

# పిడుగుల నుంచి రక్షణ చర్యలు

**వర్షాకాలం ఉరుములు, మెరుపులు, పిడుగులతో తస్మాత్ జాగ్రత్త..**



నైరుతి రుతపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయి. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని జిల్లాలలో అధిక వర్షపాతం నమోదు అవుతూ ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం అక్కడక్కడా కురుస్తుంది. ప్రజలకు, వాహనదారులకు పిడుగుల భయం పట్టుకుంది. వేసవి ముగియగానే పిడుగుల కాలం మొదలవుతుంది. కొన్ని వేల మెగావాట్ల శక్తి కలిగిన పిడుగులు అటు జీవుల ప్రాణాలు తీయడంతో పాటు విలువైన వస్తువులను కాల్చి బూడిద చేస్తుంటాయి. వర్షాకాలం ఆరంభంలో ఆకాశంలో జరిగే ఒత్తిడి, అలజడుల వల్ల పిడుగులు పడుతుంటాయి. వర్షం ప్రారంభం కాగానే నిర్లక్ష్యం విడిచి అప్రమత్తంగా ఉంటే పిడుగుల భారీ నుంచి కొంత వరకు బయట పడవచ్చు. ఆకాశంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడిన సందర్భాల్లో ఏదో ఒక చోట పిడుగు కాటుకు గురై ప్రతీ ఏటా వందలాది మంది మృత్యువాత పడుతున్నారు. మూగజీవాలు సైతం పిడుగుకు బలైపోతున్నాయి. అధిక శాతం మంది పశువుల కాపర్లు, వ్యవసాయ భూముల్లో పనిచేసుకునే రైతులు, కూలీలు ఎక్కు వగా ఉంటున్నారు. పిడుగు శబ్దానికి కొందరు ప్రాణాలు వదులుతుండగా, ఇంకొందరు దాని భయం, తీవ్రతకు బలవుతున్నారు. పిడుగులు పడే సమాచారాన్ని విపత్తుల నివారణ శాఖ ముందుగానే పలు సందార్భాల్లో ప్రకటిస్తున్నప్పటికీ ప్రమాదాలు తప్పడం లేదు. పిడుగుల బారి నుంచి తప్పించుకోవడానికి అప్రమత్తతతో వ్యవహరించాలి. గాలులు వీస్తున్నా, ఉరుములు ఉరిమినా పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో సమీపంలో గల పెద్ద భవనాల్లోకి వెళ్లడం మంచిది. ఉరుములు, మెరుపులు, గాలివాన సమయంలో ద్విచక్రవాహనాలు, కారు లు, ఆటోలు మిగతా వాహనాలు నడపడం మానుకోవాలి. లోహపు వస్తువులను తాకకుండా ఉండాలి. ఆరుబయట ప్రదేశాల్లో సెల్‌ఫోన్ వినియోగించవద్దు. ఉరుములు, మెరుపుల సమయంలో ఇళ్లలో తలుపులు, కిటికీలు మూసివేయాలి. ఇంట్లో విద్యుత్‌తో నడిచే అన్ని వస్తువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలి. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికత వల్ల పిడుగులు పడే సమాచా రాన్ని యాప్ ద్వారా సైతం తెలుసుకునే వీలుంది. యాప్ ద్వారా ఏ ప్రాంతంలో పిడుగు పడుతుందో కొంతవరకు తెలిసిపోతుంది. మనం ఎంత వరకు రక్షణ పొందవచ్చునో తెలుసుకునే వీలుంది. విపత్తుల నివారణ శాఖ సైతం వర్షం, పిడుగులు, ఉరుములు, మెరుపుల సమాచారాన్ని ఎప్ప టికప్పుడు ప్రకటిస్తుంటుంది. ముందుగానే ఆయా జిల్లా లలో కలెక్టరులు, మండలాల తహసీల్దార్లను, అధికారులను అప్రమత్తం చేస్తోంది. పిడుగుపాటుకు గురయ్యే సమ యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా విపత్తుల శాఖ అధికారులు కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పిడుగు పాటు కు గురై మృత్యువాత పడిన బాధిత కుటుంబాలకు ప్రకృతి విపత్తు నష్టం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందిస్తుంటాయి. ఎర్తింగ్ తప్పకుండా ఏర్పాటు చేయాలి.. అధిక ఓల్టేజీ వచ్చి ఇళ్లలోని విద్యుత్తు గృహోపకరణాలు దగ్ధం అవుతుంటాయి. పిడుగులు పడే సమయంలో ఓల్టేజీ కొన్ని వందల రెట్లు పెరిగే అవకాశం ఉంది. దీన్ని నివారించేందుకు ఇంటికి తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. తీగలు, ఫ్యూజులు సైతం ఐఎస్ఐ మార్కు కలిగిన నాణ్యమైన ఉత్పత్తులనే వాడాలి.

ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో అన్ని విద్యుత్తు గృహపకరణాలను బంద్ చేసి ఉంచడం, ప్లగ్ తీగలను తీసి ఉంచడం మంచిది. భవనాలు, ఇళ్లపై సైతం పంచలోహాలతో తయారు చేసిన పరికరాన్ని బిగించుకోవడం వల్ల కొంతమేర పిడుగు బారినుంచి తప్పించుకోవచ్చు. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్స్, భవనాలు, చర్చిలు, దేవాలయాలు, మజీదులపై ఇలాంటి పరికరాన్ని బిగించడం సాధారణంగా జరుగుతుంటుంది. చెట్ల కిందకు వెళ్లడం ప్రమాదం. పిడుగులు పడతాయన్న సూచనలు కనిపించే సమయంలో చెట్ల కిందకు వెళ్లడం మంచిది కాదు. పిడుగులు భూమి మీదకు వచ్చే సమ యంలో ఎత్తయిన చెట్లు, పచ్చిక మైదానాలు, కొండలు, లోహాలను ఆకర్షిస్తాయి. చెట్ల కింద నిలుచున్న సమయంలో పిడుగులు పడితే శక్తి మనుషుల నుంచి ప్రసరించి ప్రమాదాల బారిన పడుతారు. ఆ సమయంలో నిలబడి ఉండటం కంటే నేలపై పడుకోవడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గే అవకాశం ఉంటుంది.జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం. అధిక జాగ్రత్తలు పాటిస్తే వానాకాలంలో పడే పిడుగుల బారి నుంచి రక్షణకు గురయ్యే అవకాశాలున్నాయి. వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద ఉండ కూడదు. విద్యుత్ స్తంభాలు, తీగలకు సమీపంలో నిలబడకూడదు. ప్రధానంగా ఎత్తయిన ప్రాంతాలపై పిడుగులు పడే అవకాశాలున్నాయి. పంచలోహ పరికరాన్ని బిగించుకోవడం వల్ల పిడుగు బారి నుంచి రక్షణ పొందే అవకాశాలున్నాయి. ప్రమాదాలకు గురైతే తక్షణమే చికిత్స అందించాలి వానాకాలం సీజన్‌లో పిడుగు ప్రమాదాలకు గురైన వ్యక్తులకు తక్షణమే చికిత్సలు అందించడానికి కుటుంబ సభ్యులు, ఇరుగు, పొరుగు ప్రయత్నించాలి. సమీపంలో ఉన్న వైద్యశాలలకు తీసుకవెళ్లి చికిత్స అందించాలి. పిడుగులు పడిన సందర్భాల్లో శరీరం కాలి గాయాలు కావడం, అకస్మాత్తుగా గుండె పోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు పని చేయకపోవడం వంటి ప్రమాదాలు జరుగుతుంటాయి. సరియైన సమయంలో చికిత్స అందించడం వల్ల కొంత మేలు కలిగే అవకాశాలు వున్నాయి. ప్రతీ ఒక్కరూ పిడుగుల గూర్చి, వాని రక్షణ చర్యలు గూర్చి తెలుసుకోవాలి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకి అవగాహన కల్పించాలి. పట్టణాలు, నగరాలలో, గ్రామంలలో అధికారులు, సిబ్బంది కూడా పిడుగు పాటు వల్ల జరిగే అనర్థాలు, ముందు జాగ్రత్తలు మీద అవగాహన కల్పించాలి.

— కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాలపల్లి, 9848445134



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## జిడిపిలో పరిశ్రమల వాటా క్షీణిస్తూ... 'బడా వ్యాపారాలు' పెరుగుతున్నాయ్

**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ విమర్శలదాడికి దిగింది. ప్రభుత్వం బడా వ్యాపారాలపై దృష్టి సారించింది కానీ అలాంటి వ్యాపారాలు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి (కమ్యునికేషన్స్) జైరామ్ రమేష్ సోమవారం తన 'ఎక్స్' పోస్ట్‌లో ఈ విషయమై స్పందిస్తూ స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి)లో పరిశ్రమల వాటా క్షీణిస్తోందని, పరిశ్రమలపై ఏకాగ్రత పెరిగినట్లే ధరలపెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణాలలో ఇది ఒకటి అవుతోందన్నారు. పారిశ్రామిక వృద్ధిపై ప్రధానమంత్రి ఆయన భజన పరులు పెద్ద పెద్ద వాదనలు కొనసాగిస్తున్నారు. 'ఇందులో మూడు వాస్తవాలు వివాదాస్పదమైనవి. పరిశ్రమలపై ఏకాగ్రత పెరిగినందువల్లే స్థూల దేశీయ ఉత్పత్తిలో పరిశ్రమల వాటా క్షీణిస్తోంది. దీనివల్ల వినియోగదారులు ధరల పెరుగుదలను ఎదుర్కొంటున్నారు. ఇది వినియోగదారులకు ధరలు పెంచింది. ధరల పెరుగుదల కారణంగా ద్రవ్యోల్బణం ఏర్పడటానికి ఇది ప్రధానకారణాలలో ఒకటిగా ఉంది' అని తన పోస్ట్‌లో ఆరోపించారు.

# ప్రజలు, కాంగ్రెస్ నేతలను భయపెట్టేందుకు బిజెపి యత్నం



### ఎన్నికల హామీలు పూర్తిగా విస్మరించింది
### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శ

**రాయ్‌పూర్ :** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పాలక బిజెపి విస్మరించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. 'జల్, జంగల్, జమీన్' (నీరు, అడవి,భూమి)ను రక్షించుకోవడానికి పోరాటంలో ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి ఒక్కరినీ బెదిరించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తూ వాటిని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు.భారీవర్షాలమధ్య రాయ్‌పూర్‌లోని సైన్స్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన 'జై జవాన్–జై కిసాన్‌జై – సంవిధాన్' అనే బహిరంగ ర్యాలీలో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వంలో పేదలు దోపిడీకి గురవుతున్నారన్నారు. 2023 మే నుండి జాతి ఘర్షణలకు గురైన మణిపూర్‌లో పర్యటించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమయం లేకుండా పోయిందని ఖర్గే విమర్శించారు. ఇడి, ఐటి వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి బిజెపి తమ నాయకులను బెదిరించడానికి ప్రయత్నిస్తోంది, వారి బెదిరింపులకు ఎప్పటికీ భయపడబోమన్నారు. మాజీ ముఖ్యమంత్రి (భూపేశ్ బఘేల్)తో సహా ఛత్తీస్‌గఢ్‌లోని తమ పార్టీ నాయకులను (దర్యాప్తు సంస్థలను ఉపయోగించి) వేధిస్తున్నారన్నారు. బిజెపి కూడా సోనియా గాంధీ మరియు రాహుల్‌జీలను నేషనల్ హెరాల్డ్ కేసులో ఇరికించడానికి ప్రయత్నించిందని, ఎల్లప్పుడూ కాంగ్రెస్‌ను అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తారని ఖర్గే మండిపడ్డారు. ఎన్నికలకు ముందు బిజెపి చాలా వాగ్దానాలు చేస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరచిపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. అందరినీ బెదిరించడం కాషాయ పార్టీ నేతలకు అలవాటైపోయిందని, మీరు భయపడనప్పుడే బతుకుతారన్నారు. మన జల, అడవి, జమీన్ (నీరు, అడవి, భూమి)ను మనం కాపాడుకోవాలనుకుంటే, మీరందరూ బిజెపికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఐక్యంగాఉండాలన్నారు. నేడు, అదానీ, అంబానీ వంటి వ్యక్తులు ఛత్తీస్‌గఢ్ వచ్చి భూమిని ఆక్రమించుకుంటున్నారని, వారు గనుల కోసం అడవులలో లక్షలాది చెట్లను నరికివేస్తున్నారన్నారు. మోదీజీమన గిరిజన సోదరులు, ఛత్తీస్‌గఢ్ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత దుయ్యబట్టారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీసగఢ్‌నుమళ్లీ మళ్లీ ఎందుకు సందర్శిస్తున్నారు? ఇది వారి అత్తమామల స్థలమా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రధాని, హోంమంత్రి సూచనలను అనుసరిస్తారని, వారు లేవండి అని చెబితే, అతను లేస్తాడు, వారు కూర్చోండి అని చెబితే కూర్చుంటాడు అని ఎద్దేవా చేశారు. ఇది ఛత్తీస్‌గఢ్ ఆత్మగౌరవానికి పెద్ద ద్రోహమన్నారు. పెద్ద అవమానం అని ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బొగ్గు, ఇతర ఖనిజ నిక్షేపాలను దోచుకోవడానికి చాలా మంది పారిశ్రామికవేత్తలు వస్తున్నారని, వారు ప్రజల గురించి ఆందోళన చెందడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. 'మోదీ జీ, షా జీ పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇస్తున్నారు. ఖనిజాల కోసం తనిఖీ చేయడానికి షా ఇక్కడ సందర్శిస్తున్నారు' అని పేర్కొన్నారు.

## హిమాచల్‌లో నీట మునిగిన బ్యాంకు రూ. కోట్లలో నష్టం అంచనా



**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌ను వరదలు ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సహకార బ్యాంకు నీట మునిగింది. లక్షల్లో నగదు, లాకర్లలో దాచిన నగలు, విలువైన పత్రాలు పాడైనట్లు భావిస్తున్నారు. దీంతో కోట్లలో నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మండి జిల్లాలోని తునాగ్‌లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు చాలా ప్రసిద్ధి. సమీపంలోని పట్టణాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు, వేలాది మంది ఖాతాదారులు తమ డబ్బును ఈ బ్యాంకులో డిపాజిట్ చేస్తుంటారు. నగదుతోపాటు నగలు, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో దాచుకున్నారు. కాగా, జూన్ 20 నుంచి జూలై 6 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాన్ని 23 ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వర్షాలు, వరదలకు మండి జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలో తునాగ్ మార్కెట్ ప్రాంతంలోని రెండతస్తుల బిల్డింగ్‌లో ఉన్న రాష్ట్ర సహకార బ్యాంకు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయింది. నీటి ప్రవాహం ఉధృతికి ఒక షట్టర్ పైకి లేచింది. మరో రెండు షట్టర్‌లు వంకరపోయాయి. మరోవైపు వరద నీటి వల్ల ఆ బ్యాంకులోని లక్షలాది నగదుతోపాటు లాకర్లలో ఉన్న నగలు, డబ్బు, ఇతర పత్రాలు పాడై ఉంటాయని బ్యాంకు అధికారులు భావిస్తున్నారు. కోట్లలో నష్టాన్ని అంచనా వేస్తున్నారు. దీంతో వ్యాపారులు, కస్టమర్లు ఆందోళన చెందుతున్నారు. వరదల వల్ల ఆ బ్యాంకు నుంచి కొట్టుకుపోయిన విలువైన వస్తువులు చోరీ కాకుండా ఉండేందుకు స్థానికులు అక్కడ కాపలా ఉన్నారు.

## మోదీ ప్రభుత్వం ధనవంతుడిని మరింత సంపన్నుడుగా చేస్తోంది

### కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ధ్వజం
### ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌లో పెద్ద ఆటగాళ్ల తారుమారుపై మౌనం దేనికని ప్రశ్న



**న్యూఢిల్లీ :** భవిష్యత్తులు మరియు ఎంపిక (ఎఫ్ అండ్ ఓ) మార్కెట్‌లో పెద్ద ఆటగాళ్ల తారుమారుపై నరేంద్ర మోదీ ప్రభుత్వం మౌనం వహించడం ద్వారా ధనవంతులను మరింత ధనవంతులుగా మారుస్తూ సాధారణ పెట్టుబడిదారులను నష్టాల అంచుల్లోకి నెట్టివేస్తున్నదని కాంగ్రెస్ ముఖ్యనేత, లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఆయన సోమవారం నాడు తన 'ఎక్స్' పోస్టింగ్‌లో ఈ విషయమై మాట్లాడుతూ ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌లోని లొసుగులను తాను ఊహించానన్నారు. 'నేను 2024లోనే స్పష్టంగా వివరించాను. భవిష్యత్తులు, ఎంపికల మార్కెట్ పెద్ద ఆటగాళ్లు, చిన్న ఇన్వెస్టర్లకు ఆటస్థలంగా మారింది. చిన్న ఆటగాళ్ల జేబులు నిరంతరం ఖాళీ అవుతున్నాయని కూడా చెప్పాను' అని రాహుల్‌గాంధీ గుర్తుచేశారు. ఇప్పుడు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) స్వయంగా జేన్ స్ట్రీట్ (గ్రూప్) వేల కోట్ల రూపాయలను తారుమారు చేసిందని ఒప్పుకుంది. దీనిపై చాలాకాలంగా సెబీ ఎందుకు మౌనం వహిస్తోంది ? అని ఆయన తన 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకుండా, మార్కెట్‌ను మోసం చేసే వ్యక్తులు ఇంకెంత మంది ఉంటారోనని రాహుల్‌గాంధీ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఎవరి ఆదేశం మేరకు మోదీ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చున్నదని, ఇంకా ఎన్ని పెద్ద షార్క్‌లు రిటైల్ పెట్టుబడిదారులను తగ్గిస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం ధనవంతుడిని మరింత ధనవంతుడిగా మారుస్తూ సాధారణ పెట్టుబడిదారులను మాత్రం నష్టాల అంచుల్లోకి నెట్టివేస్తుందన్న వాస్తవం ప్రతీ సందర్భంలోనూ స్పష్టమవుతోందన్నారు. 2024 సెప్టెంబర్ 24న రాహుల్‌గాంధీ ట్యాగ్ చేసిన తన పోస్ట్‌లో అనియంత్రిత ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ 5 సంవత్సరాలలో 45రెట్లు పెరిగిందని, మూడేళ్లలో చిన్న ఇన్వెస్టర్లు రూ. 1.8 లక్షల కోట్లు నష్టపోయారని వివరించారు.

## బీహార్ ఎన్నికల సంఘం పోస్టాఫీస్‌లా పనిచేస్తోంది : తేజస్వి యాదవ్

**పాట్నా :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పేరుతోఓటర్లజాబితాను సవరించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. దీనిపై బిహార్‌లో ప్రతిపక్ష మహాకూటమి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ఓటర్ల జాబితా సవరణదేనికని,రెండునెలల్లోజాబితాను సవరించడం సాధ్యమా? అనిఆర్‌జెడి కీలక నేత తేజస్వి యాదవ్‌ప్రశ్నిస్తున్నారు. తాము ఈ నెల 5న ఎన్నికల సంఘాన్ని కలిసిఅతి తక్కువ సమయంలో ఎన్నికల జాబితాను సవరించడంతో వచ్చే సమస్యలపై సందేహాలు లేవనెత్తామని తెలిపారు. కానీ ఎన్నికల సంఘం నుంచి తమకు ఇంతవరకు వివరణ రాకపోవడం ఆందోళనకరమైన విషయమన్నారు. బీహార్ ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీస్‌లా పనిచేస్తున్నదని, తమ సందేహాలకు సమాధానం ఇచ్చే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘం దగ్గర లేదని విమర్శించారు. ఎన్నికల సంఘం ఆదివారం మూడు పరస్పర విరుద్ధమైన సూచనలు చేసిందని అన్నారు.

## ఎలుగుబంటి దాడిలో ముగ్గురు మృతి

**భోపాల్:** ఎలుగుబంటి దాడిలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు కర్రలతో ఆ ఎలుగుబంటిని వెంబడించారు. దానిని కొట్టి చంపారు. మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం సంజయ్ గాంధీ టైగర్ రిజర్వ్ సమీపంలోని బస్తువా గ్రామంలో ఐదుగురు వ్యక్తులపై ఎలుగుబంటి దాడి చేసింది. ముగ్గురు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఎలుగుబంటి దాడిలో ముగ్గురు చనిపోవడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. కర్రలతో దానిని వెంబడించారు. ఒక పొదలో దాగి ఉన్న ఎలుగుబంటిని కొట్టి చంపారు. దాని దాడిలో ముగ్గురు మరణించగా మరో ఇద్దరు గాయపడిన సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతులను బబ్బు యాదవ్, దీన్‌బంధు సాహు, సంతోష్ యాదవ్‌గా గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు కూడా ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## యూట్యూబర్ జ్యోతిమల్హోత్రాకు కేరళ సర్కార్‌తో లింక్ నివేదిక...

### బిజెపి కేరళ వ్యతిరేక ప్రతీకార చర్య
### తీవ్రంగా ఖండించిన సిపిఐ
### జాతీయ భద్రతా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకేనని సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ ధ్వజం



**న్యూఢిల్లీ :** గూఢచర్యం అభియోగాలపై అరెస్ట్ అయిన యూట్యూబర్ జ్యోతిని కేరళ రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రామోటింగ్ చేసేందుకు కేరళ ప్రభుత్వం ఆహ్వానించిందని ముడిపెడుతూ ఇచ్చిన నివేదికలను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గట్టిగా ఖండించింది. 'యూట్యూబర్ జ్యోతి గూఢచర్యం కేసులోకి కేరళ ప్రభుత్వాన్ని లాగాలని బిజెపి చేసే ప్రయత్నం ఇది అని కమ్యూనిస్టు పార్టీ దీనిని తీవ్రంగా ఖండించింది. జాతీయ భద్రతకు సంబంధించి తీవ్ర వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బిజెపి ఈ చర్యలకు పాల్పడుతోందని సిపిఐ ఎంపి పి.సందోష్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన ఇక్కడొక ప్రకటన విడుదల చేశారు. పాస్‌పోర్ట్ జారీ, వీసా క్లియరెన్స్, ఇంటెలిజెన్స్ మోనిటరింగ్ అన్నీ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నప్పుడు యూట్యూబర్ పాకిస్థాన్ వెళ్లినందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సూచించడం దారుణం అన్నారు. 'కేరళ ప్రభుత్వం ఆమె పాకిస్థాన్ సందర్శనలను ఏమైనా ఆమోదించిందా?. దానివల్ల ఆమెకు ఢిల్లీలోని ఐఎస్‌ఐ హ్యాండ్లర్లతో పరిచయం ఏర్పడిందా?. ఇది నిరాశపరిచే రాజకీయ ప్రేరేపిత పక్కదోవ పట్టించే చర్య' అని సందోష్‌కుమార్ బిజెపిపై నిప్పులు చెరిగారు. గూఢచర్యం, ఉగ్రవాదంతో ముడిపడిపడి ఉన్న తమ సభ్యులకు సంబంధించి ఇబ్బందికరమైన జాబితా బిజెపి కలిగి ఉందని ఆయన స్పష్టం చేశారు. 'భోపాల్‌లోని ఐటి సెల్ నుంచి ధృవ్ సక్సేనా, భజరంగ్ దళ్‌కు చెందిన బల్‌రామ్ సింగ్, లష్కర్‌ఏతోయిబా ఉగ్రవాది తాలిబ్‌సింగ్, ఆయుధాల సరఫరా కేసులో అరెస్ట్ అయిన బిజెపి నాయకుడు తారిఖ్ మీర్, రాష్ట్రపతి పతకం ప్రదానం చేయబడిన డిఎస్‌పి దవీందర్ సింగ్ హిజుబుల్ ఉగ్రవాదులకు ఎస్కార్టింగ్ చేస్తూ పట్టుబడ్డాడని, ఆతర్వాత పాకిస్థానీ హ్యాండ్లర్లతో సంబంధాలు కలిగి ఉన్నాడని ఇదే బిజెపి వాస్తవిక జాతీయ భద్రతా రికార్డ్' అని ఆయన చెప్పారు. 'ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రదాడి నేరస్థులు ఇప్పటి వరకు కూడా కనుగొనబడి, అరెస్ట్ చేయబడలేదు' అని సందోష్ కుమార్ ఆరోపించారు. 'దీని అంతటికీ బాధ్యత తీసుకోడానికి బదులుగా బిజెపి ఇప్పుడు కేరళ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంది. మల్హోత్రా ఒక రొటీన్ టూరిజం ఈవెంట్‌మెంట్ ద్వారా ఒకసారి హాజరైన ఆమెకు, ఐఎస్‌ఐ రిక్రూట్‌మెంట్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేనప్పటికీ, కేంద్రానికి చెందిన సొంత దర్యాప్తు సంస్థలు ఆమె అనేకసార్లు పాకిస్థాన్‌ను పర్యటనలు, విదేశీ నిధులను గుర్తించడంలో విఫలమయ్యాయి. ఇది అంతా నేరుగా వారి అధికార పరిధి కిందకే వస్తుంది' అని సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ వెల్లడించారు. జాతీయ భద్రత అనేది కేంద్ర అంశం, కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి అంశం, తరచూ నిఘా వైఫల్యాలు ఎదుర్కొంటూ వారు చేతులు కడుక్కోలేరు. వారి సమూహంలోనే గూఢచర్యం, ఉగ్రవాద సంబంధాలు కలిగిఉన్న వ్యక్తుల పేర్ల జాబితా పెరిగిపోతోంది' అని సిపిఐ నేత సందోష్ ఆరోపించారు. 'భారతదేశ ప్రజలు జవాబుదారీతనానికి మాత్రమే అర్హులు. కానీ బలిపశువులు అయ్యేందుకు, రాజకీయ ప్రతీకారానికి గురయ్యేందుకు మాత్రం కాదు' అని ఆయన బిజెపిని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రాష్ట్ర నిర్వహణలో జరిగే ప్రభావశీల కార్యక్రమానికి కేరళ ప్రభుత్వం ఆహ్వానించిన వారిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కూడా ఒకరు అని సమాచార హక్కు సంస్థ (ఆర్‌టిఐ) ప్రతిస్పందనను ఉటంకిస్తూ నివేదికలు వచ్చాయి.

## మహారాష్ట్ర తీరంలో అనుమానాస్పద బోటు..

**ముంబయి :** మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా రేవ్‌దండలోని కొర్లాయ్ తీరం సమీపంలో ఒక అనుమానాస్పద పడవను గుర్తించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ పడవ పాకిస్థాన్‌కు చెందినది కావచ్చని అనుమానిస్తున్నారు. రాయ్‌గఢ్ పోలీసులు,తీరప్రాంతభద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. కొర్లాయ్ తీరానికి రెండు నాటికల్ మైళ్లదూరంలో ఒక అనుమానాస్పద పడవను ఇండియన్ నేవీ రాడార్ ఆదివారం రాత్రి గుర్తుపట్టింది.ఇది పాకిస్థాన్‌పడవకావచ్చని, అయితే పడవను అడ్డుకుని అధీనంలోకి తీసుకున్న తర్వాతే దాని పూర్తి వివరాలు తెలుస్తాయని సీనియర్ అధికారిఒకరుతెలిపారు.ప్రాథమిక సమాచారం ప్రకారం పడవ రాయ్‌గఢ్ తీరానికి కొట్టుకుని వచ్చి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పడవను గుర్తించడంతోతీరప్రాంతం వెంబడి గస్తీని పెంచారు. పడవ సమాచారం తెలిసిన వెంటనే రాయ్‌గఢ్ పోలీసులు,బాంబ్‌డిటెక్షన్‌అండ్‌డిస్పోజల్ స్క్వాడ్ (బిడిడిఎస్),తక్షణస్పందనబృందం (క్యూఆర్‌టి), నేవీ, కోస్ట్ గార్డ్ సిబ్బంది రాత్రికి రాత్రి ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

## ఓటర్ల జాబితాకు వ్యతిరేకంగా ప్రతిపక్షం ఐక్యం



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను సుప్రీంకోర్టులో సవాలు చేస్తున్న తొమ్మిది పార్టీలతోకాంగ్రెస్ కూడా జతకట్టింది. ఈ అంశంపై మొత్తం ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నాయని పేర్కొంది. ఈ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓటర్ల ఓటు హక్కును తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ ప్రారంభించిన సవరణ ప్రక్రియ రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో గందరగోళానికి కారణమవుతోందని, తమ ఓటు హక్కు దొంగిలించబడుతుందనే భయం తో కోట్లాది మంది ఓటర్లలో ఆందోళన సృష్టిస్తోందని ప్రధాన ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. సుప్రీంకోర్టు న్యాయం చేస్తుందని పూర్తి నమ్మకం ఉందని తెలిపింది. కాంగ్రెస్ తరపున సంతకం చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ మాట్లాడుతూ వివిధ ప్రతిపక్ష పార్టీలతో కలిసి బిహార్‌లో నిస్సందేహంగా రాజ్యాంగ విరుద్ధమైన ఎస్‌ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించామని చెప్పారు. ఇది బీహార్‌లోని గ్రామాలు, పట్టణాలలో విధ్వంసం సృష్టించిందని, కోట్లాది మంది ఓటర్లకు వారి ఓటు హక్కు దొంగిలించబడుతుందా అనే ఆందోళనను కలిగించిందన్నారు. ఇది పాలక ప్రభు త్వం సూచనల మే రకు ఇసిఐ చేపడుతున్న భారీ రిగ్గింగ్, దు శ్చర్య అని వేణుగోపాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయి తే సుప్రీంకోర్టు న్యాయం చేస్తుంద ని నమ్మకం తమకు ఉందన్నారు. నేడు కాంగ్రెస్, తొమ్మిది రాజకీయ పార్టీలతో కలిసి ఇసిఐ చేపడుతున్న లోపభూయిష్ట, విధ్వంసక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)ను సవాలు చేయడానికి కలిసి వచ్చిందని మరో కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. దుర్మార్గపు, దుష్ట పద్ధతి కారణంగా అధిక సంఖ్యలో ఓటర్ల ఓటు హక్కును తొలగించే ఈ ప్రక్రియను వ్యతిరేకించడానికి మొత్తం ప్రతిపక్షం కలిసి వస్తుందన్నారు. సుప్రీంకోర్టు ఈ విషయంపై విచారణ చేసేందుకు ఈనెల 10వ తేదీన షెడ్యూల్ చేసిందన్నారు. సత్యమేవ జయతే అని ఖేరా ఎక్స్‌లో తెలిపారు. 'ప్రజాస్వామ్యమా లేదా బిజెపి ఓటు అణచివేత యంత్రాంగమా? అని బిహార్ అడుగుతోందని, దేశమూ అడుగుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా అన్నారు. బిహార్ ఓటర్ల జాబితా జనవరి 2025లో ఖరారు చేయబడిందని, ఎన్నికల కమిషన్ కూడా దీనిని అంగీకరించిందని ఆయన అన్నారు. జూన్ వరకు సవరణలు జరిగాయని, ఆపై అకస్మాత్తుగా దానిని విస్మరించారని ఆయన పేర్కొన్నారు. అయితే ఎటువంటి రుజువు లేకుండా ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా 7 కోట్ల మంది ఓటర్లు ఇప్పుడు తమ భారతీయ పౌరసత్వాన్ని మళ్ళీ నిరూపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. 2003 తర్వాత జాబితాలో పేర్లు ఉన్న వారిని అనుమానంతో చూస్తున్నారన్నారు. గత 20 సంవత్సరాలుగా ఓటు వేస్తున్న పౌరులను ఇప్పుడు గుర్తింపు, నివాసం, పౌరసత్వ పత్రాలు అడుగడమేంటని నిలదీశారు. గుర్తుంచుకోండి, ప్రజాస్వామ్యం శకుని పాచికలకు కోల్పోదని కాంగ్రెస్ నాయకుడు తన పోస్ట్‌లో అన్నారు. ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను చేపట్టాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఈనెల 10న విచారించడానికి సుప్రీం కోర్టు సోమవారం అంగీకరించింది.

# ట్రంప్ కేటాయింపు వైఫల్యం వల్లే టెక్సాస్ విలయం!

**27 మంది క్యాంప్ బాలికలు మరణించారని ధృవీకరణ**
**89 మంది వరద మృతులు : 41 మంది గల్లంతు**
**లెక్కకు అందని గల్లంతైనవారి సంఖ్య**
**బాధితుల సహాయానికి ట్రంప్ ఉత్తర్వు**
**వాటికన్ సిటీలో ప్రత్యేక ప్రార్థనలు**



**ఆస్టిన్ :** టెక్సాస్ రాష్ట్రం కెర్ కౌంటీలో జరిగిన వరద మహా విలయంలో మృతులసంఖ్యను సోమవారంనాటికి 89గా నిర్ధారించారు. సమ్మర్ క్యాంప్‌కు వచ్చి వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలికలకోసం విపరీతంగా గాలించినతర్వాత 27 మంది బాలికలు, వారి సిబ్బంది మరణించారని అధికారికంగా ధృవీకరించారు. ఇప్పటివరకూ మొత్తం 89 మంది మరణించారనీ, మరో 41 మంది జాడ తెలియరాలేదనీ నిర్ధారించారు. జాడ తెలియకుండా పోయినవారిసంఖ్య లెక్కకు అందడం లేదు. గురువారంనాడు రాత్రి ప్రారంభమైన చరిత్రాత్మకమైన భారీ వర్షాలు, నది వరద మట్టం పెరుగుదల గురించి నిద్రలో ఉన్న ప్రజలకు హెచ్చరికలు చేసి అప్రమత్తం చేయడంలో వాతావరణశాఖ విఫలమైంది. శుక్రవారం ఉదయం 5.20 గంటల సమయానికి పరిస్థితి చేయి దాటిపోయింది. బుధవారం మధ్యాహ్నం నుండీ మౌఖికంగా హెచ్చరికలు ప్రారంభమైనప్పటికీ వాట్సాప్ ద్వారా ఇతర మార్గాలలో నది ఒడ్డున ఉనన వేసవిశిక్షణ శిబిరానికి ఎందుకు ఆదేశాలు వెళ్ళలేదన్నది సమాధానంలేని ప్రధాన సమస్యగా మిగిలింది. దీనికి కారణం వాతావరణశాఖకు తగిన కేటాయింపులు చేయకపోవడం, సిబ్బంది నియామకాల కొరత ప్రధానమైన సమస్య కావచ్చునన్న విషయం వెలుగులోకి రావడంతో అందరి దృష్టి ఇప్పుడు ట్రంప్ వైపు మళ్ళింది. వార్నింగ్ వ్యవ స్థ ఏర్పాటు చే యడం అత్యం త ఖరీదైన వ్యవహారం కావడం తో దానిని అందరూ విస్మరించారు. కానీ ట్రంప్‌తో పాటు వాణిజ్యమంత్రి హోవార్డ్ లుత్నిక్ కూడా ఈ ఆరోపణలను తిరస్కరించారు. కీలక నియామకాలు చేసే విషయంలో ఎలాంటి పొదుపు చర్యలూ పాటించలేదని, బడ్జెట్‌లో కోతలు పడలేదని వారు తమ వైఖరిని సమర్థించుకున్నారు. మరోవైపు ట్రంప్ వరద విలయంలో బాధితులకు న్యాయం చేసేందుకు, అక్కడి పరిస్థితులను సన్నిహితంగా పరిశీలించి తగిన సహాయం అందించేందుకు ఒక ఉత్తర్వులపై సంతకం చేశారు. వచ్చేశుక్రవారం తాను టెక్సాస్ వరద ప్రాంతంలో పర్యటిస్తానని ట్రంప్ చెప్పారు. ఇదిలా ఉండగా ఈ వరద విలయ ఘటనతో చలించిపోయిన పోప్ లియో–14 తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు రోమ్‌లోని వాటికన్ సిటీలో ప్రత్యేక ప్రార్థనల చేశారు. పొదుపు చర్యలు, బడ్జెట్‌లో కోతల ప్రభావం వాతావరణశాఖమీద పడిందని, ప్రజలకు ముందస్తు అలారమ్ ద్వారా హెచ్చరికలు చేసే వ్యవస్థ చాలా రోజులుగా పనిచేయకుండా పోయిందన్న వార్తలు ప్రముఖంగా తెరమీదకు రావడంతో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ట్రంప్ పాలనాయంత్రాంగం బడ్జెట్‌లో కోతల వల్ల నేషనల్ వెదర్ సర్వీసెస్‌లో సిబ్బంది నియామకాలపై తీవ్ర ప్రభావం చూపించింది. చాలా రోజులుగా నేషనల్ వెదర్ సర్వీసెస్ విభాగం సిబ్బంది కొరతతో సమస్యల్లో ఉంది. సిబ్బంది లేకపోవడంవల్ల వదరద ప్రమాద సమాచారాన్ని నిద్రలో ఉన్న ప్రజలకు సకాలంలో తెలియజేసే అవకాశం లేకపోయింది. ఇది ట్రంప్ 'మాగా' ప్లాన్ దురాశ వైఫల్యాన్ని బయటపెడుతోందని భావిస్తున్నారు. మరోవైపు టెక్సాస్‌లో వరద మహా విలయం కొనసాగుతుండగా, గల్లంతైన ప్రజలకోసం భారీ ఎత్తున వందలాదిమంది భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గ్వాడలుపే నది ఒడ్డున ఏటా నిర్వహించే ప్రఖ్యాత మైస్టిక్ సమ్మర్ క్యాంప్‌లో 750మందికిపైగా 14 ఏళ్ళలోపు బాలికలు పాల్గొంటున్నారు. ఆసమయంలో తెల్లవారుజామున గడచిన వందేళ్ళలో ఎన్నడూలేనంత భారీ వర్షాలవల్ల 45 నిమిషాల వ్యవధిలోనే నది నీటిమట్టం ఎనిమిది మీటర్ల ఎత్తుకు (26 అడుగులు ఎత్తుకు) పెరిగిపోయి వరద బీభత్సం మొదలైంది. మరణించినవారిలో ఈస్ట్‌ల్యాండ్‌కు చెందిన క్యాంప్ డైరెక్టర్ రిచర్డ్ డిక్‌సహా అనేకమంది యువ క్యాంపర్లు మరణించినవారిలో ఉన్నారు. ఐతే సెక్యూరిటీగార్డ్ ఒకరు కీలకమైన పాత్ర పోషించి అనేక మంది బాలికల ప్రాణాలు కాపాడారు. ఇప్పుడు ఆయనపై ప్రశంసలు కురుస్తున్నాయి. అదేవిధంగా వాలంటీరు మాజీ నావికాదళ అధికారి గ్రెగ్ ఫ్రోయిలిక్ కూడా 300 మందితో కూడిన సహాయబృందానికి నాయకత్వం వహించి ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కానీ ఈ సమ్మర్ క్యాంప్‌లో ఇంకా ఇతరులు ఎంతమంది పాల్గొన్నారు? ఎంతమంది జాడ తెలియకుండాపోయారు? అనే పూర్తి వివరాలు తెలియడంలేదు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పంజగుట్టలో గంజాయి

ప్రజాపక్షం/హైదరాబాద్ : పంజగుట్ట ఆటో స్టాండ్ వద్ద గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ టీం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 450 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.
నల్గొండ వాడపల్లికి చెందిన సయ్యద్ రంజాన్ అలీ హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. నర్సారావుపేటకు చెందిన దాదు అనే వ్యక్తి గంజాయిని తీసుకువచ్చి అలీకి ఇస్తాడు. అలీ పంజగుట్ట ప్రాంతంలో దీన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ టీం పోలీసులు సోమవారం అలీని చాకచక్యంగా పట్టుకున్నారు. పరారీలో ఉన్నదాదు కోసం గాలిస్తున్నారు. నిందితుడిని నాంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.



## ఐఎఎస్‌లకు కోర్టు ధిక్కరణ నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రంథాలయ శాఖలో స్వీపర్లకు పెంచిన వేతనాలు చెల్లించాలని గతంలో ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయలేదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో ముగ్గురు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. స్టేట్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణరావు పాటు ఇద్దరు ఐఏఎస్‌లకు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న వ్యక్తిగతంగా హాజరుకావాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణరావు (ఇప్పుడు సీఎస్) పబ్లిక్ లైబరీస్ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసాచారిలను ఆదేశించింది. జీవో నంబర్ 841, 33 ప్రకారం గ్రంథాయల గ్రేడ్–3 ఉద్యోగులతో సమానంగా పార్ట్‌టైం స్వీపర్లకు వేతనాలు అందించాలని 2024, డిసెంబర్ 19న ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని పేర్కొంటూ స్వీపర్లు హేమలత ఇతరులు పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ నగేష్ భీమపాక విచారించి ముగ్గురు ఐఏఎస్‌లు కోర్టుకు రావాలని నోటీసులు ఇచ్చారు.

## హెచరీ వల్ల ప్రజలకు మేలు ఏమిటి?

ప్రజాపక్షం/హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా దరూర్ మండలం అంతరం సర్వే నంబర్ 32, 82లో హెచరీ నిర్మాణానికి ఆరు ఎకరాలు కేటాయించాలన్న వినతిపై ప్రభుత్వం నుంచి స్పందన లేదంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ సివి.భాస్కర్‌రెడ్డి సోమవారం విచారించారు. హెచరీ పెట్టడం వల్ల ప్రజలకు ఏమి ఉపయోగమని, ఎందుకు భూమి కేటాయించాలని పిటిషనర్‌ను ప్రశ్నించారు. ఇప్పటి వరకు జరిగిన భూపంపిణీలే సజావుగా లేవని, అనర్హులకు ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తే ప్రభుత్వానికి పంపలేదని పిటిషనర్ చెప్పారు. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణను ఈనెల 22కు వాయిదా వేశారు.

## ప్రభుత్వ భూమిలో నిర్మాణాలపై సర్కార్‌కు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాజేంద్రనగర్ మండలం హైదర్‌గూడ ఉప్పర్‌పల్లిలోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే పిల్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని, వాటిపై ప్రభుత్వం రెండు వారాల్లో రిప్లై కౌంటర్ వేయాలని ఆదేశించింది. ఉప్పర్‌పల్లిలోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకోవడం లేదంటూ ఎర్రబోడ వీకర్ సెక్షన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. శ్రీధర్‌రెడ్డి పిల్ వేశారు. దీనిని యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారించింది.. రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ఆర్డీవో, తహసీల్దార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిల్‌లో అనధికార ప్రతివాదులకు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ సర్వే నంబర్ 27లోని 27.18 ఎకరాల భూమి సర్వే నెంబర్లను మార్చేసి భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు చేస్తున్నారంటూ నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేసిన పిల్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మురళీనాయక్ భూక్యా, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచికుళ్ల రాజేష్ రెడ్డి వేసిన పిటిషన్‌లోని ప్రైవేట్ ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. పిటిషనర్ చెబుతున్న భూమిలో జరిగే 'హైరైజ్' నిర్మాణాలపై వివరణ ఇవ్వాలంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ సర్వే నంబర్ 27లోని 27.18 ఎకరాల సర్కార్ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు పెద్దెత్తున టవర్లు నిర్మిస్తున్న వాటిపై చర్యలు తీసకోవాలని అధికారులకు గత నెల చివర్లో వినతిపత్రాలు ఇచ్చామని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. అధికారుల నుంచి చర్యలు లేవని, అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు దీంతో అనధికారిక ప్రతివాదులు సికిందర్ ఖాన్, సలాబత్ ఖాన్, పల్లవి, బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ, బండి బంధులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేస్తూ యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకాయారా ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## రేవంత్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్ : బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ సీఎం ఏ. రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై బీజేపీ చేసిన ఫిర్యాదు మేరకు కింది కోర్టులోని కేసు విచారణలో ఉంది. దీనిని కొట్టేయాలంటూ రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు సోమవారం తీర్పు రిజర్వు చేసింది. గత ఏడాది పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రిజర్వేషన్ల అంశంపై చేసిన ప్రసంగం బీజేపీ ప్రతిష్ట దెబ్బతినేలా ఉందంటూ ఆపార్టీ నేత వెంకటేశ్వర్లు కింది కోర్టులో ఫిర్యాదు చేశారు. ఇది నాంపల్లి కోర్టులో విచారణలో ఉంది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పెట్టిన ఈ కేసు కొట్టివేయాలని రేవంత్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మ ణ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును వాయిదా వేశారు



రాహుల్‌గాంధీపై అసభ్యకర పోస్టు చేసిన..

## బిజెపి నేతపై మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి ఫిర్యాదు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అసభ్యకర పోస్టు పెట్టిన బిజెపి నేత రతన్ రంజన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీత రావు సోమవారం బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బేగంబజార్ పోలీసులు బిజెపి నేత రతన్ రంజన్‌పై కేసు నమోదు చేశారు. మహిళలు వాడే శానిటరీ ప్యాడ్ మీద రాహుల్ గాంధీ చిత్రాన్ని మార్ఫింగ్ చేసి ట్విట్టర్లో రతన్ రంజన్ పోస్ట్ చేశారు. దీనిపై మహిళా కాంగ్రెస్ నేతలు బగ్గుమన్నారు. ఆయన చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఫిర్యాదు అనంతరం సునీతరావు మాట్లాడుతూ..ఈ పోస్టు చాలా అభ్యంతరకరమైన విషయమని అన్నారు. మహిళలు ఎవరు కూడా ఊరుకునే విషయం కాదన్నారు. మహిళల మీద ఇంతటి అసభ్యకరమైన పోస్ట్ పెడుతుంటే బిజెపి నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ఆమె ప్రశ్నించారు. అలాగే ప్రగల్బాలు పలికే బిజెపి మహిళా నాయకురాళ్లు ఈ విషయంపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు.ఈ పోస్టు చాలా దురదృష్టకరం మహిళల గౌరవానికి సంబంధించిన విషయం అని అన్నారు. మహిళలను ఇంత నీచంగా అవమానించే బిజెపి నాయకులను ప్రజలు గమనించాలి, తగిన గుణపాఠం చెప్పాలి, వాళ్లకు బుద్ధి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉందని సునీత రావు అన్నారు. ఇటువంటి పోస్ట్ చేసిన వారి మీద కఠినమైన శిక్ష విధించాలని తద్వారా ఇతరులకి ఇలాంటివి ఊహకి కూడా వస్తే భయపడే విధంగా చర్యలు ఉండాలని అన్నారు.

8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచే

# జిఒ 282ను ఉపసంహరించుకోవాలి

తెలంగాణ రాష్ట్ర కేంద్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్



ప్రజాపక్షం /హైదరాబాద్ : కార్మికులు తమ రక్తాన్ని చిందించి సాధించుకున్న 8గంటల పనివిధానాన్ని 10 గంటలకు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 282 జిఒను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర కేంద్ర కార్మికుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988లోని సెక్షన్ 16, 17లను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెం.282ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి ఎక్స్ రోడ్ వద్ద జిఒ నెం.282 కాపీని దగ్ధం చేశారు. అనంతరం కార్మికశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రెబ్బా రామారావు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె. సూర్యం, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి అనూరాధ, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకె.బోస్, ఎఐటియుసి రాష్ట్ర ఇన్‌చార్జి భరత్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తేదల్చుకున్న లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలుకు మార్గం సుగమం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జిఒను విడుదల చేసిందని విమర్శించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేయడంలేదని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలు అమలుకు పూనుకోవడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జిఒను వెంటనే ఉపసంహరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 9న జరగనున్న జాతీయ సమ్మె నేపథ్యంలో రాష్ట్ర కార్మికవర్గం అంతా ఐక్యంగా సమ్మెలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసన తెలపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, కూరపాటి రమేష్, పి. శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ, రమ, వి.ఎస్.రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. సునీత, పి. రాజారావు, దశరథ్, మహేందర్, రాష్ట్ర నాయకులు ఎస్‌ఎస్‌ఆర్‌ఎ. ప్రసాద్, టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎల్. పద్మ, ఎఐటియుసి సిటీ నాయకులు వెంకట్రావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు శివబాబు, టిఎన్‌టియుసి నాయకులు బాబాయ్, హెచ్‌ఎంఎస్ నగర ప్రధాన కార్యదర్శి అంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రెండు రోజుల పాటు.. భారీ నుంచి అతి భారీ వర్షాలు

ప్రకటించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రుతుపవన ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్, ఉత్తర చత్తీస్‌గఢ్, దక్షిణ జార్ఖండ మీదుగా సముద్ర మట్టం నుంచి 3.1 నుంచి 5.8కి.మీల ఎత్తులో ఈ ద్రోణి కొనసాగుతుందన్నారు. దీని ప్రభావం తెలంగాణపై ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేశామన్నారు. మిగితా అన్ని జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పారు. ఇక హైదరాబాద్‌లో సోమవారం తేలికపాటి జల్లులకు అవకాశం ఉందని, మంగళవారం, బుధవారం మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశామన్నారు. ఎల్లుండి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరి సిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

## చెంచులకు అదనంగా 27వేల ఇండ్లు మంజూరు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/అచ్చంపేట : రాష్ట్రంలోని చెంచులకు 27వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి జూపల్లికృష్ణారావు అమ్రాబాద్ మండలంలో సుడిగాలి పర్యటనచేశారు. వారు మొదట అమ్రాబాద్ పట్టణంలోని బిటిరోడ్డుకు శంకుస్థాపన చేయగా మన్ననూర్‌లోని ఐటిడిఎ గిరిజన వసతిగృహానికి ప్రహారీగోడకు శంకుస్థాపన చేశారు. అనంతరం మన్ననూర్‌లోని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి చెంచు కుటుంబాలకు ఇండ్ల పట్టాలు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడుతూ రాష్ట్రంలో 27వేల చెంచుకుటుంబాలకు ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఐటిడిఎ పరిధిలోని 21 నియోజకవర్గాలలో విడతలవారిగా 13266 చెంచుకుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గపరిధిలోని పలు గ్రామాలలో 536మంది చెంచుకుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తున్నామని గిరిజన ప్రాంతాలలో మరో 1500ల ఇండ్లు ఇస్తున్నామన్నారు. పది సంవత్సరాలలో 8లక్షలకోట్ల అప్పుచేసి గత ప్రభుత్వం తమపై భారంమోపాయన్నారు. అదేవిధంగా ఉచితబస్సు ప్రయాణం, రూ.500ల సబ్సిడి గ్యాస్, 200యూనిట్ల ఉచితవిద్యుత్, పేదలకు సన్నబియ్యం, రుణమాఫీ, రైతుభరోసా పలు పథకాలు అమలుచేస్తూనే ప్రత్యేక పథకాలపై దృష్టిసారించిందన్నారు. జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటికి 11626ఇండ్లు మంజూరు చేశామని ఇందులో 8090 ఇండ్లు చెంచులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈవిషయంపై మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ అచ్చంపేట, నాగర్‌కర్నూల్ పరిధిలో ఉన్న చెంచులకు అండగా ఉంటూ అన్నిరకాల సహయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తలెత్తేపథకాలను తమప్రభుత్వం చేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధిచెందేందుకే పలు పథకాలను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రుల తోపాటు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ , జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్‌రఘునాథ్, జిల్లా రెవెన్యూ అధికారులు, ఐటిడిపిఒ రోహిత్‌గోపిడి, అదనపు కలెక్టర్ అమరేందర్, దేవసహాయం, మున్సిపల్‌చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఐఎస్‌ఎస్ ప్రయోగ ఫలితాలను జాగ్రత్తగా భద్రపరచండి

శుక్లాతో సంభాషణలో ఇస్రో చైర్మన్ వెల్లడి

బెంగళూరు : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్‌ఎస్) తాను క్షేమంగా వెళ్ళేందుకు వీలుగా ఇస్రో బృందం ఎంతోకృషి చేసి తనకు భరోసా ఇచ్చిందని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం శుభాంశు శుక్లా అంతరిక్ష కేంద్రం నుండి ఇస్రో చైర్మన్ నారాయణన్‌తో సంభాషించారు. 14 రోజులపాటు ఐ ఎస్ ఎస్‌లో గడిపే శుక్లా 30కి పైగా ప్రయోగాలలోపాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నారాయణన్ ఆయనతో మాట్లాడుతూ, ఐ ఎస్ ఎస్‌లో చేసే ప్రతి ప్రయోగాన్నీ, వాటి ఫలితాలను, వ్యోమగామిగా అక్కడ చేసిన ప్రతి కార్యకలాపాన్నీ, ప్రతి సున్నితమైన చర్యనూ భూమికి తిరిగి వచ్చిన తర్వాత గ్రంథస్థం చేసి, వివిధ రూపాలలో భద్రపరచాల్సి ఉంటుందని శుక్లాకు జాగ్రత్తలు చెప్పారు. భారతదేశం భవిష్యత్‌లో మానవ సహిత గగనయాన్ అంతరిక్ష యాత్రలు చేసేటప్పుడు ఈ ప్రయోగాలు, వ్యోమగామిగా ఐఎస్‌ఎస్‌లో గడపిన అనుభవాలన్నీ ఎంతగానో ఇస్రోకు ఉపయోగపడతాయని శుక్లాకు ఆయన చెప్పారు. నారాయణన్ స్పేస్ డిపార్ట్‌మెంట్‌కు కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. భార రహిత స్థితిలో ఉన్నప్పుడు శుక్లాకు ఎదురైన అనుభవాలు, మనిషి భారత రహిత స్థితిలో ఉండగా ఎముకలకు వచ్చే సమస్యలపైన శుక్లా అధ్యయనం చేశారు.
అదేవిధంగా భారత్ నుండి కొన్ని ఆహార పంటల విత్తనాలను కూడా ఆయన తీసుకువెళ్ళి అక్కడ మొలకలు రప్పిస్తారు. ఆ మొలకలను తిరిగి భూమ్మీదకు తీసుకువచ్చి తిరిగి పెంచుతారు. వాటిల్లో వచ్చే మార్పులను శాస్త్రవేత్తలు గమనిస్తారు. ఐఎస్‌ఎస్ నుండి శుక్లా మాట్లాడినప్పుడు ఇస్రో చైర్మన్ నారాయణన్‌తోపాటు అనేకమంది సీనియర్ శాస్త్రవేత్తలు, అధికారులు కూడా పాల్గొన్నారు. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్,మానవసహిత అంతరిక్షయాత్ర కార్యక్రమం మేనేజ్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ ఎం.మోహన్, లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ డైరెక్టర్ ఇ.ఎస్.పద్మకుమార్, ఇస్రో అంతర్గత వ్యవస్థల యూనిట్ డైరెక్టర్ ఎం.గణేశ్ పిళ్ళై, ఇస్రో సైన్స్ సెక్రటరీ ఎన్.వేదాచలం శుక్లాతో సంభాషణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్లా ఐ ఎస్ ఎస్‌లో తాను చేసే కార్యకలాపాల తాజా సమాచారాన్ని వారితో పంచుకున్నారు. చేసిన ప్రయోగాల గురించి వివరించారు. ఆక్సియం–4 మిషన్‌లో భాగంగా డ్రాగన్ అంతరిక్షనౌకలో మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి శుక్లా జూన్ 26న ఐఎస్‌ఎస్‌కు వెళ్ళారు.



## దేవాదాయ ఉద్యోగుల సంఘం జెఏసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్

ప్రజాపక్షం/హైదరాబాద్: దేవాదాయ ఉద్యోగుల సంఘం జెఏసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మడిదల చంద్రశేఖర్‌ను నియమించినట్లు జెఏసి ఛైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఉద్యోగుల సంఘం జెఏసి సమావేశంలో ఏకగ్రీవంగా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంఘం ఛైర్మన్ వెల్దండి రామ్మోహన్ రావు, దేవాదాయ శాఖ (అర్చక) కన్వీనర్ రవీంద్రాచార్యులు, అధ్యక్షులు సి.హెచ్. బద్రీనాథ్,అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ,( వర్కింగ్ ప్రెసిడెంట్ అర్చక),ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాందూరి కృష్ణమాచారి, కోశాధికారి బుస్సా సురేష్, బిసి నాయకుడిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చంద్రశేఖర్ ని వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడం జరిగిందని నేతలు తెలిపారు.



## జిల్లా కలెక్టర్‌ను కలిసిన టిజిఓఎస్ ప్రతినిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిని కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారులు సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణా గెజిటేడ్ అధికారుల అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ కార్యాలయానికి వసతి కోసం భూమి కేటాయించాలని వినతిపత్రం జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అసిసియేషన్ ప్రతినిధులు అడిగిన విన్నపానికి సానుకూలంగా స్పందించాని తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షురాలు ఎంజుల రెడ్డి, మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఎం.వి. రమణ ఉన్నారు.



## పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత

కేశంపేట ఎంపిడివో కిష్టయ్య

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరు భాగస్వాములు కావాలని కేశంపేట ఎంపిడివో కిష్టయ్య సూచించారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో పసుల నరసింహా యాదవ్ వ్యవసాయ పోలంలో టేలంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపిడివో కిష్టయ్య మాట్లాడుతూ మానవాళి మనుగడకు వృక్షసంపద ఎంతో ముఖ్యమని, నాటిని మొక్కను రక్షించేందుకు ప్రజలందరు కృషి చేయాలని సూచించారు. పర్యావరణంలో చెట్లను ఇష్టారాజ్యంగా తొలగిస్తున్న నేపధ్యంలో వాతావరణం పూర్తిగా కాలుషితం అవుతుందని, దాంతో అనేక రకాల వ్యాధులు రావడంతోపాటు ఆసుపత్రుల పాలవుతున్నారని పేర్కొన్నారు. మాజీ వైస్ ఎంపిపి పసుల నరసింహా యాదవ్, నేతలు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, చోడం శ్రీనివాస్, రవి, కృష్ణయ్య, బాలరాజ్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

మరణించిన హోంగార్డు కుటుంబానికి..

## రూ.38లక్షలు అందించిన యాక్సిస్ బ్యాంక్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఖమ్మం జిల్లాలో హోంగార్డుగా పనిచేస్తున్న గంటా నరేష్ కుమార్ భార్యకు యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు సోమవారం డిజిపి కార్యాలయంలో హోంగార్డు అదనపు డిజి స్వాతిలక్రా సమక్షంలో రూ. 38 లక్షల చెక్కును అందజేశారు. హోంగార్డు నరేష్‌కుమార్ విధులు ముగించుకుని వెళ్తుండగా ఫిబ్రవరి 20న రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. నరేష్‌కుమార్‌కు యాక్సిస్ బ్యాంక్‌లో జీతం ఖాతా ఉంది. దీంతో పాటు అదే బ్యాంక్‌లో మరణ భీమా కవరేజ్ ఉంది. ఈ క్లెయిమ్ ప్రక్రియ తర్వాత, యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు నామినిగా ఉన్న అతని భార్యకు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా హోంగార్డు కుటుంబానికి ధైర్యం చెప్పారు. బీమా మొత్తాన్ని పొడిగించడంలో యాక్సిస్ బ్యాంక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో పోలీసు సిబ్బంది, హోమ్ గార్డుల కుటుంబాలకు అండగా నిలిచిన యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులకు ఆమె అభినందించారు.



## 'ప్రజావాణి' సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమిషనర్‌కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం కోసం తిరిగి అదే సమస్య విన్నవించకుండా సంబంధిత ఉన్నతాధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘు ప్రసాద్, వేణుగోపాల్, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, గీత రాధిక, మంగతాయారు, చీఫ్ సిటీప్లానర్ కె. శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, హౌసింగ్ సిఈ నిత్యానంద, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, గంగాధర్, బానోతు వెంకన్న, అసిస్టెంట్ అడ్వటైజ్‌మెంట్ అధికారి దుర్గన భాను, అసిస్టెంట్ ఎస్టేట్ మేనేజర్ ఉమ ప్రకాశ్, యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర రావు, విద్యుత్ ఈఈ మమత, యుసిడి పిడి దేవేందర్ రెడ్డి, చెరువుల ఈఈ నారాయణ, డిప్యూటీ సిఈ పనస రెడ్డి, హౌసింగ్ ఈఈలు పి.వి రమణ, రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.



## నిరుద్యోగుల ఉపాధి కోసమే డిఈఈటీ

**ప్రజాపక్షం/వనపర్తి :** తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన డిఈఈటీ డిజిటల్ ప్రోగ్రాం నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడనుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని యువత నైపుణ్యానికి తగిన ఉపాధి కల్పించేందుకు ఈ ప్రోగ్రాం డిజైన్ చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాంలో నిరుద్యోగ యువత వారి పేర్లు నమోదు చేసుకుంటే, వారిని నైపుణ్యానికి తగిన ఉద్యోగాన్ని కల్పిస్తారని ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు, పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులు, డిగ్రీ చదివిన విద్యార్థులు ఐటిఐ చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డిఈఈటీ సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచితకంటి వైద్యశిబిరం సేవలను సద్వినియోగం చేసుకొని కంటి సమస్యలను తొలగించుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సికిలేర్ ఫంక్షన్‌హాల్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని పరిశీలించారు. మూడో రోజు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చశ్రీరాములు, యూసఫ్‌బాబా, మల్లయ్య, గణేష్, శ్రీపతి, శేఖర్, రవి, యాదయ్య, శ్రీను, నాగ్గిశివ, కళ్యాణ్ పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటా




టియుడబ్ల్యూజె(ఐజేయు) నాయకులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** పాలమూరు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తాను సిద్ధంగా ఉన్నానని, జర్నలిస్టులందరికీ తాను అండగా ఉంటానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. టియుడబ్ల్యూజె (ఐజేయు) నాయకులు సోమవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యెన్నం ను కలిసి జర్నలిస్టుల ఇండ్ల సమస్యలు, తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల సమస్యల విషయంలో తనకు పూర్తి అవగాహన ఉందని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు తాను న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అతి త్వరలోనే యూనియన్ మహాసభ పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నట్లు నాయకులు ఎమ్మెల్యేకు తెలుపడంతో తాను కూడా వస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇద్దరు యువతులు అదృశ్యం

పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు





**ప్రజాపక్షం/జడ్చర్ల:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యం పట్టణంలో కలకలం రేపుతుంది. పోలీసులు కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బృందావన్ కాలానికి చెందిన బుర్ల రమేష్ కూతురు దీవెన, గౌరి శంకర్‌కు చెందిన అలివేల కూతురు వనజ లు కనబడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. జడ్చర్ల సిఐ అందించిన వివరాల ప్రకారం దీవెన అనే అమ్మాయి శంషాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తుందని ఉదయం తండ్రి జడ్చర్ల బస్టాండులో డ్రాప్ చేసి శంషాబాద్ ఆదివారం ఉదయం బస్సు ఎక్కించి వెళ్లానని పేర్కొన్నారు. గౌరి శంకర్ కాలానికి చెందిన అలివేలు ఆదివారం రాత్రికి ఇంటికి చేరుకోగా తన కూతురైన వనజ కనబడటం లేదని ఇరువురు వారి బంధుమితులకు సమాచారం అందించగా తమకు ఎలాంటి ఆచూకీ తెలియలేదని పేర్కొన్నట్లు తెలిపారు. ఒకే రోజున ఇద్దరు యువతకులు కనపడకపోవటంపై పట్టణంలో ప్రజలు భయాభ్రాంతులకు గురి అవుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జడ్చర్ల సిఐ కమలాకర్ పేర్కొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** నారాయణపేట జిల్లా కేంద్రంలో బహార్‌పేటలో ఉన్న శ్రీ తిరుమల గుట్ట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జాతర మహోత్సవాల సందర్భంగా సోమవారం భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు, దేవాలయ నిర్వాహకులు, భక్తులతో కలిసి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డికి శివాజీనగర్ నుండి బహార్‌పేట వరకు డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో దారి పొడవున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. శ్రీ తిరుమల గుట్ట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అసంపూర్తిగా అనేక పనులు ఉన్నాయని దేవాలయ నిర్వాహకులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఆయా పనులను పూర్తి చేసేందుకు త్వరలోనే ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని రాజ్‌కుమార్‌రెడ్డిని ఫౌండేషన్ సభ్యులను శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, మన్నె గోపాల్, హన్మంతు ముదిరాజ్, నర్సింహ నాయుడు, వై.సంతోష్, నర్సింహ, ఎం.సంతోష్, అశోక్, నందుకుమార్, నాగురావు, కృష్ణ యాదవ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అంటు వ్యాధులు సోకకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలి



పిఒడబ్ల్యూ, పివైఎల్ డిమాండ్

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండల ఎంపిడిఓకి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు ప్రగతిశీల మహిళా సంఘం పిఒడబ్ల్యూ, జిల్లా నాయకురాలు జి.సావిత్రమ్మ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో సీజనల్ వ్యాధులు సోకి అనేకమంది ఆసుపత్రుల పాలవుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ అతిసార భయంకర అంటూ వ్యాధులు చిన్నపిల్లలు వృద్ధులు, వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో సక్రమంగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు చేరి దోమలు, ఈగలు ఇతర విషసర్పాలు సైతం కాటు వేస్తున్నాయి. ఇదే అదనుగా రోగాల బారిన పడిన ప్రజలతో ప్రైవేటు ఆసుపత్రులు వేలాదిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రజల సౌకర్యార్థం ఊట్కూరు పులిమామిడి పిహెచ్‌సి, బిజ్వార్, చిన్నపొర్ల పెద్ద జట్రం పగిడిమారి మల్లెపల్లి, సబ్ సెంటర్లలో సబ్ సెంటర్లు ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైమరీ మెడికల్ హెల్త్ సెంటర్ సబ్ సెంటర్లు వైద్య సిబ్బందిని తగినన్ని అన్ని రోగాలకు మందులు వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగప్ప, అంజమ్మ, చెన్నప్పలు తదితరులు పాల్గొన్నారు.

# జిఒ 282పై భగ్గుమన్న కార్మిక సంఘాలు

ఎఐటియుసి, సిఐటియు, టియుసిఐ, టిఎస్టియుసి ఆధ్వర్యంలో జిఒ 282 ప్రతుల దహనం, నిరసన




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఎనిమిది గంటల పనికి బదులు 10 గంటలకు పని వేళల సమయం పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ దొడ్డి దారిన తెచ్చిన జీవో నెంబర్ 282 ను తక్షణమే రద్దు చేయాలని వామ పక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 282పై వామపక్ష కార్మిక సంఘాల భగ్గుమన్నాయి. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏఐటీయూసీ, సిఐటియు, టియుసిఐ, టిఎస్టియుసి సంఘాల ఆధ్వర్యంలో పనివేళల పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 282 ప్రతులను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్, కురుమూర్తి, టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.వెంకటేష్, టీఎస్టియుసి జిల్లా నాయకులు ధన్వాడ రాములు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వ త్రిక సమ్మె ఆందోళనలో కాంగ్రెస్ మద్దతు ఇస్తూనే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దొడ్డి దారిన కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా చీకటి ఒప్పందాలతో కార్మిక వర్గం శ్రమ దోపిడికి పని భారానికి గురిచేస్తూ ఎనిమిది గంటల పని వేళల నుండి 10 గంటల పని వేళల సమయానికి పెంచుతూ 282 జీవో నెంబర్‌ను లేబర్ శాఖతో విడుదల చేయించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం పునరాలోచించి 20082 జీవోలు లక్షనే రద్దు చేయాలని కార్మిక వర్గానికి కనీస వేతనం 26వేలకు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు, మద్దతిస్తు పాల్గొని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రసంగించారు. ఏఐటీయూసీ, సిఐటియు, టియుసిఐ, టీఎస్టియుసి నేతలు, శ్రేణులు, గోపాల్ నాయక్, మొగులన్న, చంద్రకాంత్, రాజు కుమార్, రంగయ్య కామేశ్వర్, బుచ్చన్న, దూవానంద్, బాలు, యాదయ్య, సాయి ప్రకాష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాము తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు తక్షణ న్యాయం అందించడమే లక్ష్యం

జిల్లా ఎస్‌పి డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రజల సమస్యలకు పట్టపరమైన పరిష్కారాలు కల్పించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం ఓ విశ్వసనీయ వేదికగా మారుతోంది. జిల్లా ఎస్పీ డి.జానకి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పౌరుల నుండి మొత్తం 12 ఫిర్యాదులు స్వీకరించబడినట్టు తెలియజేశారు. ప్రతి ఫిర్యాదును సవివరంగా పరిశీలించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి, బాధితుల సమస్యలను వేగంగా, చట్టపరంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ'' పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ప్రామాణికంగా స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితులకు తక్షణ న్యాయం అందించాలన్నదే మా ఉద్దేశం'', అని చెప్పారు. ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు చేయబడి, వాటి పరిష్కార స్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఫిర్యాదుదారులకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి గ్రీవెన్స్ డే వేదికగా నిలుస్తోందని, వీలైనంత త్వరగా పరిష్కారం చూపించేందుకు పోలీసు యంత్రాంగం కట్టుబడి పని చేస్తోందని తెలిపారు.

# పోలేపల్లి అక్రమాలపై ఎమ్మెల్యే సీరియస్




తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఫోన్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** పోలేపల్లి పంచాయతీలో జరిగిన రూ.1.73 కోట్ల నిధులు దుర్వినియోగంపై తక్షణం చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంలో డీపీఓ నిర్లక్ష్యం పట్ల ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. డీపీఓ నిర్లక్ష్యం కారణంగానే పోలేపల్లి అక్రమాలపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని అభిప్రాయపడ్డారు. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాల నిధుల దుర్వినియోగంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడం ఈ విషయం డిఎన్‌పిఓతో అధికారులు విచారణ జరిపించడంతో పోలేపల్లి పంచాయతీలో రూ.1.73 కోట్ల మేరకు నిధులు దుర్వినియోగం అయ్యాయని పోలేపల్లి సర్పంచ్ జనంపల్లి చేతన రెడ్డి, అప్పట్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ఈ అక్రమాలకు పాల్పడ్డారని డీఎన్‌పిఓ నివేదిక ఇవ్వడం అందరికీ తెలిసిందే. అయితే ఇది జరిగిన కొన్ని నెలలు కావస్తున్న డీపీఓ ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డీఎన్‌పిఓ విచారణలో అక్రమాలు జరిగాయంటూ స్పష్టమైన నివేదిక ఇచ్చినప్పటికీ ఈ అంశాన్ని మరోసారి విచారించాలంటూ డీఆర్‌డీఏ డిపి, ఆర్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జడ్చర్ల ఎంపిడిఓలతో త్రిమెన్ కమిటీని ఏర్పాటు చేయడం, ఆ కమిటీ తమ విచారణను పూర్తి చేసి 3 నెలలు కావొస్తున్న నివేదికను సమర్పించకపోవడం పట్ల అనిరుధ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే పోలేపల్లి గ్రామస్తులు సోమవారం నిరసన దీక్షలు ప్రారంభించి నిధుల దుర్వినియోగంపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయంగా స్పందించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో ఫోన్‌లో మాట్లాడి పోలేపల్లి అక్రమాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. డీపీఓ నిర్లక్ష్యం కారణంగానే అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం ఆలస్యం అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కమిటీ నివేదికను తెప్పించుకొని రూ.1.73 కోట్లు అక్రమాలకు పాల్పడిన వారి నుండి ఆ మొత్తాన్ని రికవరీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. ఈ విషయం గురించి వెంటనే చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ప్రజావాణికి 104 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లకు అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వివిధ అంశాలపై సూచనలు చేశారు. వర్షాకాలంలో మన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు నిర్ణయించిన లక్ష్యం మేరకు ఈనెల 10వ తేదీలోగా వంద శాతం గుంతలను తీసి సిద్ధంగా ఉంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించి నిర్దేశించిన యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అధికారులు ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమం సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం



మంత్రి వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

**ప్రజాపక్షం/మక్తల్:** మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పట్టణంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏ.రవికుమార్ తెలిపారు. మక్తల్ మున్సిపాలిటీకి 300 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో అన్ని వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ముగ్గులు పోసి ప్రారంభించినట్లు తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ గత పదేళ్లుగా తమకు ఎలాంటి ఇండ్లు మంజూరు కాలేదని గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని తిరిగి తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పశు సంవర్ధక పాడి పరిశ్రమ క్రీడా యువజన శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించిన మంత్రికి జీవితాంతం తాము రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డుల నేతలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, వల్లంపల్లి లక్ష్మణ్, శాలంబీన్ ఉమర్, ప్రవీణ్ కుమార్, వాకిటి శ్యామ్, వాకిటి హనుమంతు, ఫయాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కల్లూరి గోవర్ధన్ గుంతలి శివకుమార్, కొండయ్య, రమేష్, కట్ట వెంకటేశ్, బోయ వెంకటేశ్, వాకిటి కృష్ణ, వాకిటి భీమేష్, హౌసింగ్ డిఈ హరి కృష్ణ, ఏఈ వినయ్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, వార్డు ఆఫీసర్స్, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు మున్సిపల్ శాఖల అధికారులుపాల్గొన్నారు.



## పల్లెలను అభివృద్ధి చేసుకుందాం

సింగిల్ విండో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వనపర్తి :** రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో రూ. 22 లక్షలతో , రేవల్లి మండల కేంద్రంలో రూ. 38 లక్షలతో పిఏసిఎస్ నిధుల నుంచి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మన పల్లెలను మనమే అభివృద్ధి చేసుకుందామని ఈ క్రమంలోనే నాగపూర్ రేవల్లి మండల కేంద్రాల్లో నిర్మించిన దుకాణ సముదాయాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ లోడే రఘు, మండల తహసీల్దార్ లక్ష్మి దేవి, ఎంపీడీఓ నర్సింహ, ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సత్యశిలారెడ్డి, రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు, సురేష్ గౌడ్, నర్సింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్‌పై నుండి పడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు పట్టణానికి చెందిన అబ్దుల్ ఖాదర్ (31) ఏబిడి కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో అబ్దుల్ ఖాదర్, మెకానిక్ వెంకటేష్ ఇద్దరు మొహరం పండుగ కోసం చెలిమిల్ల గ్రామానికి వెల్లుతున్నానని చెప్పి మోటార్ సైకిల్ నంబర్ టీఎస్31డి0374పై వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు శ్రీరంగాపూర్ నుండి పెబ్బేరు గ్రామానికి వస్తుండగా కంచిరావుపల్లి గ్రామ మలుపు వద్ద వేగంగా రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడి తలకు, ముఖానికి దెబ్బలు తగిలి చనిపోయాడు. మృతుని భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ యుగంధర్ రెడ్డి తెలిపారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజా సమస్యల కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 30 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్‌లు మండలంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలని సూచించారు. మండలంలో రివ్యూ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సంబరాలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి/వీపనగండ్ల :** పద్మశ్రీ మందకృష్ణమాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాలు అలుపెరుగని పోరాటం చేసి సాధించిన ఎస్సి రిజర్వేషన్లఫలాలు మాదిగ, మాదిగ ఉపకులాలు వినియోగించుకొని విద్య, ఉద్యోగ, రాజకీయరంగాలలో అభివృద్ధి చెందాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాలేపుశ్రీహరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్లపోరాటంలో మాదిగబిడ్డల ప్రాణాలు, జీవితత్యాగాలు అన్నివర్గాల ప్రజలమద్దతు అన్నిరాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాల మద్దతుగాను యావత్ మాదిగ ఉపకులాలు పోరాటం చేశాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు కరిగళ్ల దశరథం మాదిగ, మంగి రాజేష్, పవన్, శ్రీకాంత్, వినోద్, బాలకృష్ణ, శివ, పవన్, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం వీపనగండ్ల మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్ల వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు, నాయకులు మొలకలపల్లి నాగరాజు, మీసాల రాజశేఖర్ , పాము నాగులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీ వడ్డెర కాలనికిచెందిన దేరంగుల సురేష్ ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, కల్వకుర్తి వ్యవసాయ కమిటి మార్కెట్ డైరెక్టర్ కేశమల్లకృష్ణ సోమవారం పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా సురేష్ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో వరికుప్పల గోవర్ధన్, రాజశేఖర్, ఆంజనేయులు, మల్లేష్, సుధాకర్, కృష్ణయ్య, మల్లేష్, అర్జున్, రాములు, కొప్పు బాలయ్య పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం



**ప్రజాపక్షం/నల్లగొండ :** పేదల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.క్యాంపు కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన రూ.23.38లక్షల చెక్ లను మండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అమలు అవుతున్నాయని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ పథకం చాలా ఉపయోగకరమైన పథకమన్నారు. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## యాదయ్య మృతి సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/మునుగోడు:** సిపిఐ నాయకులు యాదయ్య మృతి పార్టీ తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం,బొల్గూరి నరసింహ,తీర్యాని వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పలివెల గ్రామానికి చెందిన వంతంగి యాదయ్య అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం యాదయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, సురిగి చలపతి,మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,మాధగోని సాయిలు, మాధగోని సత్తమ్మ, ఎండి జానీ,అనగంటి నర్సింహ,గోస్కొండ కృష్ణయ్య, వరికుప్పల రాజు, మల్లేష్, మాధగోని మల్లయ్య ఉన్నారు.





## చోరీలకు పాల్పడిన ఇరువురి అరెస్ట్

నిందితుల నుండి గంజాయి స్వాధీనం

**ప్రజాపక్షం/చిట్యాల :** అక్రమంగా గంజాయిని విక్రయిస్తూ, తాళం వేసిన ఇండ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇరువురు యువకులను నల్లగొండ జిల్లా చిట్యాల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక సిఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దుండగుల శివకుమార్(23), తలారి మనీష్ కుమార్(22) హైదరాబాద్ లో నివాసం ఉంటున్నారు. వీరు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బును సంపాదించాలన్న నెపంతో గంజాయిని అక్రమంగా విక్రయిస్తూ, దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు. నార్కట్పల్లి మండలం చెరువుగట్టులోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వీరు తరచూగా వస్తూ పరిసర మండలాల గ్రామాలపై అవగాహన పెంచుకున్నారు. స్థానికంగా అద్దెకు ఉంటున్న మండలంలోని వట్టిమర్తిలోని కెనరా బ్యాంక్ మేనేజర్ గుంటూరి చైతన్య ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనిపై ఊరికి వెళ్ళగా దీనిని గమనించిన నిందితులు గత నెల 30న చోరీకి పాల్పడి ఒక లాప్ టాప్, 3 విలువైన చేతి గడియారాలు, సెల్ఫోన్‌ను తస్కరించారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు జంక్షన్ సమీపంలో వీరు గంజాయి అమ్ముదానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం అందటంతో ఎస్ఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది వీరిద్దరిని అరెస్ట్ చేశారు. నిందితుల నుండి 1250 గ్రాముల గంజాయి, తస్కరించిన వస్తువులను, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## సాగునీటితో జిల్లా సస్యశ్యామలం

ర్యాలంపాడు రిజర్వాయర్ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** నడిగడ్డ ప్రాంతంలో కృష్ణ తుంగభద్రా రెండు జీవనదులు ప్రవహిస్తున్న దృష్ట్యా సాగు భూములకు నీటి వనరులను కల్పించి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ సహకారంతో పనిచేస్తానని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ నుండి కాలువలకు నీటిని విడుదల చేశారు. నెట్టెంపాడు ప్రాజెక్టు క్రింద ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ నుండి కాలువలకు నీటిని విడుదల చేసుకోవడం ద్వారా సుమారు ఒక లక్ష ఇరవై వేల ఎకరాలకు నీరు అందనుందని, ముందస్తు వర్షాలు రావడంతో రైతులు పొలం పనులలో నిమగ్నమయ్యారని ఎమ్మెల్యే అన్నారు. దేశం అర్థికంగా ఎదగాలంటే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బండారి భాస్కర్, విజయ్‌కుమార్, సుదర్శన్ రెడ్డి, జంబు రామన్ గౌడ్, చిట్టెం పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులకు గురిచేస్తోందని జిల్లా అధికారిపై కలెక్టర్‌కు అంగన్‌వాడీ టీచర్ల ఫిర్యాదు



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి సునంద వేధింపులకు గురి చేస్తుందంటూ జిల్లా కలెక్టర్ సంతోష్ కు ఎమ్మెల్యే బండ్ల క్రిష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ఫిర్యాదు చేశారు. మొదట సమస్యను గద్వాల ఎమ్మెల్యే బండ్ల క్రిష్ణమోహన్‌రెడ్డికి క్యాంపు కార్యాలయంలో వివరించగా ఎమ్మెల్యే అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ పీడీ సునంద కింద పనిచేసే ఉద్యోగులను అనవసర విషయాలతో దుర్భాషలాడుతుందని, ఆమో బాధ భరించలేకపోతున్నామని వాపోయారు. అంగన్ వాడి కేంద్రంలో చెప్పులు వేసుకున్నందుకు మందలిస్తూ అందుకు చెప్పుల దండ వేసుకోవాలని దురుసుగా మాట్లాడుతుందన్నారు. పనిచేసేది మేమైతే మా కుటుంబాన్ని మొత్తం కలిపి ఆమె తిరుతుందని అంగన్వాడి టీచర్లు ఆరోపించారు. ప్రతిసారి ఆమె వ్యవహారశైలి ఇలాగే ఉందని ఆమె బాధ భరించలేకే నేడు జిల్లా కలెక్టర్ సంతోష్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. విధుల పరంగా మా తప్పిదాలు ఎత్తిచూపితే సరి చేసుకుంటామని అనవసరంగా నోరు పారేసుకుని ఇష్టానుసారంగా మాట్లాడుతుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

## సమాజంలో తల్లి ప్రేమను మించింది లేదు

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** సమాజంలో తల్లి ప్రేమను మించింది లేదని, అమ్మలాంటి మహిళలకు అండగా ఉంటానని మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మదర్ ఎడ్యుకేషన్ , రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితకుట్టు శిక్షణ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం రాజగోపాల్ రెడ్డీ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలో 67 శాతం మంది మహిళలు శిక్షణ పొందేలా తోడ్పాటును అందించిన సంధ్య రెడ్డి సేవలు మర్చిపోకూడదన్నారు. రూ.25 లక్షలతో విద్యలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదు బహుమతి ఇచ్చామని తెలిపారు. వలిగొండ రోడ్‌లో ఒక ఎకరం స్థలాన్ని ప్రభుత్వం తరపున కేటాయించి స్కిల్ డోవలప్మెంట్ కోసం అవసరమైతే రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసి భవనం కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, మునుగోడు నియోజకవర్గం సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి ఉప్పు భద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు పాల్గొన్నారు.



# 10 గంటల పని పెంపు సరికాదు

వెంటనే రద్దు చేయాలి
ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి
ఎండి ఇమ్రాన్ డిమాండ్

**ప్రజాపక్షం/వలిగొండ :** కార్మికుల శ్రమను దోచుకోవడానికి 8 గంటలు ఉన్న పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ తీసుకువచ్చిన జీవో నంబర్ 282ను వెంటనే రద్దు చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ తెలిపారు. సోమవారం వలిగొండ మండల కేంద్రంలో జరిగిన ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం సల్వాద్రి రవీందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, లేబర్ కోడ్ అమలులో భాగంగా జిఓ నెంబర్ 282 ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనివిధానం రద్దు చేసి 10 గంటల పని విధానం అమలు చేయాలని విడుదల చేసిన జిఒ నెంబర్ 282ను వెంటనే రద్దు చేయాలని అయన డిమాండ్ చేశారు. 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు పా ల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల బాధ్యులు పోలేపాక యా దయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఎఐటియుసి మండల బాధ్యులు సల్వాద్రి రవీందర్, ఆటో యూనియన్ అధ్యక్షులు కనకబోయిన ఆంజనేయులు, సిపిఐ నాయకులు బోడిగే సుదర్శన్, కూరెళ్ల దేవేందర్ పాల్గొన్నారు.



### కార్మికులకు పదిగంటల పని విధానం జిఒను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** కార్మికులకు పదిగంటల పని విధానం జీవోను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం బాలాజీనగర్ హౌజ్ గోదాం మేనేజర్‌కు 9న జరిగే సార్వత్రిక సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల తహరలోనే హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదబీమాను పది లక్షల వరకు ఏర్పాటు చేయాలని, వారి పిల్లల చదువులకు స్కాలర్‌షిఫ్ ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు నడుపుతున్నాయని వాటిని నియంత్రించాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని అన్నా రు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు భూక్య పాపా నాయక్, బి.సైదా, శ్రీనివాస్, రమేష్, సైదులు, వెంకన్న, రాజారం పాల్గొన్నారు.

### ఎస్‌కెఎం సంపూర్ణ మద్దతు : వెంకటయ్య

**ప్రజాపక్షం/కోదాడ:** దేశవ్యాప్తంగా మోదీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కెఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఎస్‌కెయం జిల్లా కన్వీనర్ దొడ్డా వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం లాల్ బంగ్లాలో జరిగిన సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాల నాయకులు ముల్కలపల్లి రాములు, పోటు లక్ష్మయ్య, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రెమిడాలరాజు, ఎం.ముత్యాలు, ఉదయగిరి, వీరబాబు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరు:** జూలై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అన్ని రంగాల కార్మికులకు ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ ముద్రించిన వాల్ పోస్టర్లను సోమవారం చండూరులో కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దోటి వెంకన్న మాట్లడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జూలై 9న సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై కార్మికులు కుక్కల నాగార్జున , కావలి శ్రీను, గంటకంపు ధర్మ , నీలకంఠం నాగరాజు , కావలి కుమార్ , కల్లెట్ల నర్సింహ్మ, బొడ్డు రమేష్ , కావలి గోపి, శంకర్ , కావలి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చింతపల్లి :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఈ నెల తొమ్మిదవ తేదీన తల పెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాగారు. సిపిఐ మండల నాయకులు వేముల బుచ్చయ్య, అయితపాక సైదులు, మిడిదొడ్డి, రామకృష్ణ, గనిపల్లి జితేందర్, పోలే చెన్నయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.







## సిఎం పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** నూతన రేషన్‌కార్డులు ప్రారంభించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 14న తిరుమలగిరికి వస్తున్న సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకి సంబంధించి అధికారులకు కేటాయించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షుణంగా పరిశీలించి వేగవంతంగా అర్జిదారులకు సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రజావాణిలో దరఖాస్తులలో భూ సమస్యలపై 47, ఎంపిడివో లకు 13, డిపివో10, ఇతర శాఖలకు సంబంధించి



25 మొత్తం 95 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, డిపివో యాదగిరి, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిఈవో అశోక్, సిపివో కిషన్, సంక్షేమ అధికారులు దయానందరాణి, శంకర్, శ్రీనివాస్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులు

చోద్యం చూస్తున్న అధికారులు
సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు యూరియా, ఎరువుల కొరత రాకుండా ముందస్తుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం హుజూర్ నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యాపారస్తులు ఇప్పటికే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారన్నారు. అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారన్నారు. వానా కాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక ముందు ఎలా ఉంటుందోనని భయంగా ఉందన్నారు. కోదాడ వంటి పట్టణాల్లో వ్యాపారస్తులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని యూరియాను విక్రయించబోమని తీర్మానాలు చేసుకొని పత్రికా ప్రకటనలు ఇవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణలోకి తీసుకొని రాబోయే రోజుల్లో రైతులకు యూరియా కొరత రాకుండా, అధిక ధరలకు విక్రయాలు జరపకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు,మహిళా సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి దేవరం మల్లీశ్వరీ,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు యల్లావుల రమేష్,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్,దొంతగాని సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఇసుకాసురుల ఆగడాలకు అడ్డుకట్ట ఎప్పుడో?

మీసేవలో బుక్ చేసుకున్నా అన్‌లోడ్ టైంలో వసూళ్లు...500 నుండి 1000 ఇస్తేనే అన్‌లోడ్
ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ట్రాక్టర్ల యాజమాన్యం...
అన్ని తెలిసి ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గంలో ఇసుకాసురులు ప్రజలను ముక్కపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. దేవరకొండ మండలంలోని ఆయా ఇసుక క్వారీల నుండి ఇసుక కోసం మీ సేవలో ఇసుక బుక్ చేసిన ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక క్వారీల నుండి ప్రజలు మీ సేవ ద్వారా ఇసుకను నిర్ణయించిన ధర మేరకు కిలో మీటర్ వ్యవధిలో ప్రజలు చెల్లిస్తున్నప్పటికి సంబంధిత ట్రాక్టర్ల యాజమాన్యం కుమ్మకై ప్రభుత్వం బుకింగ్‌పై వారికి డబ్బులు ఇస్తున్నప్పటికి నడిపినోడికి నడిపినంత అన్న చందంగా అధికారులతో నిబంధనలతో మాకేం పని మాపని మేము చేసుకుంటామని ట్రాక్టర్ల యాజమాన్యం ప్రజలు తమకు ఇసుక కోసం బుకింగ్ చేసిన వెంటనే ఓటిపి చెప్పమని సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్లు ఓటిపి అడిగి ఇసుకను తీసుకువచ్చాక 500 నుండి 1000 రూపాయలు ఇస్తేనే ఆన్‌లోడ్ చేస్తామని చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లో చలాన్ ద్వారా డబ్బులు కట్టామని మరళ డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే సంబంధిత ట్రాక్టర్ల యాజమాన్యం బుకింగ్ క్యాన్సల్ చేస్తామని, డబ్బులిస్తేనే ఆన్ లోడ్ చేస్తామని ప్రజలకు నొక్కిచెప్పడంతో గత్యంతరం లేక ఇసుక ఆన్‌లోడ్ సమయంలో ట్రాక్టర్ యాజమాన్యం అడినంత ఇవ్వాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారుల మాత్రం అన్ని తెలిసిన తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరు సమంజసం కాదని, తక్షణమే మైనింగ్ అధికారుల ఇసుకాసురుల అఘడాల నుండి ప్రజలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు. ఇక గ్రామాల్లో ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్కడక్కడ గుట్టుచప్పుడు కాకుండా ఒక ట్రిప్పు ఇసుకకు 6000ఇందిరమ్మ ఇండ్లకు సప్లై చేసి లబ్ధిదారులను దోచుకుంటున్నారన్నా రు.

**చర్యలు తీసుకోవాలి....సిపిఐ**

మీసేవ నుండి ఇసుక బుక్ చేసుకొని చలాన్ పొందిన ట్రాక్టర్ల యాజమాన్యం కుమ్మకై ఆన్ లోడ్ టైంలో ప్రజల నుండి డబ్బులు వసూలు చేయడాన్ని తక్షణమే అధికారులు స్పందించి అక్రమ వసూళ్లను అపాలని సిపిఐ దేవరకొండ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అధికారులను కోరారు.

**న్యాయం చేయాలి...**ప్రజల నుండి అక్రమంగా ఆన్‌లోడ్ టైంలో వసూలు చేస్తున్న అక్రమ వసూళ్లను ఆపేందుకు సంబంధిత మైనింగ్ అధికారులు ట్రాక్టర్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షులు బాబురాంనాయక్ అధికారులను కోరారు.

## ఫిర్యాదులను ప్రత్యక్షంగా పరిష్కరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తాను మార్క్ చేసిన ఫిర్యాదులను తిరిగి కింది స్థాయికి మార్క్ చేయకుండా ప్రత్యక్షంగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు.జిల్లా స్థాయిలో వచ్చిన ఫిర్యాదులు జిల్లా అధికారులతో పాటు, మండల స్థాయి అధికారులకు మార్క్ చేయడం జరుగుతున్నదని అయితే అలా వచ్చిన వాటిని అధికారులు వారి స్థాయిలోనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా తిరిగి కింది స్థాయికి పంపించవద్దని, ఒకవేళ సమస్యను పరిష్కరించడంలో ఏమైనా ఇబ్బంది ఉంటే పిర్యాదుదారుకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు.రేషన్ కార్డుల దరఖాస్తులను పౌరసరఫరాల అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని, రేషన్ కార్డుకు చేసుకున్న దరఖాస్తు తిరస్కరణకు గురైతే స్పష్టంగా తెలియజేయాలని అన్నారు.మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు వారి పరిధిలోని కేజీబీవీలను సందర్శించాలని, కేజీబీవీలలో తక్షణ పనుల నిమిత్తం 20వేలు రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అయితే సంబంధిత కేజీబీవిల ప్రత్యేక అధికారులు వారికి నచ్చిన పనులు కాకుండా, అవసరమైన వాటిని ప్రతిపాదించాలని సూచించారు. చాలా కేజీబీవీలలో కోతుల బెడద కారణంగా పెన్సింగ్ అవసరం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సిమెంట్ పెన్సింగ్‌కు ఎక్కువ ఖర్చు అయ్యే అవకాశం ఉన్నందున, ఇతర ఫన్సింగ్ ప్రతిపాదించాలని చెప్పారు.కాగా ఈ సోమవారం మొత్తం (70) ఫిర్యాదులు రాగా, రెవిన్యూ శాఖకు (47),జిల్లా అధికారులకు (23) వచ్చాయి. అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి ,గృహ నిర్మాణ పీడీ రాజకుమార్, ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి ,జిల్లా అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు.



## అలసత్వం వహించొద్దు : కలెక్టర్

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అలసత్వం వహించొద్దని, త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆయన సోమవారం మోటకొండూర్ మండలంలోని కదిరేనిగూడెంలో ఆకస్మికంగా తనిఖీ చేసి ఇండ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ ఇందిర, తహసీల్దార్ నాగదివ్య, హౌసింగ్ పిడి, ఎఇ, పంచాయతి కార్యదర్శి శ్రీకాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# క్రీడ

## ముంబైకి టాటా..

### దేశవాళీలో కొత్త జట్టుతో చేరిన షా..!




**భా**రత క్రికెటర్ పృథ్వీ షా ఈసారి దేశవాళీ క్రికెట్‌లో కొత్త జట్టుకు ఆడనున్నాడు. ఈమధ్యే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అందుకున్న షా ముంబైతో సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకున్న షా సోమవారం మహారాష్ట్ర టీమ్‌లో చేరాడు. షా రాకను స్వాగతించిన మహారాష్ట్ర క్రికెట్ సంఘం ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టింది. ఈ చిచ్చరపిడుగుకు 100 నంబర్ జెర్సీని కేటాయించింది ఎంసీఏ. ఫస్ట్ క్లాస్‌లో, ఐపిఎల్‌లో షా అనుభవం తమ జట్టుకు ఎంతో ఉపకరిస్తుందని ఎంసిఎ అధ్యక్షుడు రోహిత్ పవార్ వెల్లడించాడు. త్వరలో ఆరంభం కానున్న దులీప్ ట్రోఫీ, రంజీ ట్రోఫీలో మహారాష్ట్ర తరఫున షా బరిలోకి దిగనున్నాడు. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో చెలరేగి ఆడేందుకు సిద్ధమవుతున్నాడీ హిట్టర్.

దేశవాళీలో తన ఆటకు సానబెట్టుకోవడంలో ఎంతో సాయపడిన ముంబై జట్టుకు షా కృతజ్ఞతలు తెలిపాడు. 'గత ఏడాది కాలంగా ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా. ప్రస్తుతం నా కెరియర్ దృష్ట్యా మహారాష్ట్ర జట్టుతో చేరడం నిజంగా నాకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నా. క్రికెటర్‌గా నేను మరింత మెరుగవుతాననే నమ్మకం ఉంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో నాకు పలు అవకాశాలు కల్పించిన ముంబై క్రికెట్ సంఘానికి ధన్యవాదాలు' అని షా తెలిపాడు.

## ఐసిసి కొత్త బాస్

### సిఇఒగా సంజోగ్ గుప్తా నియామకం

**అం**తర్జాతీయ క్రికెట్ మండలి కొత్త సిఇఒగా మీడియా మొఘల్ సంజోగ్ గుప్తాను నియమించారు. చాలా సుదీర్ఘమైన రీతిలో రిక్రూట్మెంట్ ప్రక్రియ జరిగింది. మార్చిలో కొత్త సీఈవో రిక్రూట్మెంట్ ప్రాసెస్ మొదలైంది. జియోస్టార్‌లో స్పోర్ట్స్ అండ్ లైవ్ ఎక్స్‌పీరియన్సెస్ సిఇఒగా చేశారాయన. ఐసిసి సిఇఒగా తక్షణమే గుప్తా బాధ్యతలు స్వీకరించనున్నారు.




ప్రస్తుతం ఐసిసి చైర్మెన్‌గా జేషా కొనసాగుతున్న విషయం తెలిసిందే. సిఇఒ పోస్టు కోసం సుమారు 25 దేశాల నుంచి 2500 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దాంట్లో 12 మంది అభ్యర్థులను షార్ట్ లిస్టు చేశారు. క్రీడా పరిపాలనా సంఘాలు, సీనియర్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా ఐసిసి సిఇఒ పోస్టు కోసం పోటీపడ్డారు. అయితే నామినేషన్స్ కమిటీకి ప్రతిపాదిత పేర్లను ఫార్వర్డ్ చేశారు. ఆ కమిటీ గుప్తాను కొత్త సిఇఒగా ఎన్నుకున్నది. ఐసిసి కమిటీలో డిప్యూటీ చైర్మెన్ ఇమ్రాన్ ఖవాజా, ఇసిబి చైర్మెన్ రిచర్డ్ థాంప్సన్, ఎస్ఎల్‌సి ప్రెసిడెంట్ షమ్మి సిల్వా, బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఉన్నారు. కమిటీ ప్రతిపాదించిన పేరును చైర్మెన్ జేషా అప్రూవ్ చేశారు. ఆ తర్వాత ఐసిసి బోర్డుకు చేరవేశారు. సిఇఒగా నియమితుడైన తర్వాత సంజోగ్ గుప్తా ప్రకటన రిలీజ్ చేశారు. క్రికెట్ అభివృద్ధికి సహకరించనున్నట్లు చెప్పారు. ఐసిసి బోర్డు సభ్యులతో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టుగా గుప్తా తన కెరీర్‌ను మొదలుపెట్టాడు. 2010లో అతను స్టార్ ఇండియాలో చేరాడు. కాంటెంట్, ప్రోగ్రామింగ్, స్ట్రాటజీ అంశాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. డిస్నీ, స్టార్ ఇండియా స్పోర్ట్స్ చీఫ్‌గా ఉన్నారు. జియో స్టార్ స్పోర్ట్స్ సీఈవోగా నవంబర్ 2024లో నియమితుడయ్యారు.

## భారత స్క్వాడ్‌లో మను, స్వప్నిల్..

### మరో పతకంపై గురిపెట్టిన ఇషా సింగ్



**ఒ**లింపిక్ విజేత మను భాకర్ మరో టోర్నీలో మెరిసేందుకు సిద్ధమవుతోంది. పారిస్ విశ్వక్రీడల్లో రెండు కాంస్యాలతో చరిత్ర సృష్టించిన మను 16వ ఎడిషన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లోనూ పతకంతో మురిసిపోవాలనుకుంటోంది. కజకిస్థాన్ వేదికగా ఆగస్టులో జరుగబోయే ఈ మెగా ఈవెంట్లో రెండు విభాగాల్లో పోటీ పడనుందీ షూటర్. హైదరాబాద్ అమ్మాయి ఇషా సింగ్ 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో, పారిస్‌లో కాంస్యం గెలుపొందిన స్వప్నిల్ కుసాలే సత్తా చాటాలనుకుంటున్నారు. సోమవారం జాతీయ రైఫిల్ సంఘం ప్రకటించిన స్క్వాడ్‌లోని 35 మందిలో రెండు కేటగిరీల్లో బరిలోకి దిగనున్న ఏకైక షూటర్ మనునే కావడం విశేషం. జాతీయ రైఫిల్ సంఘం సోమవారం ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో 15 ఈవెంట్ల కోసం 35 మందిని ఎంపిక చేసింది. మూడు మిక్స్‌డ్ టీమ్ పోటీల్లోనూ భారత బృందం పాల్గొననుంది. మహిళల విభాగంలో మను కాకుండా ఒలింపియన్ అంజుమ్ మౌద్గిల్(50 మీటర్ల రైఫిల్ త్రీపొజిషన్), పురుషుల విభాగంలో వరల్డ్ ఛాంపియన్ రుద్రాంక్ష్ పాటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నారు. మిగతావాళ్లలో ఐశ్వర్య ప్రతాప్ సింగ్(0 మీటర్ల రైఫిల్ త్రీపొజిషన్), సౌరభ్ చౌదరీ(10 మీటర్ల ఎయిర్ పిస్టల్), కినన్ చెనాయ్ (మెన్స్ ట్రాప్)లు కూడా పతకంపై గెలిచే అవకాశాలున్నాయి. వీళ్లతో పాటు మెహులీ గోష్, కిరన్ జాదవ్ సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి తొలి పతకం అందించిన మను.. ఆ తర్వాత మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లోనూ కంచుమోత మోగించింది. ఒకే విశ్వక్రీడల్లో రెండు మెడల్స్ గెలిచిన షూటర్‌గా రికార్డు నెలకొల్పిన ఆమె ఈసారి ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో అదిరే ప్రదర్శన చేయాలనుకుంటోంది. కజకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో మను మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో.. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో పతకంపై గురి పెట్టింది.

# యువతరంగం

## ఫోకస్

### ఉపాధికి చక్కటి మార్గం ఆన్‌లైన్




**ఈ** రోజుల్లో యువతీయువకులు అత్యధిక శాతం మంది స్మార్ట్ ఫోన్లతోనే ఎక్కువ సమయం గడుపుతున్నారన్నది నిజం. వీరిలో నిరుదోగులు, స్వయం ఉపాధి కోరుకునేవారు అధికం. అలాంటి వారు ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా చక్కటి ఉపాధి పొందవచ్చు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రారంభ సమయంలోనే ఎవరికి మీ వస్తువులు లేదా సేవలపై సమాచారం వెళ్లాలన్నది గుర్తించండి. వాటిని కొనుగోలు చేసే వారు ఎవరో స్పష్టంగా తెలుసుకోండి. మీ ఉత్పత్తులకు ప్రత్యేకమైన బ్రాండ్ గుర్తింపు ఉండాలి. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. అదే విధంగా, వెబ్‌సైట్ లేదా బ్లాగ్‌ను ప్రారంభించండి. వ్యాపారం గురించి వివరాలు, కాంటాక్ట్ డిటెయిల్స్, ఉత్పత్తులు, సేవలు వివరాలు అందులో ఉంచండి. సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఇఒ)పై అవగాహన ఉండాలి. గూగుల్, యాహూ వంటి సర్చ్ ఇంజిన్స్‌లో ఎవరైనా వస్తువు వివరాల కోసం శోధిస్తుంటే, మీ ఉత్పత్తి ప్రముఖంగా కనిపించేలా చూడండి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేయవచ్చు. వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకోవచ్చు. విలువైన ఆర్టికల్స్, వీడియోలు, ఇమేజెస్ ద్వారా ప్రేక్షకులను ఆకర్షించండి. గూగుల్ యాడ్స్, ఫేస్‌బుక్ యాడ్స్ తదితర పెయిడెడ్ యాడ్స్ (పిపిసి) ద్వారా మీరు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరగలుగుతారు. కస్టమర్లకు రెగ్యులర్‌గా మెయిల్స్ పంపండి, ఆఫర్లు, న్యూస్‌షెటర్స్ ద్వారా వారికి సమాచారం తెలియచేయండి. గూగుల్ అనాలిటిక్స్ లాంటి టూల్స్ ద్వారా మీ మార్కెటింగ్ ఫలితాలను విశ్లేషించండి, మెరుగుపరచుకోండి. టార్గెట్ ఆడియన్స్‌కు అవసరమైన కంటెంట్‌ను మాత్రమే షేర్ చేయండి. ట్రెండింగ్ టాపిక్స్, వీడియోలు, రివ్యూలు వాడండి. రియల్ టైమ్‌గా ఫీడ్‌బ్యాక్ తీసుకోండి, మార్పులు చేయండి. ఇవి పాటిస్తే, తక్కువ ఖర్చుతో ఎక్కువ మందిని ఆన్‌లైన్‌లో చేరుకోవచ్చు. మీ లక్ష్య ప్రేక్షకులు ఎక్కువగా వెతుకుతున్న కీలకపదాలను గుర్తించి, వాటిని సహజంగా కంటెంట్‌లో వాడండి. శీర్షికలు, మెటా డిస్క్రిప్షన్, హెడ్డింగ్‌లు, బాడీ టెక్ట్ వంటి కీవర్డ్స్ సమతుల్యంగా ఉండేలా జాగ్రత్త పడండి. సబ్ ఫోల్డర్ స్ట్రాటజీని ఉపయోగించడం ద్వారా ప్రధాన డొమైన్‌కు అధికారం పెరుగుతుంది, కొత్త కంటెంట్ వేగంగా ఇండెక్స్ అవుతుంది. ఇది ఎస్ఇఒ పరంగా దీర్ఘకాలికంగా ఉత్తమ మార్గం. కాగా, వెబ్‌సైట్ మొబైల్‌లో సరిగ్గా కనిపించాలి, వేగంగా లోడ్ అవ్వాలి. అందు కోసం ఇమేజ్‌లు ఆప్టిమైజ్ చేయండి, అనవసరమైన ప్లగిన్లు తొలగించండి. సైట్ మ్యాప్, రోబోట్స్.టిఎక్స్‌టి, కానోనికల్ వంటి టాగ్స్ వాడడం ద్వారా సెర్చ్ ఇంజిన్లు సైట్‌ను సులభంగా క్రాల్ చేయగలుగుతాయి. సహజమైన, యూజర్‌ఫోకస్ కంటెంట్‌ను రూపొందించండి. కీవర్డ్ స్టఫింగ్ నివారించండి. విశ్వసనీయ వెబ్‌సైట్ల నుంచి బ్యాక్ లింక్స్ పొందడం ద్వారా మీ సైట్‌కు అధికారం, ర్యాంక్ పెరుగుతుంది. ఈ స్ట్రాటజీలను అనుసరిస్తే, గూగుల్‌లో మీ వెబ్‌సైట్ ర్యాంక్ మెరుగుపడుతుంది. బ్లాగ్ కంటెంట్ ద్వారా గూగుల్ ర్యాంక్ మెరుగుపరచడం ఎలాగో తెలుసుకోవడం మంచిది. యూజర్‌కు ఉపయోగపడే, విశ్వసనీయమైన, ప్రత్యేకమైన సమాచారం ఇవ్వండి. కంటెంట్ సులభంగా చదవదగినదిగా, విభాగాలుగా, హెడ్డింగ్‌లతో ఉండాలి. ఎక్కువగా పోటీ లేని, స్పష్టమైన, వివరమైన కీవరడ్స్‌తో కంటెంట్‌ను టార్గెట్ చేయండి. ఇవి త్వరగా ర్యాంక్ అవుతాయి. ముఖ్యమైన పదాలు టైటిల్, హెడ్డింగ్‌లు, మెటా డిస్క్రిప్షన్, బాడీలో సహజంగా వాడండి. సైట్ వేగంగా లోడ్ అవ్వాలి, మొబైల్ ఫ్రెండ్లీగా ఉండాలి, నావిగేషన్ సులభంగా ఉండాలి. ఈ జాగ్రత్తలు తీసుకోండి. సందర్భోచిత ఇమేజ్‌లు, వీడియోలు జోడించండి. వాటికి సరైన రీతిలో టెక్ట్స్ ఇవ్వండి. మీ సైట్‌లో ఇతర సంబంధిత పేజీలకు లింక్ చేయండి. నమ్మదగిన ఇతర వెబ్‌సైట్లకు కూడా లింక్ ఇవ్వండి. ఆకర్షణీయంగా, కీవరడ్స్‌తో కూడిన మెటా డిస్క్రిప్షన్ వాడండి. కంటెంట్‌ను రెగ్యులర్‌గా అప్డేట్ చేయండి. పాత కంటెంట్‌ను సమీక్షించి, అవసరమైన మార్పులు చేయండి. ఇలాంటి సూచనలు పాటించి, ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను పెంచుకోవచ్చు. నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవడం మరింత ఉత్తమ ఫలితాలనిస్తుంది.

## సామాజిక మాధ్యమాలకు బానిసలు?



**మ**త్తు పదార్థాలు వినియోగించడమేకాదు.. సామాజిక మాధ్యమాలకు బానిసలు కావడం కూడా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నది. నిజానికి, యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలు చిన్నపిల్లల నుంచి వయోవృద్ధుల వరకూ అందరినీ బానిసలుగా మార్చేస్తున్నది. అయితే, యువతే ఎక్కువగా వీటి బారిన పడుతున్నారు. స్మార్ట్ ఫోన్, ఐప్యాడ్, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోతూ మరో అనారోగ్య విపత్తుకు 'స్క్రీన్ అడిక్షన్'కు ఆజ్యం పోస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ నీలి తెరలపై దృష్టిని కేంద్రీకరించి రోజుకు 10 గంటల వరకు కూర్చుంటున్న యువత మన ముందే కనిపిస్తున్నారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో దూరకుండా గంటైనా గడవని దుస్థితిలో యువత ఉండడం విచారకరం. ఈ దురలవాటుతో పలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పాటు ఏకాగ్రత లోపించడం, ఒంటరితనపు భావనలు, మానసిక స్థిరత్వం తగ్గడం, ఆందోళనలు, ఒత్తిడులు పెరగడంతో చదువులు కుంటుపడుతున్నాయి. పెరుగుతున్న ఈ జాఢ్యాన్ని నిలువరించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉంది.

## పెరుగుతున్న ఆత్మహత్యలు..



**మ**న దేశంలో 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు గల యువతలో కనీసం 50 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యల విషవలయంలో చిక్కారని, అంతర్జాల వేదికలు కూడా మానసిక సమస్యలకు ఆజ్యం పోస్తున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కరోనా తర్వాత కాలంలో యువత మానసిక సమస్యలు పెరిగినట్లు నిపుణులు అంటున్నారు. దేశంలో జరుగుతున్న ఆత్మహత్యల్లో 41 శాతం ఆత్మహత్యలు 30 ఏండ్ల లోపువారే చేసుకుంటున్నారని వివిధ మాధ్యమాల్లో లభిస్తున్న సమాచారం. భారతీయ యువతుల్లో అధిక మరణాలకు కారణం ఆత్మహత్యలే అని తెలుస్తున్నది. ఆత్మహత్యలు దేశంలో అతి ప్రమాదకర ప్రజారోగ్య సమస్యగా పెరుగుతున్నది. సగటున ప్రతి రోజు దేశవ్యాప్తంగా 35 మంది విద్యార్థినివిద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. 2019 నుండి 2022 వరకు ఆత్మహత్యల రేటు 9.9 శాతం నుంచి 12.4 శాతానికి పెరగడం గమనించారు. నేటి పోటీ ప్రపంచంలో కోటా కోచింగ్ కారాగారాల్లో పలువురు యువత ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తున్నాం. వీటి నివారణకు ప్రభుత్వాలు, అధికారులు, సామాజిక కార్యకర్తలు కంకణం కట్టుకోవాలి. ఆత్మహత్యలను నివారించాలి.

# కమ్యూనిజానికి మరణంలేదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/కొణిజర్ల :** నదులకు ఒక దరిదాపు ఉంటుంది కాని సముద్రం కనుచూపుమేరకు కనిపిస్తుందని కమ్యూనిస్టుపార్టీ కూడా సముద్రంలాంటిదని, సముద్రానికి అంతంలేదు.. కమ్యూనిజానికి మరణంలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్లలో సిపిఐ 18వ మండల మహాసభ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, స్వర్ణ రమేష్, కంపసాటి వెంకన్నల అధ్యక్షతన యాసా లక్ష్మీ నరసింహారావు ప్రాంగణంలో సోమవారం ఘనంగా జరిగింది. పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు వింజం గోపాలకృష్ణయ్య ఆవిష్కరించారు. అమరవీరులు స్థూపం వద్ద నివాళులుర్పించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై సాంబశివరావు ప్రసంగించారు. కొణిజర్ల మండలంలో పార్టీకి పూర్వవైభాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. త్యాగవీరులు నిర్మించిన పార్టీని కాపాడుకోవల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. బిజెపికి సిద్ధాంతంలేదని, మతాన్ని అడ్డంపెట్టుకొని రాజకీయం చేస్తోందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశసంపదను ఆదానీ, అంబానీకి దోచిపెడుతున్నాడని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మొదట మాట్లాడిందే మనమేనని స్పష్టం చేశారు. అడవుల్లో ఉన్నవారిని చంపుతున్నారన్నారు. ఎర్రజెండాలన్ని ఒక్కటైతే మరింత ఎరుపెక్కి ఎర్రకోటవరకు వెళ్తుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలో ఉండాల్సిన వాళ్లు రోడ్లమీద, జైళ్లలో ఉండాల్సిన వాళ్లు పార్లమెంట్, అసెంబ్లీలో ఉంటున్నారన్నారు. కమ్యూనిస్టుపార్టీ ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇండ్లు సిపిఐ కార్యకర్తలకు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని , బిఆర్ఎస్ చేసిన పనులే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే శంకరగిరి మాన్యాలు పట్టాల్సి వస్తోందని కూనంనేని హెచ్చరించారు. సభలో జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతురావు మాట్లాడుతు కమ్యూనిస్టుపార్టీకి ఎప్పటికి ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నారు. కూనంనేని ఎమ్మెల్యేగా గెలవడంతో ఎంతోమంది తమ సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో మాట్లాడాలని వస్తున్నారని, దీనినిబట్టి కమ్యూనిస్టులు మాత్రమే అసెంబ్లీలో ప్రజాసమస్యల గురించి గళమెత్తుతారని ప్రజలు నమ్ముతున్నారని స్పష్టంచేశారు. నరేంద్రమోదీ నల్లచట్టాలు రద్దు చేయడం కోసం 750 మంది రైతులు ప్రాణత్యాగం చేశారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చి ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఈనెల 19,20 తేదీల్లో మధిర పట్టణంలో పార్టీ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. మహాసభలో సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు, రాష్ట్రసమితి నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి,



రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నాయకురాలు తాటి నిర్మల, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్ర బాబు, జిల్లా నాయకులు పివిరావు, వేములకొండ రమేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి

# నిరంతర పోరాటాలు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు
### సిపిఐలో పలువురు చేరిక

**ప్రజాపక్షం/మర్రిగూడ :** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు సోమవారం మర్రిగూడం మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి త్వరితరగతిన పనులు పూర్తిచేసి సాగు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మునుగోడు ప్రాంతంలో కాలుష్య ఫార్మా కంపెనీల రద్దుకు ప్రజా ఆందోళనకు సన్నద్ధమైతున్నట్లు తెలిపారు. దివిస్ విషకోరాల నుంచి ఈప్రాంత ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 15న దేవరకొండ పట్టణంలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎరుకల నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిక్షంరెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య, జక్కుల అంజయ్య, అయిగొని వెంకన్న, వేముల సత్తయ్య, ఎరుకల యాదయ్య,రాధమ్మ, ఎండి నజీర్ పాల్గొన్నారు.

**సిపిఐలో చేరికలు...** ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో రామ్‌రెడ్డిపల్లి గ్రామం నుంచి వివిధ పార్టీల చెందిన జాల చంద్రయ్య, యాదయ్య, అయితగోని యాదయ్య, ఎడ్ల పెద్దులు, శివన్నగూడ నుండి దాసరి జంగయ్య, గుండ్లపల్లి ముత్యాలు, గుండెబోయిన లక్ష్మమ్మ, భీమనపల్లి కళమ్మలతో పాటు పలువురు సిపిఐలో చేరారు. వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి నెల్లికంటి సత్యం ఆహ్వానించారు.




# సార్వత్రిక సమ్మె విజయవంతానికి కార్మిక సంఘాల సమాయత్తం





**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రధాని మోదీ పెట్టుబడిదారులకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ, కార్మికులను మోసం చేస్తూ వారికి నష్టం చేసే చట్టాలను తీసుకొని వస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. జూలై 9 సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం హనుమకొండలోని వేయి స్తంభాల గుడి నుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 9న జరిగే సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, కార్యదర్శి జక్కు రాజుగౌడ్, ఎల్పుల ధర్మరాజు, వామపక్ష నాయకులు జి.ప్రభాకర్ రెడ్డి, రాగుల రమేష్, కూర వెంకట్, గంగుల దయాకర్, టి.ఉప్పలయ్య, బోట్ల చక్రపాణి, ఎల్పుల ధర్మరాజు, ఆర్.పూర్ణచందర్, ఎండి మైముదా, వి వీరన్న, గొడుగు వెంకట్ పాల్గొన్నారు.

**మంచిర్యాల :** జిఓ నెంబర్ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాలలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు మాట్లాడుతూ జూలై 9 సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి అమలులోకి తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకించారు. దాని ఫలితంగా తెలంగాణలో 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 10 గంటల పని విధానానికి అనుమతినిచ్చే జిఒ 282ను రాష్ట్రప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమన్నారు. కేంద్రం కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందని, మోదీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్మికులు పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సంక రవి, దుంపల రంజిత్, లాల్ కుమార్, టి.శ్రీనివాస్, దేవరాజ్ పాల్గొన్నారు.

**జనగామ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా సమితి సమావేశం మోటే శ్రీశైలం అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. 43 అంశాలను నాలుగు కోడ్‌లుగా మార్చారని, దీని వలన కార్మికులకు తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. పని దినాలు పెంచడంతో పాటు యాజమాన్యాలకు ఊడిగం చేసే విధంగా కార్మిక చట్టాలు ఉన్నాయన్నారు. కేంద్రం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రజలకు వివరించడంతో పాటు వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిక రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చామకూర యాకూబ్, గూడెల్లి రాజు, ముల్కల లక్ష్మయ్య, మర్రిక్కుల సాయిలు, దయ నాగేష్, తోట సుశీల, లింగాల రాములు, మచ్చ మల్లయ్య, బుడిగే వీరస్వామి, గొల్కొండ నాగరాజు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని జెఎసి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిడికె 11వ ఇంక్లైన్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సింగరేణి జెఎసి నాయకులు సీతారామయ్య, సదానందం, మెండే శ్రీనివాస్, వడ్డేపల్లి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మిక హక్కులన్నీ కాలరాయపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జూలై 9న జరిగే సమ్మెలో పాల్గొని కార్మికుల సత్తా ను చాటి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. జెఎసి నాయకులు సిద్దమల్ల రాజు మద్దీ ఎల్లాగౌడ్, అరెల్లి పోషం, ఎం.ఎ.గౌస్, నాయిని శంకర్, యాస శ్రీనివాస్, నరేష్, సంపత్, జాన్ కెనడి, సతీష్, రాజమౌళి, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.








# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## తూంకుంట కమిషనర్ జ్యోతికి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ కార్యాలయానికి కమిషనర్‌గా విచ్చేసిన ఎంఎన్ ఆర్ జ్యోతిని జిల్లా ఆర్‌టిఎ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకేతో ఘనంగా సన్మానించారు.

ఇటీవల బదీలిపై వచ్చిన కమిషనర్ జ్యోతిని కలిసి జైపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించే విదంగా కృషి చేయాలని కమిసనర్‌ను జైపాల్‌రెడ్డి కోరారు.





## ప్రభుత్వభూమిని కాపాడండి

### మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్

ప్రజాపక్షం/దుండిగల్: దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని దుండిగల్ తండా సర్వే నెంబర్ 684లో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు పట్టపగలు కబ్జాకు యత్నించి నిర్మాణాలు చేపడుతున్నారని దుండిగల్ తహసీల్దార్ మతిన్ సోమవారం ఫిర్యాదు చేశారు. గత 5 సంవత్సరాల క్రితం 1000 గజాలు తాండ ప్రజల అవసరం కోసం మల్టి పర్పస్ కమ్యూనిటీ ఫంక్షన్స్ హాల్ నిర్మాణం కోసం దరఖాస్తు పెట్టుకోవడం జరిగిందని, ప్రభుత్వ భూమి ఆక్రమించి కబ్జాదారులు పట్ట పగలు తప్పుడు పత్రాలు సృష్టించి నిర్మాణాలు చేసే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దుండిగల్ జిన్నారం సరిహద్దులు తెలేవరకు అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని, 684 సర్వే నెంబర్ లోని 425.24 ఎకరాలు గుర్తించి సరిహద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవీందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పలు సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అలాగే డివిజన్‌లోని బిజెపి సంస్థాగత విషయాలపై బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు పులిగోళ్ళ శ్రీనివాస్ యాదవ్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశం నందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. డివిజన్ లోని కాలనీ అధ్యక్షులు బస్తీ కమిటీ అధ్యక్షులు రోడ్లు డ్రైనేజీల వ్యవస్థ సరిగ్గ లేదని, నూతన కమిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, కొత్త బోర్వెల్ వేయించి నీటి సమస్య తీర్చాలని, స్మశాన వాటికల అభివృద్ధి చేయాలని ఇలా పలు సమస్యలను వడ్డేపల్లి రాజేశ్వరరావుకి తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈ రాష్ట్ర ప్రభుత్వం యొక్క వైఫల్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ గారీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలియజేశారు. తదనంతరం డివిజన్ లోని నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి సమిష్టిగా పనిచేసి పార్టీ యొక్క పటిష్టతకు కృషి చేయాలని రాష్ట్ర పార్టీ ఇచ్చేటువంటి కార్యక్రమాలు అన్నిటిని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు విజయ్, డివిజన్ నాయకులు వెంకటరామిరెడ్డి, మోహన్ గౌడ్,శర్మ, స్థానిక ప్రజలు,బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఏదులాబాద్ పాఠశాలలో కుక్ పోస్టు భర్తీ

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని ఏదులాబాద్ ప్రాంతంలో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వంట చేసేందుకు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కుక్ ఉద్యోగ ఖాళీని భర్తీ చేస్తున్నామని జిల్లా విద్యా శాఖాధికారి విజయకుమారి తెలిపారు. పదవ తరగతి పూర్తిచేసి ఎక్కువమందికి వంటలు చేయగలిగే సామర్థ్యం ఉన్న అభ్యర్థులు ఈ నెల 11 తేదీ సాయంత్రం 4.30 గంటలలోగా జిల్లా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని, నియమాక సమయంలో వారు వంటలు చేయటాన్ని పరిశీలిస్తామని తెలిపారు.




## చర్లపల్లి పారిశ్రామికాభివృద్ధికి కృషి

ప్రజాపక్షం/చర్లపల్లి: అందరి సహకారంతో పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తామని ఐలా చెర్మన్ జి. గోవింద్‌రెడ్డి, సిఐఎ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్2లోని సిఐఎ భవనంలో నూతనంగా ఎన్నికైన ఐలా, సిఐఎ కమిటీ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు రద్దీ పెరిగిన దృష్ట్యా రోడ్ల అభివృద్ధి, పారిశ్రామికవాడలో 10 కోట్లతో అంతర్గత రోడ్లు, వీధిదీపాల నిర్వహణ, డ్రైనేజీ పనులు చేపట్టనున్నామని, 5 సెక్టార్లలో సీనరేజ్ ప్లాంట్లు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, జైలు స్థలం తీసుకుని వర్కర్లకు ఉమెన్స్, మెన్స్‌కు 2 హాస్టళ్లు, ఈస్టర్న్ హైదరాబాద్ వైపు కన్వెన్షన్ హాలు నిర్మాణం, సిసి కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.సిఐఎ అధ్యక్షులు డిఎస్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు, పారిశ్రామికవేత్తలకు మెడికల్ క్యాంపులు, ఆరోగ్యం కోసం నెలకు ఒక్కసారి యోగా తరగతులు, ఇన్సూరెన్స్, నిరుద్యోగ యువతకు శిక్షణ కల్పించి ఉపాధి కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలా, సిఐఎ సభ్యులు తాటి శ్రీనివాస్, రాఘవయ్య, సోమేశ్, మల్లిఖార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి : బాధితుల రాస్తారోకో

ప్రజాపక్షం/చర్లపల్లి: రాంపల్లి, యంనంపేట్ ప్రధాన రహదారి విస్తరణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన నడుస్తుండడంతో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నారపల్లికి చెందిన షేక్ బాసిత్, స్నేహితుడు స్వామిలు నారపల్లి నుండి నాగారం వెళ్తుండగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండడంతో అదుపు తప్పి రోడ్డుపై పడి పోయారు. వెనకాల నుండి వచ్చిన లారీ బాసిత్‌పై నుం డి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందా డు. అతని స్నేహితుడు గాయాలుపాలై ఆసుపత్రిలో చేరారు. దీంతో స్థానికు లు, మృతుని బంధువులు రాస్తారోకో చేశారు. ఇంతకుముందు కూడా అనేక ప్రమాదాలు జరిగాయని, రోడ్డును తవ్వి కంకరవేసి అలాగే వదిలివేశారని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, పనులను త్వరితగతిన పూర్తిచేసి మా ప్రాణాలను కాపాడాలని స్థానికులు, బాధితులు రాస్తారోకో చేశారు.



ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఉన్నత ఆశయాలతో

# 100ఏళ్లుగా సిపిఐ రాజీలేని పోరాటాలు

ఈటి నరసింహ్మా




ప్రజా పక్షం /హైదరాబాద్ : సామ్యవాద భావజాలానికి, లౌకిక ప్రజ స్వామ్య విలువలకు అంకితమై, దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఉన్నత ఆశయాలతో, 100 ఏళ్లుగా రాజీలేని పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ మాత్రమేనని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ అన్నారు. హైదరాబాద్, అంబర్‌పేట్, దుర్గ నగర్, కృష్ణ రెడ్డి ఫంక్షన్ హాళ్లలో సోమవారం సిపిఐ అంబర్ పేట్ నియోజకవర్గం 4వ మహాసభ కార్యదర్శి బి.వెంకటేశం అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిలుగా ఈ.టి. నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ సిపిఐని బలోపేతం చేయడానికి, పార్టీ సిద్ధాంతాన్ని, లక్ష్యాల ను ప్రజలకు మరింత చేరువ చేయాలనీ, పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న వినాశకరమైన విధానాల కారణంగా రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువు లు, పెట్రోల్, గ్యాస్ ధరలతో పేద మధ్య తరగ తి ప్రజలు విలవిలలాడుతున్నరన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ అన్యాయమైన విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరముందన్నారు.

ప్రజల మధ్య తగువులు పెట్టి హింసను ప్రేరేపించడం వంటి చర్యలకు పాల్పడుతున్న మోదీ సర్కార్‌ను గద్దెదించడం అనివార్యమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో కార్మికుల 8 గంటల పని విధానాన్ని మర్చి 10 గంటల పని చేయాలనీ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓ ను తక్షణమే రద్దు చేయాలనీ ఆమె డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ శ్రీకాంత్, ఎండి.ఉమర్ ఖాన్, జిల్లా సమితి సభ్యులు చెట్టు కింద శ్రీనివాస్ నాయకులు జి శ్రీనివాస్ జె లింగ స్వామి ఎస్ రాము ఎస్ నాగరాజు కె. రవి కె.గణేష్, ఎ.బిక్షపతి, వెంకటేష్ కుమార్ తదితదిలో పాల్గొన్నారు. మహాసభలు అంబర్‌పేట్ నియోజకవర్గం కార్యదర్శిగా బి.వెంకటేశం, సహాయ కార్యదర్శిగా కాశయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వనమహోత్సవంలో ముఖ్యమంత్రికి ఘనసన్మానం

ప్రజాపక్షం/శంషాబాద్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన వనమహోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రిని శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో జలపల్లి నరేందర్,ఎస్. సి విభాగ ఉపాధ్యక్షుడు డప్పు నవీన్, సంజయ్ యాదవ్,ధనుంజయ్, కలేజ్ బాయ్,ఇస్మాయిల్ బాయ్,కాదు బాయ్, గణేష్ నాయక్, రమేష్, అశోక్, అంజన్న, రాముల నాయక్, రవి నాయక్, రఘు, కృష్ణ, నరసింహ ముదిరాజ్, దేవేందర్ కుమార్, సంజు, జగదీష్, శ్రీనాథ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా సన్మానించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ..పచ్చదనం పెంపుదల, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని" ప్రజలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో శంషాబాద్ మండలానికి చెందిన సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో మండలంలో ఉత్సాహ వాతావరణం నెలకొంది.

## పార్కులు.. రహదారుల కబ్జాలు

### హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇంటి ఎదురుగా రోడ్డు ఉంటే కలిపేయడం, పార్కు ఉంటే ఆక్రమించేయడం కాలువపైనే నిర్మాణం చేసేయడం, కబ్జాలకు ఏదీ అడ్డు రావడంలేదని పలు ఫిర్యాదులను బట్టి అర్థమౌతోంది. ఎదురుగా ఉన్న ప్లాట్‌కు దారి లేకుండా మరీ కబ్జా చేసేస్తున్నారంటూ పలువురు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. రహదారులను ఆక్రమించడం, అడ్డంగా గోడ కట్టేయడంతో దారిలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆఖరుకు 20 గజాల స్థలాన్నికూడా వదలడంలేదని గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ వద్ద కబ్జా రుజువు చేస్తోంది.

నాలాలపైన ఉన్న వెడల్పు కిందకు వచ్చేసరికి విస్తరించాల్సింది పోయి, కుంచించుకు పోయిన దృశ్యాలు అనేకం ఉన్నాయి. ఇలా సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులు రాగా, అందులో ఎక్కువ శాతం రహదారులు, పార్కుల ఆక్రమణలపైనే ఉన్నాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్ ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఆ సమస్య పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

## సమస్య పరిష్కారానికి వెంటనే ఆదేశాలు


### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రజాపక్షం/కూకట్‌పల్లి: సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలానగర్ డివిజన్‌లోని శ్రీశ్రీ నగర్, ఇందిరా నగర్ బస్తీలో పర్యటించి ప్రజల సమస్యల తెలుసుకుని సమస్య పరిష్కారం దిశగా అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బస్తీల్లో నెలకొన్న డ్రైనేజ్, రోడ్లు, మంచినీటి సదుపాయాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేయాలని, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇందిరానగర్, శ్రీ శ్రీ నగర్ రూపురేఖలు మారాయని ఒకప్పుడు ఈ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలైన డ్రైనేజ్, రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు ఉండేవి కావని, మాజీ పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ సహకారంతో కాలనీ రూపురేఖలు మార్చామని అన్నారు. అతి త్వరలోనే పెండింగ్ పనులు కూడా పూర్తిచేసి అత్యంత సుందరంగా ఈ కాలనీలు తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ మొదలగు అన్ని విభాగాల అధికారులు బస్తీ వాసులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన కొర్ర ప్రవీణ్ నాయక్

ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజవర్గం బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు కొర్ర ప్రవీణ్ నాయక్ నర్సాపూర్ నియోజకవర్గం మూసాపేట్ తండాకు చెందిన మలావత్ అనిల్ ఆరోగ్య సమస్యతో హాస్పిటల్ లో చికిత్స తీసుకోవడంతో, కుతుబుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద సహకారంతో సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.60,000/– చెక్కుని మంజూరు చేయించారు. కొర్ర ప్రవీణ్ నాయక్ బాధితులకు చెక్కును అందజేశారు.





## జర ట్రాన్స్‌ఫారం పక్కకు తొలగించండి సారూ...

ప్రజాపక్షం/దుండిగల్:సూరారం ఎక్స్ రోడ్లో ఉన్నటువంటి ట్రాన్స్‌ఫారం చాలా ప్రమాదకరంగా మారిందని రాకపోకలు, భారీ వాహనాలు కాలనీలకు వెళ్ళేటప్పుడు దానికి తగిలే ప్రమాదం ఉందని సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్ అన్నారు. అనంతరం మాట్లాడుతూ ట్రాన్స్‌ఫారం తగిలితే పెద్ద ప్రమాదం సంభవించొచ్చని ఆర్టీసీ బస్సు గానీ, స్కూల్ బస్సుగానీ తగిలినచో పిల్లలకు పెద్ద ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని, ఇకనైనా దాన్ని తొలగిం చే ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్, సర్కిల్ కమిషనర్లకు వినతి పత్రం అందజేశారు.

## ప్రజావాణిలో 102 అర్జీలు





ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 102 అర్జీలను ధరఖాస్తుదారులు సమర్పించారు.

జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డిఆర్ ఓ హరిప్రియ, ఇతర ప్రభుత్వ జిల్లా స్థాయి కార్యాలయాధికారులతో కల్సి ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

## సమస్యలు పరిష్కరించాల్సిన కార్పొరేటరే ప్రజావాణిలో వినతులు : విస్తుపోతున్న ప్రజలు




ప్రజాపక్షం/మల్కాజిగిరి: అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సామాన్య ప్రజల మాదిరి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కి వెళ్లి సమస్యలు పరిష్కరించాలంటూ మొరపెట్టు కొంటున్న వైనమిది. జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయానికి ఆయన తరచు బిజెపి కార్యకర్తలను వెంట తీసుకొని వెళ్లి డివిజన్‌లోని ప్రాంతాల్లో సిసి రోడ్లు వేయించాల ని, నిధులు మంజూరు చేయాలని కోరటం, కొన్ని సందర్భాల్లో అధికారులు ప్రజా పను ల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ నిరసనలు వ్యక్తం చేయటం పరిపాటిగా మారింది.

తాజాగా సోమవారం ఆయన తన అనుయాయులతో కల్సి జిహెచ్ఎంసి అధికారులను కల్సి విష్ణుపురి కాలనీ, బలరాంనగర్, రాంబ్రహ్మనగర్, సింహాద్రినగర్,కేశవనగర్ ప్రాంతా ల్లో సిసిరోడ్లకుగాను నిధులు మంజూరు చేయాలని కోరారు. మరో పక్క జలమండలి జనరల్ మేనేజర్ సునీల్‌ను కల్సి డ్రైనేజి, బోర్‌వెల్ పంపుల మరమ్మత్తు పనులు చేయాలని, కోరారు.



## ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత


ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : నేడు ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్నా ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వచ్చిన పిర్యాదులను వేటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను అదేశించారు. సోమావారం సమీకృత కలెక్టర్ సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి 105 ఫిర్యాదులు ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ భూ సమస్యలు, పెంచనులకు సంబంధించిన ఫిర్యాదులను అందించారు. సందర్భంగా కలెక్టర్ ప్రతిక్‌జైన్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ ప్రతి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను అదేశించారు. వచ్చిన ఫిర్యాదుల పై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం తెలియజేయాలని చూచించారు. సిఎంఓ ప్రజావాణికి జిల్లాకు వచ్చిన ప్రజా ఫిర్యాదులను చెక్ చేసి ధరఖాస్తూ ఏ ప్రాసెస్‌లో ఉందో చేక్ చేసి అన్‌లైన్‌లో అప్‌డెట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్ అర్‌డిఓ వాసు చంద్ర, వివిద శాఖల జిల్లా అధికారులు సెక్షన్ సూపరిండెట్స్ తదితరులు పాల్గోన్నారు.

## ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : ఎంఆర్‌పిఎస్ మందకృష్ణ మాదిగతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్ అన్నారు. ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎంఆర్‌పిఎస్ 31వ సంవత్సరాలు మందకృష్ణ మాదిగ చేసిన సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మీసాల మల్లేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో మొట్ట మొదటగా ఎస్సీ వర్టీకరణ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం చేసారని మాదిగలకు 9శాతం మాలలకు 5శాతం అత్యంత వెనుకబడిన ఎస్సీ లకు మొత్తం మూడు గ్రూపులుగా చేసి ఎస్సీలను వర్గీకరించారని అన్నారు.ఈ కార్యక్రమంలో బక్కని నర్సింగ్ రావు, నాగులపల్లి శ్రీనివాస్, గంగారం ఆంజనేయులు,చిలుగూరి రవి,తోక బాలయ్య,బండారి రాందాస్,లాజర్,మహిపాల్, ఎడ్ల బాలయ్య, ఎర్రోళ్ల నవీన్, మన్నె నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాపక్షం/శామీర్‌పేట : తల్లిగారింటికి వెళ్లిన తన భార్య ఇంటికి రావడం లేదని భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శామీర్‌పేటకు చెందిన బోసాల నర్సింహ(26), ఇతడికి 8 నెలల క్రితం పూజ అనే మహిళతో వివాహమైంది. కాగా నర్సింహ వృత్తిరీత్యా డ్రైవర్ ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లగా తన భార్య పూజ పుట్టింటికి వెళ్లింది. తిరిగి వచ్చిన నర్సింహా భార్యకు ఫోన్‌చేసి ఇంటికి రావాలని కోరాడు. తాగుడు మానేస్తేనే ఇంటికి వస్తానని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నర్సింహా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూజ తన భర్తకు ఫోన్ చేయడంతో ఎంతకూ స్పందించలేదు. అల్లుడైన తిమ్మయ్య ఇంటికి వెళ్లి కిటికిలోంచి చూడగా నర్సింహా ఉరేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలలో ఐడి కార్డులకు వితరణ

ప్రజాపక్షం/కొడంగల్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు దాతల సహకారంతో గుర్తింపు కార్డులను అందించారు. సోమవారం దుద్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎన్జీవో సంస్థ దాతల సహకారంతో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ నేతృత్వంలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఐడి కార్డులను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కార్పోరేట్ స్థాయిలో ఉండాలనే సంకల్పంతో విద్యార్థులకు బట్టలు, షూస్, ఐడి కార్డులు, టై, బెల్ట్‌లు వంటివి అందించడం ఎంతో శుభపరిణామన్నారు. అందుకు విద్యార్థులలో అన్యోన్యతా భావం, ఆత్మగౌరవం పెంపొందుతుందని, వారిలో విద్యా నైపుణ్యం పెరుగుతుందని, ఆత్మభిమానంతో ముందుకు సాగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయరామరావు, పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, రాములు, తదితరులున్నారు.





# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## బికెఎంయు జిల్లా అధ్యక్షుడిగా ప్రభు



**ప్రజాపక్షం/శంషాబాద్ :** రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా శంషాబాద్‌కు చెందిన అన్నెపు ప్రభు ముదిరాజ్ ఎన్నికయ్యారు. రాజేంద్రనగర్‌లోని ఎఆర్ దేవరాజ్ భవన్‌లో శనివారం జరిగిన ఎఐటి యుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పనుగంటి పర్వతాలు, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అన్నెపు ప్రభుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం పోరాడటం ప్రధానలక్ష్యం అన్నారు. భవన నిర్మాణ కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా సంఘం తరఫున ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. రానున్న ఉద్యమాలకు కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతుగా నిలవాలని కోరారు. కాగా యువకుడు ప్రభు నాయకత్వ బాధ్యతల్లోకి రావడం పట్ల రాష్ట్ర నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయండి
### జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** కాలనీల్లో సమస్యలు ఉంటే కాలనీ సంక్షేమ వాసులు నేరుగా జిహెచ్ఎంసి కార్యాలయం, లేదా కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయాలని హయత్ నగర్ సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. సోమవారం డివిజన్‌లోని లక్ష్మి ప్రియా కాలనీలో మార్నింగ్ వాక్‌లో భాగంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి కాలనీలో పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. వర్షకాలం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ చంద్రశేఖర్, జవాన్ రామచంద్ర, శానిటేషన్ సూపర్వైజర్లు నాగేష్, యాదయ్య, కాలనీ వాసులు మధు, శ్రీధర్ గౌడ్, ఉపేందర్‌గౌడ్, పరుషరాములు, మురళి, అచ్చిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్, నరేష్ పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధి
### మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మన్సూరాబాద్ డివిజన్‌ను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని విష్ణు నగర్ కాలనీలో మార్నింగ్ వాక్‌లో కాలనీవాసులతో మాట్లాడుతూ కాలనీలో మిగిలిన రోడ్లను త్వరలోనే పూర్తి చేస్తామని, కాలనీ సంక్షేమ భవనం వద్ద ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మధునాయక్, ప్రసాద్, కృష్ణారెడ్డి, మాన్య నాయక్, భాస్కర్ నాయక్, రామ్ రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌కుమార్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, నవీన్ రావు, మోహన్‌రెడ్డి, కడారి యాదగిరి, శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన వైద్యసేవలతో గుర్తింపు




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** అత్యాధునిక వైద్య సదుపాయాలతో బాలాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వి.ఎస్.కేర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని బిజెపి మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుప్రతికి వచ్చే రోగులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యాన్ని అందించి మంచి పేరు ప్రఖ్యాతులు పొందాలన్నారు. కార్యకమంలో నాయకులు గంగాపురం వెంకట్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పసునూరి బిక్షపతిచారి, ఎడ్ల మల్లేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు కార్యాలయం తనిఖీ



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** గడ్డిఅన్నారం డివిజన్ జిహెచ్ఎంసీ వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారుల హాజరు, కార్యాలయం నిర్వహణ పరిస్థితులు, పరిసరాల పరిశుభ్రతను సమీక్షించారు. కార్యాలయంలో కొంత మంది అధికారులు హాజరుకాకపోవడం, పరిసరాల్లో చెత్త వాతావరణం ఉండటాన్ని గమనించిన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇటీవల వార్డు కార్యాలయం వద్ద కుక్కలు ప్రజలపై దాడి చేసిన ఘటన తీవ్రమైందన్నారు. అధికారులు విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు.

## క్రీడారంగంలో రాణించేందుకు కృషి
### జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి




**ప్రజాపక్షం/షాబాద్ :** యువత క్రీడ రంగంలో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ ఎస్‌పిఎల్3 క్రీడలు నిర్వహించారు. క్రీడల్లో విజయం సాధించిన యువతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎలుగంటి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గౌరీశ్వర్, శ్రీనివాస్, రఫిక్, గౌతమ్, ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి
### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం/కొత్తూరు:** అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని కస్తూర్బా హాస్టల్ నుండి పెద్దమ్మ తండా వరకు వేయనున్న సిసి రోడ్డు పనులకు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ రోడ్డు వల్ల విద్యార్థులతోపాటు ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబయ్య యాదవ్, రతన్‌నాయక్, రాందాస్ నాయక్, శంకర్ నాయక్, దేవ్‌సింగ్, బాబునాయక్ పాల్గొన్నారు.

# గోడ తీస్తే మూడు..మూస్తే ఎనిమిది కిలోమీటర్లు

### మల్లంపేట ప్రజల పోరాటం
### ప్రణీత్ ఆంటిల్యా ఆరాటం
### ఎట్టకేలకు సమస్య పరిష్కరించిన హైడ్రా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దారికి అడ్డంగా కట్టిన గోడ వేలాది ప్రజలకు గోసగా మారింది. ఆఖరుకు అది పోరాటంగా మారింది. ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్‌రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు సులభంగా చేరుకునే మార్గం దొరకక అవస్థలు పడిన వారు కొంతమంది అయితే. మాది గేటెడ్ కమ్యూనిటీ, మా కాలనీలోంచి రాకపోకలు బంద్ అంటూ అడ్డు గోడలు కడుతున్నవారు మరికొంతమంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట బాచుపల్లి గ్రామాల మధ్య నెలకొన్న వివాదం ఇది.

**గోడ తీస్తే.. గోస పోద్ది..**

మల్లంపేట ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ నుంచి బాచుపల్లి క్రాస్ రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్లు మాత్రమే. కాని దారి మధ్యలో ప్రణీత్ ఆంటిల్యా వారు నిర్మించిన అడ్డుగోడతో 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని మల్లంపేట గ్రామప్రజలతోపాటు మరో 10 కాలనీల వాసులో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రణీత్ ఆంటిల్యా వారు అడ్డుగోడ తీసేస్తే 60 నుంచి 40 ఫీట్ల వెడల్పుతో ఉన్న అడ్డ దారి లభిస్తుందంటున్నారు. వాస్తవానికి గేటెడ్ కమ్యూనిటీ కాదు, అయినా గోడ కట్టి మాది గేటెడ్ కమ్యూనిటీ అంటూ రాకపోకలను అడ్డుకుంటున్నారని మల్లంపేట వాసులు వాపోతున్నారు. మల్లంపేట ఎగ్జిట్ నుంచి మల్లంపేట విలేజ్, ప్రణీత్ లీఫ్‌కాలనీ, ఆకాష్ వెంచర్, డ్రీం వ్యాలీ కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ, సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, ఏపిఆర్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, లక్ష్మి శ్రీనివాస్ కాలనీ, హెచ్ఎండిఏ, ప్రణీత్ ఆంటిల్యా, బాచుపల్లి చౌరస్తా మీదుగా ప్రగతినగర్‌కు కేవలం 3 కిలోమీటర్ల రాజమార్గంలో రాడానికి అవకాశం ఉన్నా అడ్డుగోడలు పెట్టారని, దీంతో 25 వేల మందికిపైగా అవస్థలు పడుతున్నామని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. గతంలో ప్రణీత్ ఆంటిల్యా నివాసాల మధ్య నుంచి బళ్ల బాట ఉండేదని కూడా మల్లంపేటతో పాటు పరిసర నివాస ప్రాంతాలవారు చెబుతున్నారు. కానీ ప్రణీత్ ఆంటిల్యా వాదన మరోలా ఉంది.. ఆ గోడ తీస్తే మాకు గోస మొదలౌద్ది. మొత్తం ఈ కాలనీలు, బస్తీల నుంచి వచ్చే వాహనాలు మా కాలనీమీదుగా రాకపోకలు సాగిస్తే చాలా ఇబ్బందిగా పరిణమిస్తుందని ప్రణీత్ ఆంటిల్యా వాసులు వాపోతున్నారు.

**హైడ్రా పరిశీలించి చర్యలు...** మల్లంపేట ప్రజల ఫిర్యాదుపై హైడ్రా లోతైన పరిశీలన చేసింది. హెచ్ఎండిటట అనుమతులను పరిశీలించింది. ప్రణీత్ ఆంటిల్యా గేటెడ్ కమ్యూనిటీ కాదని, హెచ్ఎండిఏ అనుమతిచ్చిన లేఔట్ స్పష్టం చేస్తోంది. హెచ్ఎండిఏ అనుమతుల్లో 7వ అంశాన్ని పరిశీలిస్తే గేటెడ్ కమ్యూనిటీ కాదని, నివాస ప్రాంతాలకు చుట్టూ ప్రహరీ నిర్మించరాదని, మరీ ముఖ్యంగా రహదారులకు అడ్డంగా గోడలు నిర్మించరాదని, పక్కన ఉన్న కాలనీవాసులకు దారి చూపాలని ఎంతో స్పష్టంగా పేర్కొంది. ఆ క్రమంలోనే అక్కడి ప్రహరీలను హైడ్రా ఇటీవల తొలగించింది. తర్వాత ప్రణీత్ ఆంటిల్యా కాలనీ వాసుల నుంచి అభ్యంతరాలు రావడంతో మరింత లోతుగా అధ్యయనం చేసింది. ప్రణీత్ ఆంటిల్యా నివాసాల మధ్య నుంచే గతంలో బళ్లదారి ఉండేదని రెవెన్యూ అధికారులుచెబుతున్నారు. నిజాంపేట మున్సిపల్ అధికారులు ఇది గేటెడ్ కమ్యూనిటీ కాదని నిర్ధారించారు. దీంతో ఇరుపక్షాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇరు పక్షాల సమక్షంలోనే ఇది గేటెడ్ కమ్యూనిటీ కాదు, దారి ఇవ్వాల్సి ఉంటుందని సమావేశం నిర్ణయించింది.

## 10న విద్యారంగ సమస్యలపై సచివాలయం ముట్టడి : ఆప్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న సచివాలయం ముట్టడి నిర్వహించనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. హైదరాబాద్ లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు బుర్రా రాములుగౌడ్, మహమ్మద్ మజీద నర్సింగ్, యమునగౌడ్, విజయ్ మల్లంగి, శివాజీ, దర్శనం రమేశ్, సోహైల్, మౌనిక, ధర్మేంద్రతివారిలతో కలిసి ఆయన 'చలో సచివాలయం ముట్టడి' పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో వసతులు, ఉపాధ్యాయుల కొరత, నాసిరకం మధ్యాహ్న భోజనం, ఫీజురీయింబర్స్‌మెంట్ సమస్యలు తాండవిస్తున్నాయని, దీంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు లక్షల రూపాయలు ఫీజు వసూలు చేయడంతో విద్యార్థుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ స్కూల్లో విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సచివాలయం ముట్టడికి ఆప్ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.




## పకడ్బందీగా గోవధ నిషేధ చట్టం అమలు
### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దేశంలో గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నమో మిషన్ వందే గౌమాతరం వ్యవస్థాపకురాలు వీర మద్వీరాజ్ , బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా, హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, గో సంరక్షణ రంగాల్లో నమో మిషన్ వందే గౌమాతరం సంస్థ విశేష కృషిచేస్తుండటం అభినందనీయమన్నారు. అంతేగాక, గోవులకు ఆశ్రయం కల్పిస్తూ వైద్య సేవలు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఇంటికి గోవు ఉండాలని, అప్పుడు సంపదను సృష్టించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా నమో మిషన్ వందే గౌమాతరం యుఎస్ఏ ఎంపవర్‌మెంట్ వింగ్ అధ్యక్షుడిగా తెలంగాణకు చెందిన కీర్చిపల్లి రాజును నియమించారు. మద్వీరాజ్ మాట్లాడుతూ కీర్చిపల్లి రాజు నియామకం తెలంగాణలో మేధావుల కృషికి, అంతర్జాతీయ గుర్తింపు లభించడమే కాకుండా రాష్ట్రానికి గర్వకారణమన్నారు. సమావేశంలో గౌమాతరం నేతలు కవిత హైందవి, సుధాకర్, అంజి, వైభవ్ సూర్య, సినీ నటుడు పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతులకు ప్లాట్లు ఇవ్వడం సమంజసం కాదు
### ఫార్మా వ్యతిరేఖ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు వినతి

**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మాసిటీకి భూమలు ఇవ్వని రైతుల పేర్లపై ప్లాట్లు కెటాయించడం ఎంత వరకు సంమజసమని ఫార్మా ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహింపట్నం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఫార్మా ఉద్యమ నాయకులు మాట్లాడుతూ రైతుల ఇష్టాకిని వ్యతిరేఖంగా ప్రభుత్వం భూ సేకరణ చేస్తుందని ఆగ్రమం వ్యక్తం చేశారు. భూమి సర్వే నంబర్ ఎకరాలు ఎన్ని అనే విషయాలను నమోదు చేయలేదన్నారు. మా భూమికి నష్ట పరిహారంతో పాటు ప్లాటు తీసుకునేందుకు అంగీకరిస్తున్నామని ఉందని తెలిపారు. ఇక ముందుకు కోర్టుకు వేళ్ళమని అందులో రాసీ ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన కాగితాలపై సంతకం చేసిన అందులో మాభూమి అని రాసారని అన్నారు. పట్టా భూమి ఇవ్వడానికి కూడా ఒప్పుకున్నట్లు అందులో రాసారని అన్నారు. ఫార్మాసిటికి పట్టా భూములు ఇవ్వని రైతులు కోర్టు ద్వారా స్టే తెచ్చుకున్నారు. ఈ ఒప్పంద పత్రాల మీద సంతకం చేయించుకోని రైతులను మోసం చేసే ప్రమాదం ఉందన్నారు. భూములు ఇవ్వని ప్లాట్ల లిస్టులోంచి పేర్లను తోలగించాలని , ఒప్పంద పత్రాలను తిరిగి సవరించాలని కోరారు. లేని పక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు.



## కార్మిక హక్కుల రక్షణకు సార్వత్రిక సమ్మె
### సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి నర్సింగ్‌రావు



**ప్రజాపక్షం/గండిపేట :** కార్మిక హక్కుల రక్షణకు జూలై 9 జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాలు నర్సింగ్‌రావు, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని సిపిఐ ఎఆర్ దేవరాజ్ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని, వాటి రద్దు కోసం కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందన్నారు. కనీస వేతన చట్టాన్ని పక్కకు పెట్టి బడా పెట్టుబడిదారులకు, పారిశ్రామిక వేత్తలకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఒకవైపు కనీస వేతనాన్ని పెంచాలని కార్మికులు పోరాటం చేస్తుంటే, పని దినాన్ని తగ్గించమని అడుగుతుంటే మోదీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలో భాగంగా గుజరాత్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు కార్మికుల పని దినాన్ని 10 గంటలుగా నిర్ణయించడం బడా పెట్టుబడి పారిశ్రామికవేత్తలకు మోదీకి మేలు చేకూర్చే విధంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంఎ రియాజ్, అంబేద్కర్ నగర్ కార్యదర్శి బండారి శాంతమ్మ, జ్యోతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు
### సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండానేనని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో జరిగిన సిపిఐ 10వ మండల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై జంగయ్య మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన నిలబడి కూడు, గూడు, భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం రాజీలేని పోరాటం సిపిఐ చేస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతోమంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేశారన్నారు. అమరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు జంగయ్య పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సిపిఐ నాయకులు నడుం బిగించాలన్నారు. ఈప్రాంతంలో ప్రజా సమస్యలపై పోరాటాలతో పార్టీ బలోపేతానికి సిపిఐ నాయకులు సమిష్టిగా కృషిచేయాలన్నారు. పార్టీకి పూర్వ వైభవం తేవాలని నాయకులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలమున్న చోట పోటీ చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. నూతన మండల కమిటీ అట్టడగు వర్గాల ప్రజల చైతన్యం కోసం పాటుబడాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య గౌడ్, నాయకులు ఎండి అలిమొద్దీన్, హన్మంత రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజంలో మార్పు





### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/కొందుర్గు:** విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ నిధులతో నిర్మాణం చేసిన సైన్స్ ల్యాబ్ భవనాన్ని ప్రారంభించారు. అలాగే మండల పరిధిలోని పులుసుమామిడిలో ఉన్న కెజిబివిలో నిర్మాణం చేసిన అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో, పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన కెజిబివి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున అందజేశారు.

**విరాళాల వెల్లువ...** కెజిబివి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ఎమ్మెల్యే పిలుపుతో దాతలు ముందుకు వచ్చారు. గోపాల్ రెడ్డి రూ.5లక్షలు, విద్యార్థులను కలుసుకోవడానికి వచ్చిన సమయంలో తల్లిదండ్రులకు షెల్టర్ లేకపోవడంతో, దానిని నిర్మాణం చేయిస్తానని కె.కృష్ణ ముందుకు వచ్చారు. పర్వతాపూర్ గ్రామానికి చెందిన మల్లేష్ గౌడ్ ఒక లక్ష రూపాయలు, మాజీ వైస్ ఎంపీపీ మంగులాల్ నాయక్ ఒక లక్ష రూపాయలు, పిఎసిఎస్ చైర్మెన్ చిట్టెం దామోదర్ రెడ్డి ఒక లక్ష రూపాయలు, మహిపాల్‌రెడ్డి 20వేలు, వీరేష్ లైబ్రెరికి ర్యాక్ ఇప్పించేందుకు ముందుకు వచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎ కృష్ణారెడ్డి వాష్ ఏరియాలో షెడ్ వేయిస్తానని, ఉమ్మెంత్యాల గ్రామానికి చెందిన రాయికంటి కృష్ణారెడ్డి, బ్యాటరీ, ఇన్‌వెర్టర్‌ను పాఠశాలకు అందజేస్తానని హామీ ఇచ్చారు. దాతలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. కార్యక్రమాల్లో ఎంపిడిఒ అనురాధ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపినాథ్, ఎంఇఒ గాయిత్రిదేవి, కెజిబివి ప్రత్యేక అధికారిణి షకీనా నిస్సి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, పిఎసిఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎ.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూరు :** ఒక్క ఏడాదిలోనే రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో సింగిల్‌విండో నూతన భవనం, గోదాముల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నరసింహా, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, చేగూరు సింగిల్‌విండో చైర్మన్ అశోక్, కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, కుమారస్వామిగౌడ్, కొమ్ము కృష్ణ, తుపాకుల శేఖర్, సీతారాములు, కెకె కృష్ణ, వెంకటచారి, దామోదర్‌రెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఫార్మా రైతులకు వంద శాతం హక్కులతో ప్లాట్లు
### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/యాచారం :** ఫార్మా రైతులకు పారదర్శకంగా, వంద శాతం హక్కులతో ప్లాట్లు అందజేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్ పేట్ రెవెన్యూలో ఏర్పాటు చేసిన లేఅవుట్లో యాచారం, కందుకూరు మండలాల పరిధిలోని 7 గ్రామాలకు చెందిన భూనిర్వాసితులకు సోమవారం లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని సదుపాయాలతో లేఅవుట్‌ను రూపొందించి ప్రభుత్వం రైతులకు విలువైన స్థలాలను అందిస్తుందని, అదే విధంగా రిజిస్ట్రేషన్ సైతం చేసి ఇస్తుందని తెలిపారు. లేఅవుట్ నుంచి భవిష్యత్తులో రేడియల్ రోడ్డు వస్తోందని, రైతులు ఎవరూ ప్లాట్లను అమ్ముకోవద్దని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. అనంతరం కలెక్టర్ అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. మొదటి రోజు 670 మంది రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ప్లాట్ల కేటాయింపు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల మేనేజింగ్ డైరెక్టర్ కె.శశాంక, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి, డిపిఒ సురేష్ మోహన్, ఆర్‌డిఒలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రీల్

## కథ నచ్చితే గ్లామర్ రోల్స్ చేస్తా

మాళవిక మనోజ్



తమిళంలో 'జో' అనే చిత్రంతో తెరకు పరిచయమైన నటి మాళవిక మనోజ్. తెలుగులో ఈ చిత్రంతో తెలుగులో ఓ భామ అయ్యో రామ' సినిమాతో తెరంగేత్రం చేసింది. జూలై 11న చిత్రం విడుదల కానున్న సందర్భంగా కథానాయిక మాళవిక మనోజ్ సోమవారం పాత్రికేయులతో చిట్ చాట్ నిర్వహించారు.

*** తెలుగులో ఛాన్స్ ఎలా వచ్చింది ?**

నేను తమిళంలో నటించిన చిత్రం 'జో'లో నా అభినయం చూసి దర్శకుడు రామ్ 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో హీరోయిన్‌గా సెలక్ట్ చేసుకున్నాడు. కథ వినగానే నాకు ఎంతో నచ్చింది.

*** స్టోరీలో ఏం నచ్చింది ?**

అది సింగిల్‌లైన్‌లో చెప్పలేను. చాలా డిఫరెంట్‌గా అనిపించింది. గతంలో నేను చేసిన సినిమాల్లో విలేజ్ సింపుల్ గర్ల్‌గా చేశాను. ఈసినిమలో నా పాత్ర ఎంతో మోడ్రరన్‌గా, హైపర్‌గా, అటిట్యూడ్‌తో ఉంటుంది. ప్రతి నటికి కావాలసిన వైవిధ్యమైన పాత్ర లభించింది. ఈ చిత్రంలో సత్యభామ అనే పాత్రలో కనిపించాను. ఈ సినిమా కోసం ఎలాంటి వర్క్ పాప్, హోంవర్క్ చేయలేదు. నా రియల్‌లైఫ్‌కు ఎలాంటి కంపారిజిన్ లేని పాత్ర సత్యభామ పాత్ర. నాకు తెలుగు రాకపోయినా.. దాని భావం అర్థం చేసుకుని నటించాను.

*** తెలుగులో నటించడం ఎలా అనిపించింది?**

చాలా హ్యాపీగా అనిపించింది. తెలుగు టెక్నిషియన్స్, ఆర్టిస్ట్‌ల్లో ఎంతో ప్రొఫెజనలిజం వుంది. ఎంతో కంపర్టబుల్‌గా నటించాను. లాంగ్వేజ్ తప్ప నాకు తెలుగులో ఎలాంటి ప్రాబ్లమ్ అనిపించలేదు. అన్ని లాంగ్వేజ్‌ల మాదిరిగా నాకు ఇక్కడ ఎక్కడ కంఫర్టబుల్‌గా అనిపించింది.

*** ఈ చిత్రంలో ఛాలెంజింగ్ అనిపించిన సన్నివేశం ఏమైనా?**

ఈ సినిమాలో కోసం నాకు స్విమింగ్ రాకపోయినా.. ఓ సన్నివేశంలో షూటింగ్ వాయిదా పడటం ఇష్టం లేక నేను భయపడుతూనే స్విమింగ్ చేశాను. నాకు ఎంతో భయమేసిన సినిమా కోసం చేశాను.

*** హీరో సుహాస్‌తో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్?**

వెరీ నైస్ పర్సన్. ఎంతో హార్డ్‌వర్క్ చేస్తాడు. సినిమా సెట్‌లో సినిమా కోసం మాత్రమే మాట్లాడతాడు. పెద్ద టాకింగ్ పర్సన్ కాదు.

*** మీ ఫ్యామిలీ నేపథ్యం ఏమిటి?**

సినిమా నేపథ్యంతో సంబంధం లేని ఫ్యామిలీ నాది. ఫ్యామిలీ సపోర్ట్‌తోనే నటిస్తున్నాను. కానీ అందరూ బంధువులు మొదట్లో భయపడ్డారు. నాకు మాత్రం ఎలాంటి భయం లేదు. సినిమాల్లో నటించడం గర్వంగా ఉంది. ఇప్పుడు ట్రైలర్ చూసి మా ఫ్యామిలీ ఎంతో హ్యాపీగా ఫీలయ్యారు.

*** గ్లామరస్ రోల్స్ చేస్తారా?**

గ్లామరస్ రోల్స్.. చేయాలా వద్దా? అనే నిబంధన నాకు లేదు. కథ నచ్చితే నాకు కంఫర్టబుల్‌గా అనిపించిన రోల్స్ మాత్రమే చేశాను. నాకు నచ్చని పాత్రలు నేను చేయను.

## 11న 'దీర్ఘాయుష్మాన్ భవ'

కార్తీక్‌రాజు, నోయల్, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లుగా ఎం.పూర్ణానంద్ దర్శకత్వంలో త్రిపుర క్రియేషన్స్ పతాకంపై నిర్మాత వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించిన 'దీర్ఘాయుష్మాన్ భవ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. కాగా ఈ చిత్రం ట్రైలర్, ప్రోమోస్, పాటలను హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో పలువురు అతిథులు ఆవిష్కరించారు. ట్రైలర్‌ను తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ప్రోమోస్‌ను ప్రముఖ నటుడు ఓ.కల్యాణ్, పాటలను జబర్దస్త్ ఆర్.పి. ఆవిష్కరించారు.





## ఫిలిం ఛాంబర్ ఎన్నికలు నిర్వహించాల్సిందే

### చిన్న నిర్మాతల డిమాండ్



ఈనెలాఖరులో ఫిలిం ఛాంబర్ నేతల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఖచ్చితంగా ఫిలిం ఛాంబర్ ఎన్నికలు నిర్వహించాలని పలువురు చిన్న నిర్మాతలు డిమాండ్ చేశారు. ఫిలిం ఛాంబర్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు చిన్న నిర్మాతలు మాట్లాడారు. తెలుగు ఫిలిం ఛాంబర్ మాజీ అధ్యక్షుడు బసి రెడ్డి అన్నారు. ఈ నెలాఖరులో ఫిలిం ఛాంబర్ కమిటీ పదవి కలం ముగుస్తుందని, కానీ ఇంతవరకు జనరల్ బాడీ పెట్టలేదన్నారు. గత నెలలో జరిగిన ఈసీ సమావేశంలో ఛాంబర్ కమిటీ పదవి కాలాన్ని ఒక ఏడాది కాలం పాటు పొడిగిస్తూ తీర్మానం చేశారన్నారు. ఇది ఫిలిం ఛాంబర్ బైలాకు విరుద్ధమని చెప్పారు. ఈసి మీటింగ్‌లో ఈ నిర్ణయాన్ని సి. కళ్యాణ్, అశోక్, రామదాసు లాంటి నిర్మాతలు వ్యతిరేకించారని తెలిపారు. అయినా ఛాంబర్ కమిటీ ఎన్నికలకు వెళ్లకుండా మొండిగా వ్యవహరించడం సరైంది కాదని చెప్పారు. ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కార్మికుల వేతనాలు పెంచమన్నారు. ఈ కమిటీ ఇంతవరకు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదన్నారు. కొరోనా కాలంలో మాత్రమే ఎన్నిక వాయిదా వేశామని, మిగితా సమయాల్లో ఎప్పుడు ఫిలిం ఛాంబర్ ఎన్నికలు వాయిదా వెయ్యలేదని అన్నారు. ఇప్పుడున్న కమిటీ సమయం ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని బసి రెడ్డి డిమాండ్ చేశారు. చిత్రపురి కాలనీ వ్యవహారానికి, ఫిలిం ఛాంబర్ ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని, గడువు ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే ఫిలిం ఛాంబర్ ఎన్నికలు జరపాలని రామకృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిర్మాతలు నాయుడు, శంకర్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

**ఏడాది పాటు పదవీ కాలం పొడిగించాం : ఛాంబర్ కార్యదర్శి**

తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ పదవి కాలం ఈనెలాఖరుతో ముగుస్తోంది కాబట్టే గత నెలలో జరిగిన ఈసీ సమావేశంలో మరో ఏడాది పాటు పొడిగిస్తూ తీర్మానం చేశామని ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ చెప్పారు. ప్రసాద్ ల్యాబ్‌లో ఓ సినిమా ఈవెంట్‌కు హాజరైన దామోదర్ ప్రసాద్ ను ఛాంబర్ ఎన్నికలపై వివరణ కోరగా ఏడాది కాలం పాటు పొడిగించిన మాట వాస్తవమేనని అన్నారు. కొన్ని అత్యంత కీలకమైన సమస్యలు పరిష్కారం చెయ్యాల్సి ఉందని, అందుకే ఈసీ సమావేశంలో తీర్మానించారన్నారు. ఈసీ సమావేశానికి హాజరు కాకుండా మీడియాతో మాట్లాడితే ఏం చేయలేమన్నారు.



## పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌లో సాగర్ వెరీ ఫిట్


**'ది 100' ప్రీ-రిలీజ్‌లో మంత్రుల కితాబు**

ఆర్కే సాగర్ కమ్ బ్యాక్ ఫిల్మ్ 'ది 100'. ఈ హైఆక్టేన్ క్రైమ్ థ్రిల్లర్‌ను రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించారు. కెఆర్ఐఎ ఫిల్మ్ కార్ప్స్, ధమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై రమేష్ కరుటూరి, వెంకి పుషడపు సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం 11న థియేటర్స్‌లోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. తెలంగాణ మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిధిలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా సినిమాటోగ్రఫీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రైట్ టైంలో రైట్ సినిమా ఇది. సినిమా ట్రైలర్ చూస్తున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనే సినిమా ఫస్ట్ డే చూడాలని నిర్ణయించుకున్నాను. సైబర్ క్రైమ్ నేపధ్యంలో వున్న ఈ సినిమా సమాజానికి చాలా ముఖ్యం. సొంత టాలెంట్ తో గొప్ప స్థాయికి ఎదిగారు. భవిష్యత్తులో తను చాలా గొప్ప హీరో అవుతారు. ట్రైలర్ చూసిన తర్వాత నాకు అలా అనిపించింది. పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌లో సాగర్ అద్భుతంగా ఫిట్ అయ్యాడు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ చాలా అద్భుతంగా ఉంది. పవర్ ఫుల్ యాక్టింగ్ ద్వారా గొప్ప మెసేజ్ అందించారు. సాగర్ నాకు చాలా సంవత్సరాల నుంచి పరిచయం. మా ప్రాంత వాసి. సొంతగా ఎదిగి ఇంత దూరం వచ్చాడు. మొగలిరేకులతో చాలా అద్భుతమైన పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడు. తన క్యారెక్టర్స్ అన్నీ పవర్ఫుల్‌గా ఉంటాయి. తన ఇంకా గొప్ప స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. తను చాలా మంచి టాలెంట్ ఉన్న వ్యక్తి. ఈ సినిమా ఒక పవర్ఫుల్ వెపన్‌లా ఉంటుంది. చాలా మంచి కథ ఫ్యామిలీతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇది ఒక ధైర్యాన్ని సాహసాన్నిచ్చే సినిమా. డైరెక్టర్ చాలా అద్భుతంగా సినిమాలు తీశారు. సమాజంలో జరుగుతున్న చాలా సమస్యలకి సమాధానం దొరికే సినిమా అవుతుందని ఆశిస్తున్నాం.

హీరో ఆర్కే సాగర్ మాట్లాడుతూ త్రేతాయుగంలో రామబాణం, ద్వాపర యుగంలో సుదర్శన చక్రం, కలియుగంలో ది 100. ఇది రాసి పెట్టుకోండి. ఈ సినిమాకి అంత పవర్ ఉంది. ఈ సినిమా మస్ట్‌గా చూడాలి. కమర్షియల్ మూవీ. వెరీ టచింగ్ పాయింట్. ఇది ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా. ప్రతి ఫ్యామిలీ చూడాలి అన్నారు. మిశా, ధన్య బాలకృష్ణ, డైరెక్టర్ రాఘవ్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## 9న 'అతడు' రీరిలీజ్



మహేష్ బాబు, త్రిష జంటగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అతడు సినిమా మరోసారి విడుదల చేస్తున్నారు. ఈ సినిమా తొలిసారిగా విడుదలైనప్పుడు సూపర్ డూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం రీరిలీజ్ పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో మహేష్ బాబు నటించిన అతడు సినిమాను రీ రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. 9న మరోసారి థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు మణిశర్మ అందించారు. ఇతర పాత్రల్లో రాజీవ్ కనకాల, కోట శ్రీనివాస్ రావు, షాయాజీ షిండే, అజయ్ తదితరులు నటించారు. ఈ సినిమాను ఫోర్‌కె రెజులేషన్‌లో విడుదల చేస్తున్నారు.

## 'ఎలీ ఇండియా' మేగజైన్ కవర్ పైజీపై నభా నటేష్



ప్రముఖ మేగజైన్ ఎలీ ఇండియా తన జూలై ఎడిషన్ కవర్ పేజీపై బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్ ను పబ్లిష్ చేసింది. తన పర్ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ తో సౌత్ ఇండియన్ సినిమాలో నభా తనదైన ప్రత్యేకతను సంపాదించుకుందని ఎలీ ఇండియా మేగజైన్ కవర్ పేజీ స్టోరీలో పేర్కొంది. ఎలీ ఇండియా మేగజైన్ కవర్ పేజీపై పబ్లిష్ కావడం నభా నటేష్‌కు దక్కిన పెద్ద గౌరవంగా భావించవచ్చు. ఇటీవలే నభా 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్'గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకోవడం విశేషం.

నభా లేటేస్ట్‌గా తెలుగులో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా మూవీస్ చేస్తోంది. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు మూవీలో నభా నటేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో ఉంది. అలాగే నాగబంధం అనే పాన్ ఇండియా మూవీలోనూ నటిస్తోంది. ఈ రెండు చిత్రాలతో నభా నటేష్ మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

## తానా సభలో పాట ఆవిష్కరణ

ఎమ్3 మీడియా పతాకంపై మహా మూవీస్ సౌజన్యంతో బిగ్ బాస్ ఫేమ్ అమరదీప్ చౌదరి, నటి సురేఖ వాణి కూతురు సుప్రీతా నాయుడు హీరో, హీరోయిన్‌గా మాల్యాద్రి రెడ్డి దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మిస్తున్న చిత్రం 'చౌదరి గారి అబ్బాయితో నాయు డు గారి అమ్మాయి'. ఈ చిత్రం నుండి ఎంత ముద్దుగున్నావే అనే పాటను అమెరికాలో జరిగిన తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా), నాట్స్ (నార్త్ అమెరికా తెలుగు సొసైటీ) వేడుకల్లో వేలాది మంది ప్రవాస భారతీయుల సమక్షంలో ఆవిష్కరించారు.



## రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ స్టూడియో

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రముఖ సినీ నటుడు అజయ్ దేవగన్

### యానిమేషన్, విఎఫ్ఎక్స్ స్టూడియోల ఏర్పాటుకు ఓకే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ స్టూడియో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రముఖ సినీ నటుడు అజయ్ దేవగన్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో అజయ్ దేవగన్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సినిమాల నిర్మాణంలో కీలకమైన యానిమేషన్, విఎఫ్ఎక్స్ స్టూడియో, ఎఐ, ఇతర సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టూడియో నిర్మాణాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలని అజయ్ దేవగన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అంతర్జాతీయ స్థాయి స్టూడియో నిర్మాణంతో పాటు సినీ పరిశ్రమలో వివిధ విభాగాలకు అవసరమైన నిపుణులను అందుబాటులోకి తెచ్చేందుకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అజయ్ దేవగన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి, వివిధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిఎం రేవంత్ రెడ్డి అజయ్ దేవగన్‌కు వివరించారు. తెలంగాణ రైజింగ్‌కు సంబంధించి మీడియా, సినిమా రంగాలకు ప్రచారకర్తగా ఉంటానని అజయ్ దేవగన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. సమావేశంలో సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



## ఎటిఎంలా మత్స్యశాఖ

(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకారుల సంక్షేమం, అవగాహనపై జరిగిన సదస్సులో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన చేప పిల్లల పంపిణీలో అనేక అవకతవకలతో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. గతంలో మత్స్యశాఖలో జరిగిన అవినీతి వల్ల మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. తొలిసారి ముదిరాజ్ బిడ్డకు సిఎం రేవంత్‌రెడ్డి మత్స్యశాఖ మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. గతంలో వచ్చిన అవినీతి మచ్చ తొలగించేలా ఇప్పటికే అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నానని, మత్స్య శాఖను ఆదర్శంగా తీర్చిదిద్దేలా తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. చేపలు ప్రకృతి ఇచ్చిన సంపద అని, మత్స్యకారులకు నాణ్యమైన చేప పిల్లలు పంపిణీ చేస్తామన్నారు. త్వరలోనే కేబినెట్‌లో చేప పిల్లలు పంపిణీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 87కోట్ల చేప పిల్లలు పెంచేలా చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు ఉన్నాయని తెలిపారు. కరీంనగర్‌లో చేపల ఉత్పతి మెరుగ్గా ఉందన్నారు. ఈ యేడాది 82 కోట్ల చేప పిల్లలు విడుదల చేస్తామని వెల్లడించారు. ముదిరాజ్ కార్పోరేషన్, ఫిషరీస్ కార్పోరేషన్‌లు సైతం ఉన్నాయన్నారు. తెలంగాణ చేప ఉత్పత్తిలో నెంబర్ వన్‌లా ఉండేలా కార్యచరణ తీసుకుంటామన్నారు. అలాగే జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామన్నారు. విద్యా ఉద్యోగాల్లో కాకుండా రాజకీయాల్లోనూ బడుగులకు అవకాశం కల్పించాలని రాహుల్‌గాంధీ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కులగణన చేసే ప్రక్రియలో బిసి బిల్లు పెట్టే అవకాశం పొన్నంకి దక్కిందన్నారు. కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీలు ఎంత అనేది శాస్త్రీయంగా తెలిసిందన్నారు.



**మత్స్యసంపదను పెంచేలా కృషి : మంత్రి పొన్నం**

తెలంగాణలో మత్స్య సంపదను పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చేపల్లి ఉత్పత్తికి సంబంధించి ప్రభుత్వం జిల్లాలో లోయర్ మానేర్ డ్యామ్, మిడ్‌మానేరు, ఎల్లంపల్లితో పాటు అనేక గొలుసుకట్టు చెరువుల నుంచి చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున పెంచేలా చర్యలు తీసుకుంటుందన్నారు. గత పదేళ్లలో చేప పిల్లల పంపిణీ, కొనుగోలు, మత్స్యశాఖలో అవినీతి కారణంగా మొదటి సంవత్సరం చేప పిల్లల పంపిణీ కొంత ఆలస్యం జరిగిందన్నారు.

**పలు అభివృద్ధి పనుల ప్రారంభాలు**

అంతకుముందు కరీంనగర్‌లోని పాత ఆర్ట్స్ కాలేజీ వద్ద రూ.36లక్షల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) అదనపు తరగతి గదుల నూతన భవనాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్‌తో కలిసి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియాన్ని సందర్శించారు. ఇండోర్ స్టేడియం, గ్రౌండ్, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. ఎల్ఎండి మానేరు డ్యాం పరిసరాల్లో సప్తగిరి కాలనీ వాకింగ్ ట్రాక్ వద్ద వనమహోత్సవంలో భా గంగా మంత్రులు మొక్కలు నాటారు. కరీంనగర్‌లోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌లో రూ.26లక్షలతో నూతన స్విమ్మింగ్ పూల్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం సింథటిక్ ట్రాక్ వద్ద రూ.10 లక్షలతో లైటింగ్ ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేశారు. కరీంనగర్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌ను ఇంటర్మీడియట్ వరకు పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ క్రీడా మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, మేడిపల్లి సత్యం, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మత్స్యకారులు, ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## యువత ముందుకు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన స్నాతకోత్సవంలో ప్రసంగించారు. ప్రయోగాశాలకే కాకుండా జీవితంలో కూడా సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణాలోనే ఒక మహత్తర విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది అన్నారు. న్యాక్ ఎ+ గ్రేడింగ్, 151 – 200 బ్యాండ్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, దేశంలోనే మూడవ యూఐ గ్రీన్ మెట్రిక్, జాతీయ స్థాయిలో ఫార్మసీ కళాశాల 84 వ ర్యాంకింగ్ ఇవన్ని విశేష విజయాలు అని, ఇవన్ని కేవలం వనరుల వల్ల మాత్రమే సాధ్యం కాదని ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యార్థుల విజన్, పట్టుదల వల్ల సాధ్యం అయినవి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ అనట్లు 'విద్య అంటే శరీరం, మనస్సు, ఆత్మ అన్నింటిలోనే అత్యుత్తమని వెలికి తీయడమేనని, జాతీయ విద్యా విధానం 2020 దిశగా ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాల మెరుగుదల దీనికి అనుగుణంగా కృత్రిమ మేధా, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, న్యూట్రిషన్ సైన్సు కోర్సులు కాకతీయ యూనివర్సిటీ లో ప్రారంభించడం అభినందనియం అన్నారు. స్నాతకోత్సవం అంటే ఒక ముగింపు కాదని, ఒక కొత్త ప్రయాణం అని భారత పూర్వపు రాష్ట్రపతి ఎ.పి.జే. అబ్దుల్ కలాం అన్న మాటలు గుర్తు చేసారు. ముఖ్య అతిదిగా హాజరైన హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ కెమికల్ టెక్నాలజీ సంచాలకులు, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహిత డాక్టర్ డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ స్నాతకోత్సవం అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ఆనందభరితమైన క్షణం అన్నారు. మీ విజయానికి కారణమైన తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులకు కృతజ్ఞత గా ఉండాలని, గ్రామీణ ప్రాంతం, తెలుగు మాధ్యమం అడ్డంకి కాదు అని, మన లక్ష్యం ముఖ్యం అన్నారు. భారత ప్రభుత్వం యువత అభివృద్ధికి స్కిల్ ఇండియా, పిఎంకేవై, స్టార్ట్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటి కార్యక్రమాలు ప్రారంభించింది అన్నారు. జాతీయ స్థాయి సంస్థ అయిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ కెమికల్ టెక్నాలజీ ద్వారా తక్కువ ఖర్చులతో మందులు, ఖరోన సమయంలో దేశీయ టీకా, పర్యావరణ హిత న్యాప్కిన్‌లు, వ్యర్థాల నిర్వహణ విజయాలు అన్నారు. గోల్డెన్ జూబిలీ సందర్భంగా విశ్వవిద్యాలయంలో గోల్డెన్ జూబిలీ అకాడమిక్ కాంప్లెక్స్, పి.వి.నరసింహ రావు పరిశోధన, విజ్ఞాన కేంద్రం, 1000 పడకల గర్ల్స్ హాస్టల్, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో సెంటినరీ బ్లాక్ ల నిర్మాణానికి ప్రభుత్వానికి డి.పి.ఆర్. పంపినట్టు తెలిపారు. కృత్రిమ మేడా, డేటా సైన్సు, పబ్లిక్ హెల్త్ లాంటి కోర్సులు ప్రారంభిస్తామన్నారు. మొత్తం 446 గోల్డ్ మెడల్స్, 374 మంది విద్యార్థులకు పిహెచ్‌డి ప్రధానం చేసారు. అంతకుముందు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఆడిటోరియంలో బోకేతో స్వాగతం పలికారు. అనంతరం అకాడమిక్ సెనేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ ఎన్.సుదర్శన్, డాక్టర్ చిరా రాజు, డాక్టర్ సుకుమారి, ప్రొఫెసర్. ఎం.నవీన్, కే.అనిత రెడ్డి, బాలు చౌహాన్, పుల్లూరి సుధాకర్, పూర్వపు ఉప కులపతిలు ఆచార్య ఎన్. లింగ మూర్తి, ఆచార్య బి.వెంకట్ రత్నం, అకాడమిక్ సెనెట్ సభ్యులు డాక్టర్ అంపశయ్య నవీన్, మాణిక్యం, గొల్లపూడి జగదీశ్, డీన్ లు కామర్స్ డీన్ లు ఆచార్య రాజేందర్ కట్ల, సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ విభాగాల డీన్ ఆచార్య బి.సురేష్ లాల్, సైన్సు విభాగాల డీన్ ఆచార్య జి.హనుమంత్, న్యాయ విభాగల డీన్ ఆచార్య ఎం.శ్రీనివాస్, ఇంజనీరింగ్ డీన్ ఆచార్య ఎం.సదానందం పాల్గొన్నారు.

## ట్రంప్ ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసుకోవాలని ట్రంప్ తన ఒత్తిడిని ఉద్ధృతం చేశారు. ఈ మేరకు ట్రంప్ యంత్రాంగం సోమవారం నుండి అన్ని దేశాలకు టారిఫ్ లేఖలు పంపడం ప్రారంభించింది. ఆగస్టు ఒకటో తేదీ నుండి భారీగా పెంచిన టారిఫ్‌లు అమలులోకి వస్తాయి. ఆ తదుపరి ఏ దేశాలు అమెరికాతో వాణిజ్యం చేయడానికి గుర్తింపు పొందుతాయి? ఏ దేశాలు గుర్తింపు కోల్పోతాయి? అనే విషయంపై అమెరికన్ కంపెనీలు, ఏజన్సీలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఐతే ట్రంప్‌కు సలహాలిచ్చే ఉన్నతస్థాయి వాణిజ్య నిపుణులు ఈ గడువును అధ్యక్షుడు పెంచుతారని చెబుతున్నారు. కానీ దేశాలపై ఈలోపు తీవ్రమైన ఒత్తిడి పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేసినట్లు భోగట్టా. సంప్రదింపులకు ఎప్పుడు స్వస్తి చెప్పాలన్న సమయాన్ని ట్రంప్ నిర్దేశిస్తారని వైట్‌హౌస్‌లో నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హస్సెట్ 'ఫేస్ ద నేషన్' కార్యక్రమంలో సిబిఎస్‌కు చెప్పారు. ప్రతిదేశంతో, ప్రతివిషయంపై క్షుణ్ణంగా చర్చించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

## ఉమ్మడిగా కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఖనిజ వనరులను, వాటి సాంకేతికతను సరఫరాచేయడంలో, రక్షించుకోవడంలో మనం ఉమ్మడిగా విశ్వసనీయమైన కృషి చేయాల్సిన అవసరం ఉంది. మనలో ఏ ఒక్క దేశం కూడా ఆ వనరులను తమ స్వార్థ ప్రయోజనాలకోసం దుర్వినియోగం చేయబోమనీ లేదా ఇతర దేశాలపై ఒక ఆయుధంగా వాటిఇని ప్రయోగించబోమని భరోసా ఇవ్వాలి'' అన్నారు. లిథియం, నికెల్, గ్రాఫైట్ వంటి ఖనిజాలను కీలకమైన ఖనిజ వనరులుగా పరిగణిస్తారు. వీటిని అత్యుత్తమమైన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసే ఉత్పత్తులకు ఉపయోగిస్తారు, విద్యుత్ వాహనాలు (ఇవి), డ్రోన్లు, బ్యాటరీ స్టోరేజీలకు నికెల్, గ్రాఫైట్, లిథియంలను వినియోగిస్తారు. అదేవిధంగా కృత్రిమ మేధ రోజు రోజుకూ సరికొత్త మెరుగులు దిద్దుకుంటూ నిత్యజీవన కార్యకలాపాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతోందని మరోవైపు దీనివల్ల నైతిక విలువలకు సంబంధించిన సమస్యలు, వివక్ష, మోసం, ఇతర అపాయాల ప్రమాదం పెరుగుతుందన్న ఆందోళనలు కూడా పెరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది భారతదేశం ''కృత్రిమ మేధ ప్రభావంపై సదస్సు''ను నిర్వహిస్తుందని ప్రకటించారు.

కృత్రిమ మేధ నిర్వహణా వ్యవస్థలో నవీన ఆవిష్కరణలకు ఎంత ప్రోత్సాహాన్ని ఇస్తామో అంతకు సమానంగా మన ఆందోళనలను కూడా ఎ.ఐ పరిష్కరిస్తుందని మేం నమ్ముతున్నామన్నారు.

'ఆన్‌లైన్‌లో సృష్టించే డిజిటల్ కంటెంట్‌ను తనిఖీ చేసేందుకు ఒక అధికారిక వ్యవస్థను సృష్టించాలి, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రామాణికతలను కాపాడాలి, అలా చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో ఈ డిజిటల్ కంటెంట్ ఉత్పత్తిస్థానాన్ని గుర్తించగలుగుతాం, తద్వారా ఎలాంటి రహస్యాలు లేకుండా ఈ కంటెంట్‌ను దుర్వినియోగం కాకుండా మనం బాహాటంగా చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది' అని మోదీ చెప్పారు.

**ప్రపంచ సవాళ్ళపై 'బ్రిక్స్' చర్చలు**

ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న అనేక సవాళ్ళను బ్రిక్స్ సదస్సులో నాయకులు చర్చించారు. చైనా–రష్యా దేశాధ్యక్షుడు జిన్‌పింగ్, పుతిన్ ఇద్దరూ ఈ సారి బ్రిక్స్ సదస్సుకు హాజరుకాలేదు. వారి తరపున వారి మంత్రివర్గ ప్రతినిధులు హాజరయ్యారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, ఈజిప్టు నేత అబ్దెల్ ఫతా ఎల్ సిసి కూడా హాజరుకాలేదు. ప్రపంచంలో 11 శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలను ఒకేవేదికపైకి తీసుకువచ్చిన ఘనత బ్రిక్స్‌కే దక్కుతుంది. ప్రపంచ జనాభాలో 49.5 శాతం ప్రజలకు ప్రస్తుతం బ్రిక్స్ వేదిక ప్రాతినిధ్యం వహిస్తున్నది. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా 40 శాతం స్థూల జాతీయోత్పత్తికి బ్రిక్స్ దేశాలు చోదకశక్తిగా ఉన్నాయి. పారిశ్రామికంగా వెనుకబడిన దేశాలకు బ్రిక్స్ సహాయం చేయాలని మోదీ ఈ సదస్సులో కోరారు.

**టారిఫ్‌ల పెంపు, ఇరాన్‌పై దాడిని ఖండించిన 'బ్రిక్స్' సదస్సు**

టారిఫ్‌ల పెంపును, ఇరాన్‌పై దాడిని బ్రిక్స్ దేశాల సదస్సు తీవ్రంగా ఖండించింది. ఐతే ట్రంప్ పేరును మాత్రం బ్రిక్స్ సదస్సు ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ మేరకు సదస్సు ఒక తీర్మానం చేసింది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను కూడా దృష్టిలో పెట్టుకుని సదస్సు తీర్మానం చేసింది. అదేవిధంగా ఉక్రేన్‌పై దాడి చేస్తున్న రష్యాపై విమర్శలకు కూడా దూరంగా ఉంది. చైనా,రష్యా ప్రధాన నాయకులు ఈ సదస్సుకు ఈసారి హాజరుకాలేదు. ఐతే అమెరికాపై పరోక్షంగా బ్రిక్స్ తీర్మానం విమర్శలు చేసింది. టారిఫ్‌లు పెంచడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విధంగా టారిఫ్‌లు పెంచడం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఈ విధమైన ఆంక్షలవల్ల ప్రపంచ వాణిజ్యం తగ్గిపోతుందని, ప్రపంచ సరఫరా వ్యవస్థకు విఘాతం కలుగుతుందని, ఒక అనిశ్చితదశ ప్రారంభం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న 'బ్రిక్స్'తో సంబంధాలు పెట్టుకున్న ఏ దేశంపైన అయినా 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామని ఆదివారం నాడు ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. ట్రంప్ ప్రకటనను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా డసిల్వా మాట్లాడుతూ, జిడిపిలో ఏటేటా కేటాయింపులు పెంచుతూ 2035 నాటికి ఐదుశాతం మొత్తాన్ని సైనిక వ్యయాలకు మళ్ళించాలని నాటో చేసిన తీర్మానాన్ని విమర్శించారు. ఈ ధనాన్ని యుద్ధంలో పెట్టుబడపెట్టేబదులుగా, శాంతి యుత ప్రయోజనాలకు మళ్ళించడం ఎంతో సులభమని బ్రిక్స్ సదస్సును ప్రారంభిస్తూ ఆయన అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com